www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
గురువారం

వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి। 07, మార్చి 2024
సంపుటి: 5 సంచిక: 287, పేజీలు: 12, వెల: రూ.5/-

బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు
కావలెను
తెలంగాణ రాష్ట్రంలో వెలుతురు తెలుగు దిన పత్రిక, యందు పని చేయుటకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
86398 40328
రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, హైదరాబాద్, నల్లగొండ, సూర్యపేట, యాదాద్రి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట. జిల్లా కేంద్రాల్లో ఉండి పనిచేసేవారికి ప్రాధాన్యత

మా ప్రభుత్వం జోలికి వస్తే
అంతు చూస్తా...

- వారు పదేళ్లు పాలిస్తే మాపై అప్పుడే విమర్శలా
- పాలమూరు బిడ్డ సిఎం కావడం తట్టుకోలేకపోతున్నారు
- రాష్ట్రం కోసం మోడీతో అయినా..కెడితో అయిన కొట్లాడుతా
- మర్యాద ఇవ్వడంలో మన సంస్కృతిని నిలబెట్టా
- కేంద్రంతో సంఘర్షణ వైఖరితో తెలంగాణకు నష్టం
- కెసిఆర్‌ను గెలిపిస్తే ఏం చేయలేకపోయాడు
- కాలు ఇరిగిందని చెప్పి .. విమర్శలు చేస్తున్నాడు
- బిఆర్ఎస్ ప్రభుత్వ చిక్కుముళ్లు విప్పుతున్నాం
- 30వేల ఉద్యోగాల భర్తీతో యువతకు భరోసా కల్పించాం
- పాలమూరు వేదికగా ఎన్నికల శంఖం పూరించిన సిఎం రేవంత్

మహబూబ్‌నగర్,మార్చి6(వెలుతురు): ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన తమ ప్రభుత్వం జోలికొస్తే అంతు చూస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మహబూబ్ నగర్‌లో నిర్వహించిన 'పాలమూరు ప్రజాదీవెన' సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పదవులు కాదు కార్యకర్తలే శాశ్వతమని ఎప్పుడూ నేతలకు చెబుతూ ఉంటా. సామాన్య కార్యకర్త నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించా. ప్రధాని మోదీకి వినతిపత్రం ఇస్తే కొందరు విమర్శిస్తున్నారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని అడగాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిగా నాపై ఉంది. ఘర్షణ వైఖరి ప్రభుత్వాల మధ్య ఉండొద్దనే వినతిపత్రం ఇచ్చాం. అడిగిన పనులు చేయకపోతే చాకిరేవు పెడతాం. తెలంగాణ అభివృద్ధికి మోదీ సహకరించకపోతే అన్ని రాష్ట్రాలు తిరిగి మరీ కేంద్రంపై పోరాటం చేస్తా. కేటీఆర్, హరీశ్‌రావును చూస్తే.. భారాస 'బిల్లా రంగా సమితి' అనిపిస్తుంది. పాలమూరు ప్రజలు ఇచ్చిన అండతో దేశంలోని మోదీ, రాష్ట్రంలోని కేడీతోనైనా కొట్లాడతా. పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత నేను తీసుకుంటానని అన్నారు. వంశీచందర్‌రెడ్డిని ఎంపీగా, జీవన్‌రెడ్డిని పాలమూరు శాసనమండలి అభ్యర్థిగా గెలిపించండి. కృష్ణా జలాలు రాయలసీమకు తరలించుకుపోతుంటే కేసీఆర్ ఏం చేశారు? త్వరలోనే పేదవాడి సొంతింటి కల నెరవేర్చేందుకు ఈనెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించబోతున్నాం. తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తాం. 11 వేలకు పైగా ఖాళీలతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. కేసీఆర్ వేసిన చిక్కుముళ్లను ఒక్కొక్కటిగా విప్పుతూ నిరుద్యోగులకు న్యాయం చేస్తున్నాం. 3 నెలలుగా విశ్రాంతి లేకుండా సచివాలయానికి వెళ్తూ ప్రజా సమస్యలపై చర్చిస్తున్నాం అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా, మోదీ ప్రధానిగా పదేళ్లు ఉండొచ్చు.. కానీ, ఇందిరమ్మ రాజ్యం, పేదోళ్ల ప్రభుత్వం వస్తే ఆరు నెలలు కూడా ఉండనీయరట. ఇదెక్కడి న్యాయం? ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని పడగొడతామనడం.. దేశానికి మంచిదా? విజ్ఞులు, మేధావులు ఆలోచన చేయాలని సిఎం అన్నారు. దుర్మార్గమైన రాజకీయాలకు పాతరేయాలి. పాలమూరు పేద బిడ్డ ఈ రాష్ట్రాన్ని పాలించకూడదా? ఈ ప్రభుత్వాన్ని పడగొట్టే దమ్ము ఎవరికీ లేదు.. మా జోలికొస్తే అంతు చూస్తాం. నల్లమల నుంచి తొక్కుకుంటూ వచ్చి కేసీఆర్‌ను రోడ్డుకు ఈడ్చా. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది. తెలంగాణలో 14 ఎంపీ సీట్లు కాంగ్రెస్ గెలవాలి.. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలి' అని సీఎం అన్నారు. ఇకపోతే రాష్ట్ర ప్రయోజనాల కోసం మోదీతో అయినా.. కేడీతో అయినా

మిగతా.. 2లో

నేడు ఢిల్లీకి సిఎం రేవంత్ రెడ్డి

- కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ప్రకటించే ఛాన్స్
- గెలుపు గుర్రాలు లక్ష్యంగా అభ్యర్థులు ఎంపిక

న్యూఢిల్లీ,మార్చి6(వెలుతురు): కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ప్రకటించనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఏఐసీసీలో జరిగే స్క్రీనింగ్ కమిటీ సమావేశానికి సీఎం హాజరు కానున్నారు. తెలంగాణ లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తును ఏఐసీసీ పూర్తి చేయనుంది. ఒకటి రెండు రోజుల్లో మెజారిటీ లోక్‌సభ స్థానాలను ఏఐసీసీ ప్రకటించనుంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ముగిసిన విషయం

మిగతా.. 2లో

పురుషులతో సమానంగా పోటీపడుతున్న మహిళలు

- మాతృస్వామ్య వ్యవస్థలో తల్లికి అపూర్వ గౌరవం
- బిట్స్ మహిళా దినోత్సవంలో గవర్నర్ తమిళిసై

హైదరాబాద్,మార్చి6 (వెలుతురు): ఈ రోజుల్లో పురుషులతో సమానంగా మహిళలు పోటీపడుతున్నారని తెలంగాణ గవర్నర్ తమిళిసై అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో రాచకొండ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, మహిళా అధికారులు, పోలీసు విభాగాలకు చెందిన ఇతర సిబ్బంది సదస్సుకు హాజరై కుటుంబం సమాజంలో మహిళల పాత్రను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ మాట్లాడుతూ.. భారతదేశం శతాబ్దాల తరబడి అనుసరించిన మాతృస్వామ్య వ్యవస్థను

మిగతా.. 2లో

18 నుంచి టెన్త్ పరీక్షలు

- అందుబాటులోకి హాల్‌టిక్కెట్లు

హైదరాబాద్,మార్చి6(వెలుతురు): తెలంగాణలో మార్చి 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరుగుతాయి. ఈ క్రమంలో మార్చి 7న పదో తరగతి పరీక్షల హాల్ టికెట్లను బోర్డు విడుదల చేయనుంది. ఇప్పటికే పాఠశాలలకు విద్యార్థుల ప్రింటెండ్ హాల్ టికెట్లను పదో తరగతి పరీక్షల బోర్డు పంపించింది. అయితే వెబ్ సైట్ నుంచి కూడా హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకునేందుకు వీలు కల్పించింది. పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా టెన్త్ పరీక్షల కోసం 2,676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈసారి 5,08 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు టెన్త్ పరీక్షలు జరగనున్నాయి. మరోవైపు, మార్చి 18వ తేదీనే ఇంటర్ పరీక్షలు ముగియనున్నాయి.

మిగతా.. 2లో

మారుతున్న జాతీయ రాజకీయ సమీకరణాలు

- బిజెపికి చేరువవుతున్న అనేకమంది నేతలు
- పాత్రుల కోసం విపక్షాలతో రాజీపడుతున్న కాంగ్రెస్
- రాహుల్ పోటీపై కానరాని స్పష్టత
- తెలంగాణలో పోటీకి నేతల యత్నాలు

న్యూఢిల్లీ,మార్చి6(వెలుతురు): లోక్‌సభ ఎన్నికల వేళ దేశంలో రాజకీయ పరిణామాలు శర వేగంగా మారుతున్నాయి.. ప్రధాన పార్టీలన్నీ దూకుడు పెంచాయి. వరుసగా మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ పక్కా వ్యూహంతో

నదీగర్భ మెట్రోకు ప్రధాని మోడీ ప్రారంభం

- మమతతో కలసి జెండా ఊపిని మోడీ
- మెట్రోలో ప్రయాణిస్తూ ప్రజలకు అభివాదం

కోల్‌కతా, మార్చి 6 (వెలుతురు): దేశంలో తొలి అండర్ రివర్ మెట్రో రైలును ప్రధాని మోదీ బుధవారం కోల్ కతాలో ప్రారంభించారు. కోల్‌కతా ఈస్ట్ వెస్ట్ మెట్రో కారిడార్ కింద హుగ్లీ నది దిగువన రైలు మార్గాన్ని నిర్మించారు. ఇందుకోసం రూ.120 కోట్ల ఖర్చు చేశారు. కోల్‌కతా ఈస్ట్ వెస్ట్ మధ్య 16.6 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని నిర్మించారు. 10.8 కిలోమీటర్లు భూగర్భంలో ఉంది. హావ్‌డా మైదాన్ నుంచి ఎస్‌ప్లెనెడ్ స్టేషన్ల మధ్య 4.8 కిలోమీటర్ల మేర ఉన్న లైన్‌లో భాగంగా 520 మీటర్ల పొడవు గల అండర్‌వాటర్ మెట్రో టన్నెల్ నిర్మించారు. నదిలో ఈ దూరాన్ని మెట్రో రైలు 45 సెకన్లలో పూర్తి చేస్తుంది.

మిగతా.. 2లో

ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే నా తెలంగాణ ఊరుకోదు

- రేవంత్ రెడ్డికి తెలంగాణ ఆత్మ లేదు..
- తెలంగాణపై గౌరవం అంతకన్నా లేదు
- తెలంగాణ సోయి లేనోడు సీఎం కావడం మన ఖర్మ
- మోదీ సాక్షిగా తెలంగాణ ఆత్మగౌరవంపై రేవంత్ దాడి చేస్తున్నాడు
- సిఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

హైదరాబాద్,మార్చి6(వెలుతురు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ ఆత్మ లేదు.. తెలంగాణపై గౌరవం అంతకన్నా లేదు అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. తెలంగాణ సోయి లేనోడు సీఎం కావడం మన ఖర్మ అని మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవం విలువ తెలవనోడు సీఎంగా ఉండటం మన దౌర్భాగ్యం అని విమర్శించారు. నా తెలంగాణ దేనినైనా సహిస్తుంది కానీ.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే మాత్రం ఊరుకోదు అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

మిగతా.. 2లో

మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులకు సిద్ధంగా ఉన్నాం

- నేడు మేడిగడ్డ బ్యారేజ్ సందర్శించనున్న ఎన్డీఎస్ఏ కమిటీ
- కమిటీ నివేదిక ఇచ్చాకే మరమ్మత్తులపై చర్చలు
- త్వరగా ప్రాజెక్ట్ అందుబాటులోకి రావాలని కోరుకుంటున్నాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, మార్చి 6 (వెలుతురు): మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులకు సిద్ధంగా ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. అయితే ఎన్డీఎస్ఏ కమిటీ రిపోర్ట్ వచ్చే వరకు ఎలాంటి

మిగతా.. 2లో

గ్రూప్ పరీక్షల షెడ్యూల్ విడుదల

- జూన్ 9న గ్రూప్ 1 ప్రిలిమ్స్
- ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష
- నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు

హైదరాబాద్,మార్చి6(వెలుతురు): తెలంగాణలో నిరుద్యోగులకు శుభవార్త వచ్చింది. నియామక పరీక్షల తేదీలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. గ్రూప్ 1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్ష తేదీలను బుధవారం

మిగతా.. 2లో

12 నుంచి రంజాన్ మాసం ప్రారంభం

హైదరాబాద్,మార్చి6(వెలుతురు): పవిత్ర రంజాన్ మాసం మార్చి 12వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గంట ముందే ఇంటికి వెళ్లేలా వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 12 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు ముస్లిం ఉద్యోగులు సాయంత్రం 4 గంటలకే తమ విధులు ముగించుకుని ఇంటికి వెళ్లొచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నెలవంక దర్శనం మరుసటి రోజు నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇస్లాంలో రంజాన్ మాసానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. దివ్య గ్రంథమైన పవిత్ర ఖురాన్ ఈ మాసంలోనే దివి నుంచి భువిపైకి అవతరించింది. దీనికి ప్రతీకగా ఈ మాసంలో ఉపవాసాలను ఆచరిస్తారు. రంజాన్ మాసంలో సూర్యోదయానికి ముందు ముస్లింలు ఉపవాస దీక్షను ప్రారంభించి ప్రార్థనల్లో పాల్గొంటారు. సాయంత్రం సూర్యాస్తమయం అనంతరం ఉపవాస దీక్షను విరమిస్తారు.

పురుషులతో సమానంగా పోటీపడుతున్న మహిళలు

మొదటిపేజీ తరువాయి..

గుర్తు చేస్తూ దానిని కొనియాడారు. ఒక మహిళగా జన్మించడం చాలా అదృష్టమని అభిప్రాయపడ్డారు. ఒక పురుషుని జీవితంలో తల్లిగా, సోదరిగా, భార్యగా, స్నేహితురాలుగా స్త్రీలు బహుళ పాత్రలు పోషిస్తారు కాబట్టి పురుషులు వారి జీవితంలో మహిళలు లేకుండా మనుగడ సాగించలేరని అన్నారు. మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉందని, ఏదైనా సాధించగలరని అన్నారు. తన విద్య మరియు వృత్తిపరమైన ఎదుగుదలలో, ప్రజా సేవా రంగంలో ప్రవేశించి గవర్నర్ పదవి వరకూ చేరుకోవడంలో పడిన కృషిని పేర్కొన్నారు. తన కుటుంబం నుండి తనకు లభించిన సహకారాన్ని ఆమె వివరించారు. వారి జీవితంలో ఎదుర్కొన్న రంగు, ఎత్తు వంటి రకరకాల వివక్షలను, వారి ప్రతిభను ప్రదర్శించడంలో ఎదురైన అవరోధాలను అధిగమించిన తీరును వివరించారు. మహిళా అధికారులందరూ పోలీసు శాఖలో భాగమై సమాజానికి చేస్తున్న కృషిని అభినందించారు. మహిళలు డాక్టరు, న్యాయవాదులుగా, ఉపాధ్యాయులుగా మాత్రమే కాక పోలీసు అధికారులుగా కూడా సమర్థవంతంగా పని చేయగలరని, గృహ హింస మరియు వైవాహిక వివాదాలలో బాధితులైన మహిళలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు మహిళా పోలీసు అధికారులు అనేక రకాల విధులను నిర్వహించగలరని గవర్నర్ పేర్కొన్నారు. మహిళా అధికారులందరూ తమ పూర్తి శక్తితో పని చేయాలని సూచించారు. మహిళలు తమ కలల సాకారం కోసం అహర్నిశలూ పాటుపడాలని సూచించారు. రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం సందర్భంగా తమ గళాన్ని వినిపించిన వక్తలందరినీ అభినందించారు. మహిళా అధికారులు , సిబ్బంది పురుషుల కంటే తక్కువ కాదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో తల్లి మొదటి స్నేహితురాలు, గురువు అని, తల్లి ద్వారానే ప్రతీ ఒక్కరూ ప్రపంచానికి పరిచయం అవుతారు అని, సమాజాన్ని అర్థం చేసుకుంటా రని పేర్కొన్నారు.

పురుషుల కంటే స్త్రీలకు నిబద్ధత ఎక్కువ కాబట్టి ఏదైనా సాధించగలరని అభిప్రాయ పడ్డారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో వేల మంది మహిళలు సమర్థవంతంగా పని చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. మహిళా అధికారులందరూ తమ వృత్తిపరమైన బాధ్యతలను గౌరవంగా నిర్వహించాలని ఆయన సూచించారు.

18 నుంచి టెన్త్ పరీక్షలు

మొదటిపేజీ తరువాయి..

పదో తరగతి పరీక్షల షెడ్యూల్
మార్చి 18: ఫస్ట్ లాంగ్వేజ్(తెలుగు, కాంపోజిట్ కోర్సు)
మార్చి 19: సెకండ్ లాంగ్వేజ్(హిందీ)
మార్చి 21: థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లీష్)
మార్చి 23: మ్యాథమెటిక్స్, మార్చి 26: సైన్స్ పేపర్ -1(ఫిజిక్స్)
మార్చి 28: సైన్స్ పేపర్ -2(బయాలజీ)
మార్చి 30: సోషల్ స్టడీస్, ఎప్రిల్ 1: ఒకేషనల్ కోర్సు (సంస్కృతం, అరబిక్ మొదటి పేపర్), ఎప్రిల్ 2: ఒకేషనల్ కోర్సు(సంస్కృతం, అరబిక్ రెండో పేపర్)

గ్రూప్ పరీక్షల షెడ్యూల్ విడుదల

మొదటిపేజీ తరువాయి..

నాడు టీఎస్ పీఎస్సీ ప్రకటించింది. ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష నిర్వహించనున్నారు. నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షలను నిర్వహిస్తామని ప్రకటించారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ జూన్ 9న నిర్వహించనున్నారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు అక్టోబర్ 21 న ప్రారంభం కానున్నాయి.తెలంగాణ వచ్చి పదేళ్లు అవుతున్నా, ఒక్కసారి కూడా గ్రూప్-1 పోస్టులు భర్తీ కాలేదు. గత నోటిఫికేషన్ రద్దు చేసి, మొత్తం 563 పోస్టుల భర్తీకీ కమిషన్ ఫిబ్రవరి 19న నోటిఫికేషన్ విడుదల చేసింది. డిగ్రీ అర్హత ఉన్నవారు గ్రూప్-1 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. గత నోటిఫికేషన్ సమయంలో దరఖాస్తు చేసుకున్నవారు తాజా నోటిఫికేషన్ కు ఎలాంటి ఫీజు కూడా చెల్లించాల్సిన అవసరంలేదు. సరైన అర్హతలున్న అభ్యర్థుల నుంచి ఫిబ్రవరి 23 నుంచి మార్చి 14న సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరించనున్నారు. గరిష్ఠవయోపరిమితి 44 సంవత్సరాల నుంచి 46 సంవత్సరాలకు పెంచారు.

83 'గ్రూప్-2' పోస్టుల భర్తీకి గతంలోనే నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే పరీక్షా తేదీలను వాయిదా వేస్తూ వచ్చింది గత ప్రభుత్వం. చివరగా నవంబర్ నెలలో గ్రూప్ 2 ఎగ్జామ్ రీషెడ్యూల్ చేయగా.. ఎన్నికల షెడ్యూల్ కారణంగా ఈ ఏడాది జనవరిలో నిర్వహించడానికి రీషెడ్యూల్ చేసింది గత బోర్డ్. అంతలోనే ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్ పీఎస్సీ కమిషన్ చైర్మన్ గా మాజీ డీజీపీ మహేందర్ రెడ్డిన నియమించింది. ఈ క్రమంలో ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష నిర్వహించనున్నట్లు తాజాగా ప్రకటించారు. మున్సిపల్ కమిషనర్, ఏసీటీవో, తహసిల్దార్, సబ్-రిజిస్ట్రార్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, మండల పంచాయతీ అధికారి, ప్రొహిబిషన్ / ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. తెలంగాణలో 'గ్రూప్-3' ఉద్యోగాల భర్తీకి టీఎస్ పీఎస్సీ 2022 డిసెంబరు 30న నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 1363 ఖాళీలను భర్తీ చేయనున్నారు. పలు విభాగాల్లో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అకౌంటెంట్, ఆడిటర్, సీనియర్ ఆడిటర్, అసిస్టెంట్ ఆడిటర్, అకౌంటెంట్ పోస్టులను టీఎస్ పీఎస్సీ భర్తీ చేయనుంది. గ్రూప్-3 పరీక్షలను నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహిస్తామని ప్రకటించారు.

తెలంగాణ నిరుద్యోగులకు బిగ్ అలర్ట్. టీఎస్‌పీఎస్‌సీ(÷ూఖాఅ) కీలక ప్రకటన విడుదల చేసింది. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షల షెడ్యూల్‌ను(ఇలీజీప ÷ూఖ÷ఠటబ్లీ÷) ఖరారు చేసింది టీఎస్‌పీఎస్‌సీ. ఇందుకు సంబంధించి ఒక ప్రకటన విడుదల చేసింది. ఇప్పటికే పాత గ్రూప్ 1 నోటిఫికేషన్ రద్దు చేసి కొత్త గ్రూప్ 1 నోటిఫికేషన్‌ను విడుదల చేసిన టీఎస్‌పీఎస్‌సీ తాజాగా ఎగ్జామ్ షెడ్యూల్‌ను ప్రకటించింది.

మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులకు సిద్ధంగా ఉన్నాం...

మొదటిపేజీ తరువాయి..

రిపేర్లు చేయబోమన్నారు. వారు ఇచ్చే నివేదిక ఆధారంగానే మరమ్మత్తులు చేపడతామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకే ఎన్డీఎస్ఏ కమిటీ పర్యటిస్తుందని తెలిపారు. గురువార్ ఉదయం మెడిగడ్డ, అనంతరం అన్నారం, రాత్రి రామగుండం ,మార్చి8న సుంధిల్ల బ్యారేజ్‌లను కమిటీ సందర్శిస్తుందని అన్నారు. కమిటీకి పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం వద్ద ఉన్న అన్ని డాక్యుమెంట్స్ కమిటీకి ఇవ్వాలని కోరారు. ఎవరైనా కమిటీకి సహకారం ఇవ్వకపోతే, డాక్యుమెంట్స్ దాచితే కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బ్యారేజి డ్యామేజ్‌కి కమిటీ రీజన్స్ చెప్పాలన్నారు. సమస్యకు కారణం ఎవరు అనేది అడిగామని.. వర్షాలు రాకముందే ఎలాంటి స్టెప్స్ తీసుకోవాలో చెప్పాలన్నారు. టెస్టుల కోసం ప్రపంచంలో అత్యాధునిక టెక్నాలజీ వాడాలని కమిటీకి సుచించామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. రిపేర్ చేసిన తరవాత మేడిగడ్డ మళ్ళీ అందుబాటులోకి వస్తే రాష్ట్రాని మంచిదన్నారు. వర్షాకాలంకు ముందే అందుబాటులోకి ఇంకా మంచిదని చెప్పారు. నాగేందర్ ఆధ్వర్యంలో అయ్యర్ కమిటీ పర్యటిస్తుం దన్నారు. ప్రాథమిక రిపోర్ట్ రాగానే తప్పులు ఉంటే నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకుంటామని చెప్పారు ఉత్తమ్. ఎల్ అండ్ టీ రాష్ట్రంలో అనేక వ్యాపారాలు చేస్తోంది. తాము చట్ట ప్రకారం ముందుకు వెళ్తున్నాం. నిర్మాణ సంస్థకు భాధ్యత ఉండాలి. జుడిషియల్ ఎంక్వైరీపై త్వరలోనే ముందడుగు ఉంటుందని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

లహరి ఎసి బస్సుల్లో 10శాతం రాయితీ

ఆర్టీసీ ఎండి సజ్జన్నార్ వెల్లడి

హైదరాబాద్,మార్చి6(వెలుతురు): సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. లహరి ఏసీ స్లీపర్, ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సుల్లో బెర్తులపై 10 శాతం రాయితీని ప్రకటించింది. ఈ సర్వీసులు తిరిగే అన్ని రూట్లలోనూ ఈ రాయితీ వర్తిస్తుందని సంస్థ ఎండీ సజ్జనార్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా వెల్లడించారు.

ఏప్రిల్ 30 వరకు డిస్కౌంట్ అమల్లో ఉంటుందని తెలిపారు. లహరి ఏసీ స్లీపర్ బస్సులు హైదరాబాద్ నుంచి చెన్నై, తిరుపతి, విశాఖపట్నం, బెంగళూరు రూట్లలో నడుస్తుండగా.. లహరి ఏసీ స్లీపర్ కమ్ సీటర్ సర్వీసులు హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్‌కు, గోదావరిఖని - బెంగళూరు, కరీంనగర్ - బెంగళూరు, నిజామాబాద్ - తిరుపతి, నిజామాబాద్ - బెంగళూరు, వరంగల్ - బెంగళూరు రూట్లలో అందుబాటులో ఉన్నాయి.

నేడు ఢిల్లీకి సిఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి..

తెలిసిందే. మరోవైపు తెలంగాణ కాంగ్రెస్ కూడా ఎంపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అభ్యర్థుల ఎంపిక బాధ్యత రేవంత్‌కు అధిష్ఠానం అప్పజెప్పింది. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితులను రేవంత్ హై కమాండ్‌కు వివరించనున్నారు. గెలుపు గుర్రాలకే సీట్లు ఇస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. తొలి జాబితాలో సీటు దక్కించుకునేందుకు ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణలో ఏకాభిప్రాయం ఉన్న సీట్లను ఏఐసీసీ నేడు ప్రకటించనుంది. తెలంగాణలో 17కి 17 సీట్లు గెలుస్తామని ధంకా బజాయిస్తున్న కాంగ్రెస్, గెలుపు గుర్రాలను రంగంలోకి దించే కసరత్తును చివరిదశను తీసుకొచ్చింది. చాలా సెగ్మెంట్లలో ఇప్పటికే అభ్యర్థులు షార్ట్‌లిస్ట్ అయ్యారు. నేడు ఢిల్లీలో కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ భేటీ అవుతోంది. తొలిజాబితాలో తెలంగాణ సీట్లను కాంగ్రెస్ ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణపై కాంగ్రెస్ ఫోకస్ చేస్తోంది. మహబూబ్‌నగర్ సీటుకు కాంగ్రెస్ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డి పేరును ఇప్పటికే సిఎం రేవంత్ ప్రకటించారు.

మిగతా సీట్లపై మాత్రం హైకమాండ్ ప్రకటన చేస్తుందని చెబుతున్నారు. ఒకవైపు తెలంగాణ నుంచి బరిలోకి దిగాల్సిందిగా రాహుల్‌గాంధీని కాంగ్రెస్ నేతలు కోరారు. కేరళలోని వాయనాడ్‌లో సిపిఐ ఈసారి కూడా తమ అభ్యర్థిని బరిలోకి దించడంతో, తెలంగాణ నుంచి ఆయన్ను బరిలోకి దించడానికి కాంగ్రెస్ నేతలు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో 17 సీట్ల టార్గెట్‌ను చేరుకోవాలంటే పార్టీకి మరింత జోష్ కావాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇందుకోసమే రాహుల్‌గాంధీని పోటీకి దించేలా లాబీయింగ్ చేస్తున్నారు. ఇప్పటికే ఎంపీ అభ్యర్థిగా చల్లా వంశీచంద్ రెడ్డిని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి.. షెడ్యూల్ కంటే ముందే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే పార్లమెంట్ పరిధిలో పాలమూరు న్యాయ యాత్ర పేరుతో వంశీచంద్ రెడ్డి పర్యటన పూర్తి చేసుకున్నారు. ఈ యాత్ర ముగింపు సభకు ప్రజా దీవెన సభగా నామకరణం చేశారు. పాలమూరు ప్రజా దీవెన సభా వేదికగా జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి పలు వరాలు ప్రకటిస్తారని సమాచారం. విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తూ పలు విద్యాసంస్థల ఏర్పాటుకు సంబంధించిన ప్రకటన చేసే అవకాశం ఉంది. మహబూబ్ నగర్ జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గ ఉపఎన్నిక అభ్యర్థిని కూడా ప్రకటిస్తారని చెబుతున్నారు. ఇకపోతే నాగర్ కర్నూలు నుంచి తన పోటీ ఖాయమని మరో కాంగ్రెస్ నేత మల్లు రవి ప్రకటించారు. తనకు కాంగ్రెస్ అధిష్ఠానం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అంటున్నారు. ఈ విషయం కూడా నేటి జాబితా ప్రకటనతో తేలిపోనుంది.

ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే.. నా తెలంగాణ ఊరుకోదు

మొదటిపేజీ తరువాయి..

మోదీ సాక్షిగా తెలంగాణ ఆత్మగౌరవంపై రేవంత్ దాడి చేస్తున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. గోల్ మాల్ గుజరాత్ మోడల్‌కు, గోల్డెన్ తెలంగాణ మోడల్‌తో పోలికెక్కడిది..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఘనమైన "గంగా జెమునా తెహజీబ్ మోడల్" కన్నా.. మతం పేరిట చిచ్చు పెట్టే "గోద్రా అల్లర్ల మోడల్" నీకు నచ్చిందా..? అని నిలదీశారు. నిన్న మొన్నటి దాకా గుజరాత్ మోడల్‌పై నిప్పులు చెరిగిన రేవంత్.. ఇవాళ ప్రధాని పక్కన సీటు ఇవ్వగానే.. ఆయన గురించి గొప్పలు మాట్లాడుతున్నారు. ఇదేం నీతి.. ఇదేం రీతి.. రేవంత్ అంటూ కేటీఆర్ దుయ్యబట్టారు. దేశం మెచ్చిన ఈ తెలంగాణ నమూనాను నమో ముందు కించ పరుస్తావా..? నమ్మి ఓటేసిన తెలంగాణపై ఎందుకీ నయవంచన? నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెడతావా..?? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు కేటీఆర్. నాడేమో.. తెలంగాణ "ఉద్యమకారులపై రైఫిల్ ఎత్తావ్.." నేడేమో "తెలంగాణ ఆత్మగౌరవంపై దెబ్బ కొట్టావ్.." నిన్ను చరిత్ర క్షమించదు అని రేవంత్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు.

నదీగర్భ మెట్రోకు ప్రధాని మోడీ ప్రారంభం

మొదటిపేజీ తరువాయి..

ఈ సొరంగాన్ని నదీ గర్భానికి 16 మీటర్ల లోతులో, భూమి లోపలికి 32 మీటర్ల లోతులో నిర్మించారు. ఈ సొరంగం అంతర్గత వ్యాసం 5.5 మీటర్లుగా.. బాహ్య వ్యాసం 6.1 మీటర్లుగా ఉంది. హావ్‌డా నుంచి సీల్దాకు రోడ్డు మార్గంలో వెళ్లడానికి 90 నిమిషాల సమయం పడుతోంది. అండర్‌వాటర్ మెట్రో మార్గం ఏర్పాటుతో ఈ ప్రయాణ సమయం 40 నిమిషాలకు తగ్గనుంది. అండర్ వాటర్ మెట్రో రైలు నడిచే మార్గంలో మొత్తం ఆరు స్టేషన్లు ఉండగా.. అందులో మూడు భూగర్భంలోనే ఉన్నాయి. అండర్ వాటర్ మెట్రో రైలు ప్రయాణం కోల్‌కతా వాసులకు కొత్త అనుభూతిని కలిగించనుంది. కోల్‌కతాలోని మరిన్ని మెట్రో మార్గాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. హౌరా మైదాన్-ఎస్ప్లానేడ్ మెట్రో మార్గం, కవి సుభాస్-హమంత ముఖోపాధ్యాయ మెట్రో మార్గం, తరటాలా-మజెర్‌హట్ మెట్రో మార్గం, రూబీ హాల్ క్లినిక్- రాంవాడి మెట్రో మార్గం వంటి తదితర మెట్రో లైన్‌లను ప్రధాని మోదీ ప్రారంభించారు. మెట్రోలో ప్రయాణిస్తూ మరో మెట్రోలోని ప్రయాణికులకు అభివాదం చేశారు ప్రధాని మోదీ. మోదీతో పాటు పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందర్, ప్రతిపక్ష నేత సువేందు అధికారి, పలువురు మెట్రో అధికారులు రైల్‌లో

ఉన్నారు. మార్చి 7 నుంచి ఈ సర్వీస్‌లు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నట్టు రైల్వే అధికారులు వెల్లడించారు. ఇప్పటికే కోల్‌కత్తాలో ఓ కీలక ప్రాజెక్ట్‌ని గతేడాదే ప్రారంభించారు ప్రధాని మోదీ. గతేడాది ఏప్రిల్‌లో అండర్ వాటర్ టన్నెల్‌లో ట్రైన్ సర్వీస్‌లను ప్రారంభించారు. ఇది కూడా భారత్‌లో తొలిసారి. ఇవి ప్రధాని మోదీ కోల్‌కత్తా ప్రజలకు ఇచ్చిన కానుకలు అంటూ బీజేపీ ప్రచారం చేస్తోంది. ఎన్నో ఏళ్ల నుంచి కలగా ఉండిపోయిన ఈ ప్రాజెక్ట్‌ని సాకారం చేసుకున్నామని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ప్రధాని మోదీ రూ.15,400 కోట్ల విలువైన ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన చేశారు. గత ఐదు రోజుల్లో రెండోసారి ప్రధాని మోదీ కోల్‌కతా వచ్చారు.

రూ.15,400 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు మోదీ శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత ఉత్తర 24 పరగణ జిల్లాలో గల బరాసత్ వద్ద బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తారు. బరాసత్, సందేశ్ ఖాళి లోక్ సభ నియోజకవర్గ పరిధిలో ఉంటుంది. టీఎంసీ నేత షేక్ షాజహాన్ ఇష్యూకి సంబంధించి బెంగాల్‌లో రగడ నెలకొంది. ఈ క్రమంలో ప్రధాని మోదీ బరాసత్‌లో ప్రసంగించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

మారుతున్న జాతీయ రాజకీయ సమీకరణాలు

మొదటిపేజీ తరువాయి..

ముందుకువెళ్తోంది.. రామమందిర ప్రారంభోత్సవం అనంతరం బీజేపీకి అంతటా అనుకూల పవనాలు వీస్తున్నాయి. ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్, పలు పార్టీల నుంచి పలువురు కీలక నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అనేకమంది కాంగ్రెస్ అగ్రనేతలు కూడా కాంగ్రెస్ నుంచి బీజేపీ లోకి వెళ్తారన్న ఊహగానాలు కూడా మొదలయ్యాయి. ఈ తరుణంలో ఇండియా కూటమి కూడా బీజేపీకి గట్టి పోటీ ఇచ్చేందుకు సన్నాహాలను ప్రారంభించింది.. ఒకప్పుడు టికెట్లు ఇచ్చిన గ్రాండ్ ఓల్డ్ పార్టీ.. ఇప్పుడు తీసుకునే స్థాయికి చేరింది. దీనికి నిదర్శనం ఇటీవల ఉత్తరప్రదేశ్, ఢిల్లీ పలు రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలతో జరిగిన చర్చలే.. సమాజ్ వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ తో చర్చల అనంతరం 80స్థానాల్లో 17 స్థానాలే ఇచ్చేందుకు ఆయన సుముఖత వ్యక్తంచేశారు.. మిగతా 63 స్థానాల్లో ఎస్పీ పోటీచేయనుంది.

ఇక ఢిల్లీలో కూడా ఆప్ 4, కాంగ్రెస్ 3 స్థానాల్లో పోటీకి అంగీకరించాయి. గుజరాత్, హర్యానా, గోవాలో కూడా పోటీచేసే సీట్లపై క్లారిటీ వచ్చింది. అయితే, ఒక్క పశ్చిమ బెంగాల్ లో మాత్రం పరిస్థితి మరోలా ఉంది.. అసలు కాంగ్రెస్ కు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ సీట్లు ఇచ్చేందుకు నిరాకరించారు.. అంతేకాకుండా.. పొత్తు ఉండదంటూ కూడా ప్రకటించారు..

2019లో జరిగిన లోకసభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ అమేథీలో.. స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోయిన విషయం తెలిసిందే.. రెండో చోట వయనాడ్ పోటీచేసిన రాహుల్ గాంధీ గెలిచారు.. వాస్తవానికి అమేథీలో రాహుల్ ఓడిపోవడం సంచలనమే.. ఎందుకంటే.. కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉంది.. దీంతో ఈ సారి రాహుల్ అమేథి నుంచి పోటీచేస్తారా..? లేక వాయనాడ్ నుంచే పోటీచేస్తారా..? అన్న సందిగ్ధంలో కమ్యూనిస్టులు మరో షాకింగ్ న్యూస్ చెప్పారు.. ఇండియా కూటమిలో కొనసాగుతున్న కమ్యూనిస్టులు (ఎల్డీఎఫ్) ఈసారి వయనాడ్ సీటును రాహుల్ గాంధీకి ఇచ్చేది లేదంటూ ప్రకటించారు..

అయితే, రాహుల్ ఎక్కడినుంచి పోటీచేస్తారన్న దానిపై పార్టీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటివరకు రాహుల్ గాంధీ మాత్రం పోటీచేస్తే స్థానంపై క్లారిటీ ఇవ్వలేదు.. నార్త్ నుంచి పోటీచేస్తారా..? లేదా సౌత్ నుంచి పోటీచేస్తారా..? లేదా.. గతంలో లాగా రెండు చోట్ల నుంచి పోటీచేస్తారా..? రాహుల్ గాంధీ నిర్ణయం ఎలా ఉంటుందనే విషయాలు తెలియాల్సి ఉంది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి రాజా సతీమణి యాని రాజా వాయనాడ్ నుంచి పోటీకి దింపుతున్నట్లు ఎల్‌డిఎఫ్ (లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, కేరళలో అధికార కూటమి) ప్రకటించింది. ఇదిలా ఉంటే, ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ (కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్) కేరళలో రెండు ప్రధాన రాజకీయ కూటములు.. ఈ క్రమంలో కమ్యూనిస్టుల మధ్య సయోధ్య కుదరకపోతే.. రాహుల్ గాంధీ వయనాడ్ నుంచి తప్పుకోవాల్సి ఉంటుంది. దీంతో రాహుల్ గాంధీ.. కర్ణాటక లేదా తెలంగాణ నుంచి పోటీచేయవచ్చని జాతీయ రాజకీయాల్లో చర్చ జరుగుతోంది.. అయితే, రాహుల్‌కు కర్ణాటక కంటే..తెలంగాణ నే బెస్ట్ ప్లేస్ అని నాయకత్వం అభిప్రాయపడుతుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, కర్ణాటక, తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తిస్థాయి మెజార్టీతో ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది.

అక్కడ సిద్ధరామయ్య, డీకే శివకుమార్ లను సీఎం, డిప్యూటీ సీఎంలుగా నియమించింది.. తెలంగాణలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కను సీఎం, డిప్యూటీ సీఎంలుగా నియమించింది. ముఖ్యంగా కర్ణాటకలో పార్టీలో విభేధాలు తారాస్థాయికి చేరడం, సఖ్యత లేకపోవడం వల్ల రాహుల్ గాంధీ అక్కడినుంచి పోటీచేయరని.. అందుకే ఆయన తెలంగాణ వైపు చూస్తున్నారని పేర్కొంటున్నారు. ముఖ్యంగా కర్ణాటక నుంచి రాహుల్ గాంధీ పోటీచేస్తే.. గెలుపు అవకాశాలను దెబ్బతీసే అవకాశం ఉందని.. అందుకే తెలంగాణ నుంచి పోటీచేయాలని నాయకత్వం కోరుతోంది. అదికాకుండా.. తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ మేనియా కొనసాగుతుండటం కూడా ప్లస్‌గా మారింది. అయితే, దేశంలోని పలు రాష్ట్రాల్లో చాలామంది నేతలు బీజేపీ వైపు చూస్తుంటే.. తెలంగాణలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారింది.. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ కి చెందిన నేతలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ లో చేరనున్నట్లు ప్రకటించారు.. దానికి కారణం కాంగ్రెస్ పార్టీ నాయకత్వం రాష్ట్రంలో అనుసరిస్తున్న విధానాలు.. ఆరు గ్యారెంటీల అమలు, ప్రాధాన్యం ఇవన్నీ కూడా పార్టీకి కలిసి వచ్చాయి. అంతేకాకుండా.. పార్టీ రాష్ట్ర నాయకత్వం కూడా సోనియా గాంధీ, లేదా రాహుల్ గాంధీ తెలంగాణ నుంచి పోటీచేయాలని ఇప్పటికే తీర్మానం చేశాయి.. ఈ క్రమంలో సోనియాగాంధీ అనూహ్యంగా ప్రత్యక్ష ఎన్నికల నుంచి తప్పుకుని.. రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అయితే, ప్రియాంక గాంధీ అయినా పోటీచేయాలని టీ కాంగ్రెస్ కోరింది. అయితే ఆమె సోనియాగాంధీ సీట్ రాయ్‌బరేలీ నుంచి పోటీచేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో రాహుల్ గాంధీ అయినా.. తెలంగాణ నుంచి పోటీచేయాలని రేవంత్ రెడ్డి కోరుతున్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గత నెలలో సోనియా గాంధీని కలిసి ఖమ్మం నుంచి పోటీ చేసే అంశాన్ని పరిశీలించాల్సిందిగా కోరారు. ఖమ్మం లోక్ సభ ప్రాంతం నుంచి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉండటంతో.. అక్కడ కాంగ్రెస్ కు తిరుగులేదని తెలిపారు. అయితే, సోనియా గాంధీ, ఆమె ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, ఈ ఆఫర్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి సున్నితంగా తిరస్కరిం చడం.. ప్రియాంక గాంధీ సుముఖంగా లేకపోవ డంతో.. రాహుల్ గాంధీ పోటీచేయాలని కోరుతున్నారు. ప్రధానంగా.. ఖమ్మం లేదా భువనగిరి నుండి బరిలోకి దింపాలని పార్టీ నాయకత్వం యోచిస్తోంది.. ఇక్కడైతే తిరుగులేదని ఇప్పటికే నివేదికలు అందించారు.

మా ప్రభుత్వం జోలికి వస్తే అంతు చూస్తా...

మొదటిపేజీ తరువాయి..

కొట్లాడుతానని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

తెలంగాణ అభివృద్ధిపై మాత్రమే ప్రధానితో మాట్లాడానని అన్నారు. సీఎంగా నా బాధ్యత నిర్వర్తించాను. మర్యాద ఇవ్వడంలో మన సంస్కృతిని నిలబెట్టానని స్పష్టం చేశారు. దీనిని కూడా కొందరు రాజకీయ పబ్బం కోసం వాడుకుంటు న్నారని మండిపడ్డారు. నిధులు ఇవ్వకపోతే బీజేపీని చాకిరేవు పెట్టి ఉతికి ఆరేస్తా. కేంద్రంతో సంఘర్షణ వైఖరితో తెలంగాణకు నష్టం జరుగుతుంది. మోదీతో అయినా కేడీతో అయినా కొట్లాడుతాను. ప్రధాని హోదాలో పాలమూరుకు మోదీ ఏం ఇచ్చాడు?' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పాల మూరు వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ

హైదరాబాద్ వెలుతురు మార్చి 06: బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ గారు చేపట్టిన మహా పాదయాత్ర కార్యక్రమంలో బుధవారం రోజున రామన్ గౌడ్ గారు అదే విధంగా మహాలక్ష్మి కార్పొరేటర్ హిమాయత్ నగర్ డివిజన్ అమరవీరుల స్థూపం దగ్గర అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.

హైదరాబాద్ వెలుతురు మార్చి 06:
బుధవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ జిహెచ్ఎంసి డీఎంసీ మారుతి దివాకర్, మరియు ఏ ఎమ్ హెచ్ జ్యోతిబాయ్ తో కలిసి హిమాయత్ నగర్ డివిజన్లో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటుకు స్థలాన్ని చూయించి వాళ్ళతో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు మహేష్, జాకి, ప్రియరాజ్ జస్వాల్, హితేష్, అఖిల్, నదీమ్, తాహిర్, సాబీర్, అనీష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

వెలుతురు పటాన్చెరు, సంగారెడ్డి జిల్లా: విజయసంకల్ప సభ శ్రీ .గౌరవనీయులైన భారత దేశ ప్రధానమంత్రి గారు నరేందర్ మోడీని స్వాగతం పలికిన బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి .

గాంధీ భవన్‌లో మహిళా దినోత్సవం వేడుకలు

వేడుకలో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ వెలుతురు మార్చి 06:
బుధవారం రోజున గాంధీ భవన్‌లో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం

చిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, అమీన్ పూర్ 15 వార్డ్ కౌన్సిలర్ శ్రీమతి కాట సుధా శ్రీనివాస్ గౌడ్.

హైదరాబాద్ వెలుతురు మార్చి 06:
అమీన్ పూర్ మున్సిపాలిటీ బీరంగూడ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో ఈ నెల తేదీ 07-03-2024 నుండి 10-03-2024 వరకు జరుగబోయే మహాశివరాత్రి మహోత్సవంలో తెలంగాణ ఆరోగ్యం, వైద్య, కుటుంబ సంక్షేమం, శాస్త్ర మరియు సాంకేతిక శాఖ మంత్రివర్యులు శ్రీ దామోదర రాజనర్సింహ గారు పాల్గొనాలని కోరుతూ వారికి ఆహ్వాన పత్రికను అందజేసిన పటాన్ చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ గారు మరియు దేవాలయ కమిటీ సభ్యులు

కొల్చారంలో "రైతు నేస్తం" వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

కొల్చారం, 7 మార్చి 2024 (వెలుతురు న్యూస్):
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 110 రైతు వేదిక ప్రాంగణాలలో అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఇందులో భాగంగా మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారం రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు రైతు నేస్తం పథకం యొక్క విధి విధానాలు అధికారులకు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రాంతం ఏ పంటలకు అనుకూలమైనది, సీజనల్ వారిగా ఏ పంటలు ఎంచుకోవాలి, నేల రకాన్ని బట్టి ఎటువంటి ఎరువులు వాడాలి అనే విషయాలు రైతు నేస్తం పథకం ద్వారా రైతులకు తెలవనున్నాయన్నారు. రైతులకు పంట బీమా సౌకర్యం కల్పించడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కాగా ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదర్శ రైతు మహిపాల్ రెడ్డి,
ఏడి అగ్రికల్చర్ గోవింద్, ఎంపీపీ మంజుల, ఏడిఏ పుణ్యావతి లతో కలిసి తిలకించారు. అనంతరం గత సీజన్లో సుమారు 10 ఎకరాలలో టమాట సాగు చేసి రెండు కోట్ల పైచిలుకు లాభాలు గడించిన ఆదర్శ రైతు మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత ఎంతో ఉపయోగంగా ఉంటుందని, ఈ ఆధునిక సాంకేతికత రైతులకు చేరువైనట్లయితే వారు వ్యవసాయంలో మేలుకోలు పాటించడంతోపాటు మంచి లాభాలు గడిస్తారని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గఫర్ మియా, ఎంపీడీవో లక్ష్మీ నరసింహ, ఎంపీపీ మంజుల కాశీనాథ్, ఏవో శ్వేతా కుమారి, ఆయా గ్రామాల ఏఈవోలు, ప్రభుత్వ శాఖల అధికారులు, పిఎసిఎస్ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా నూతన రెస్టారెంట్ ప్రారంభం

కొల్చారం, 7 మార్చి 2024 (వెలుతురు న్యూస్):
మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టిపల్లిలోని ఏడుపాయల టీ జంక్షన్ వద్ద నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి బుధవారం హర్షిత ఫ్యామిలీ రెస్టారెంట్, జై దుర్గా భవాని ఫుడ్ కోర్ట్, జెడిబి చికెన్ సెంటర్ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడుపాయల వన దుర్గ భవాని దేవస్థానానికి పోతనశెట్టిపల్లి మీదుగా నూతన బ్రిడ్జిలు ఏర్పడినప్పటి నుండి పోతంశెట్టిపల్లి గ్రామం నూతన శోభను సంతరించుకుందన్నారు. గ్రామం దినదినాభివృద్ధి చెందుతూ ప్రధాన రహదారి పై గల టీ జంక్షన్ నుండి దారి పొడవునా పలు వ్యాపార సముదాయాలు వెలవడం శుభసూచకమన్నారు. ఈ వ్యాపార సముదాయాల వలన మండల ప్రజలకు ఉపాధి అవకాశాలు లభించడంతోపాటు, అనేక ప్రాంతాల నుండి దేవస్థానానికి తరలివచ్చే భక్తుల అవసరాలు తీరుతాయి అన్నారు. మరో రెండు రోజుల్లో ప్రారంభమవునున్న ఏడుపాయల జాతర దృశ్య దుకాణ సముదాయాల ప్రాంగణాలలో, దేవాలయానికి వెళ్లే దారి పొడవునా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి తో పాటు గ్రంథాలయాల చైర్మన్ చంద్ర గౌడ్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు మన్సూర్ అహ్మద్, హర్షిత ఫ్యామిలీ రెస్టారెంట్ యజమానులు హరీష్, రాజకుమార్, గజినీ వెంకట్ గౌడ్, జై దుర్గా భవాని ఫుడ్ కోర్ట్ యజమాని రవీందర్, జెడిపి చికెన్ సెంటర్ యజమాని పశుపతి, ఎంపీపీ మంజులా కాశీనాథ్, బి

ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు గౌరీశంకర్, ఎడపాయల చైర్మన్ బాలా గౌడ్, డైరెక్టర్లు యాదగౌడ్, బాగ రెడ్డి, నాయకులు చిట్యాల యాదయ్య, ముత్యం ప్రవీణ్ కుమార్, కరెంటు రాజా గౌడ్, నాగూరి మనోహర్, పాండ్ర వెంకటేశం, దొడ్ల ఆంజనేయులు, సోమ నర్సింలు, మన్నే అనిల్ తలారి దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి పండాల్ ప్రశ్నిస్తే గానీ నియోజకవర్గం ప్రజలకు సహాయం చేయరా!

బీజేపీ మహిళా మోర్చ అసెంబ్లీ కన్వీనర్ జ్యోతి పండాల్

జహీరాబాద్, 06 మార్చి, వెలుతురు :
జ్యోతి పండాల్ ప్రశ్నిస్తే గానీ నియోజకవర్గ ప్రజలకు సహాయం చేయరా అని ప్రశ్నిస్తూ బుధవారం రోజున బీజేపీ మహిళా మోర్చ అసెంబ్లీ కన్వీనర్ జ్యోతి పండాల్ ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం....జ్యోతి పండాల్ సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ప్రశ్నిస్తూ పేపర్ స్టేట్మెంట్ తో పాటు ఎమ్మెల్యే ఆడియో రికార్డింగ్ అన్ని వాట్సప్ గ్రూప్స్ లో వైరల్ చేసిన తర్వాత ఎమ్మెల్యే హుటాహుటిన ప్రమాదమైన కుటుంభానికి 4 లక్షల రూపాయిల ఆర్థిక సహాయం అందజేశారు. అంటే మీ సొంతగా సహాయం చేయాలని ఆలోచన ఎందుకు రాలేదు అని ప్రశ్నించారు. అంటే మీ నియోజకవర్గం ప్రజలకు సేవ చేయాలని మీలో చిత్త శుద్ధి కనిపించడం లేదు. ఆ అబ్బాయి మీకు తోచినంత సహాయం చేయమన్నాడు కానీ 15 లక్షలు ఇవ్వమని అనలేదు. 4 లక్షల రూపాయలు మీరు నేను ప్రశ్నించక ముందు ఇచ్చి ఉంటే మీ విలువ ఇంకా పెరిగి విండేది సార్. అలాగే బీఆర్ఎస్ నాయకులు మరియు కార్యకర్తలు మీడియా వాళ్లకి ఫోన్ చేసి కొంచం చూసి రాయు అన్న అని అంటున్నారు అంట. మీడియా వాళ్ళు వాస్తవాలు రాస్తున్నారు. మీ ఉచిత సలహాలను అడగటం లేదు. కావున మీడియా వాళ్ళని ఇబ్బంది పెట్టకండి. మీరు మీ ఎమ్మెల్యే నీ సపోర్ట్ చేస్తున్నారు కానీ మంచి కి సపోర్ట్ చేయండి ఇలాంటి వాటికి కాదు. ఎందుకంటే మీకు కూడా ఇలాంటి పరిస్తి వేస్తే మీ ఎమ్మెల్యే మీకు సహాయం చేయకపోతే అప్పుడు తెలుస్తుంది ఆ బాధ ఏంటో అని జ్యోతి పండాల్ వ్యాఖ్యానించారు.

రోడ్డు భద్రతపై మహీంద్రా లాజిస్టిక్స్ & మాగమో వెల్ఫేర్ సంస్థ టీం సభ్యుల అవాగాహన కార్యక్రమం

పాల్గొన్న టోల్ ప్లాజా టీం సభ్యులు

జహీరాబాద్, మార్చి, 06 వెలుతురు:
ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని మహీంద్రా లాజిస్టిక్స్ %ఉ% మాగమో వెల్ఫేర్ సంస్థ టీం సభ్యులు సంతోష్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కంకోల్ టోల్ ప్లాజా వద్ద మహీంద్రా లాజిస్టిక్స్ %ఉ% మాగమో వెల్ఫేర్ సంస్థ, టోల్ ప్లాజా టీం సభ్యులు కలిసి బుధవారం రోడ్డు పై ప్రయాణించేటప్పుడు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై వాహనదారులకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా వారు వాహనం నడిపే సమయంలో ఫోన్ లో మాట్లాడారాదనీ, ఆలస్యం అయినా సరే నిధానమే మిన్న, ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ తప్పనిసరి అనే ప్లే కార్డులు చేతులలో పట్టుకొని వాహనాదారులకు గులాబీ పుష్పం ఇచ్చి రోడ్డు భద్రత మీద అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత మీద అవగాహన ఏర్పరచుకోవాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలని తెలిపారు. ప్రతిరోజు రోడ్డు ప్రమాదంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని రోడ్డుమీద ప్రయాణించేటప్పుడు భద్రత చాలా ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమలో సంతోష్, మహీంద్రా లాజిస్టిక్స్ %ఉ% మాగమో వెల్ఫేర్ సంస్థ టీం సభ్యులు, టోల్ ప్లాజా టీం పాల్గొన్నారు.

సంపాదకీయం..

కుటుంబపెద్ద బాధ్యత ఇలాగే ఉంటుందా ?

భారతదేశ రాజకీయాలను పూర్తిగా నియంత్రించేందుకు రానున్న రోజుల్లో మోదీ ఇంకా ఎన్ని ఆయుధాలను ప్రయోగిస్తారో ఊహించలేం. ఆయన ఎక్కడి రోటిపాట అక్కడ పాడుతున్నారు. ఇప్పుడు కొత్త నినాదం ఎత్తుకున్నారు. ప్రజలంతా నా కుటుంబం అంటున్నారు. మంచిదే..మరి ప్రజల బాధలు వినాల్సిన పాలకుడిగా మోడీ ఆ పనిచేయడం లేదు. కేవలం తాను చేసిన గొప్పలను గోరంతలు కొండంతలుగా ప్రచారం చేస్తున్నారు. తెలంగాణలో రెండ్రోజుల పర్యటనలో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపారు. కాళేశ్వరంపై కేంద్రం చర్యలు తీసుకోదు. తీసుకుంటున్న రేవంత్ ప్రభుత్వాన్ని విమర్శించి బిఆర్ఎస్‌కు ప్రాణం పోసే ప్రయత్నం చేశారు. గతంలో కాళేశ్వరం బిఆర్ఎస్‌కు ఎటిఎం అన్న మోడీ ఏనాడూ అవినీతిపై చర్యలు తీసుకోలేదు. కేవలం 370 ఆర్టికల్, అయోధ్యను చూపి సమస్యలు పరిష్కరించానని, ఇది మోడీ గ్యారెంటీ అంటూ ఊదరగొట్టారు. ఈ రెండు కూడా ప్రజలకు కూడు పెట్టేవి కావు. మోడీ చేస్తున్న రాజకీయ విన్యాసాలు ఎక్కువ కాలం పనిచేయవని గుర్తించాలి. ప్రజలు ప్రధానంగా ధరలతో సతమతం అవుతున్నారు. నిరుద్యోగం తాండవిస్తోంది. ఉపాధి రంగాలు దెబ్బతిన్నాయి. జిఎస్టీతో సామాన్యుల నడ్డి విరుగు తోంది. ప్రధానిగా ప్రజల్లో ఈ సమస్యలను ఏనాడు చర్చించడం లేదు. కుటుంబం అంటున్న మోడీ ఇవన్నీ చర్చించాలి. నిత్యం భజన చేస్తున్న వందిమాగధులు ఈ సమస్యలను అధినేత దృష్టికి తీసుకుని వెళ్లడం లేదు. అప్రజాస్వామిక చర్యలపై కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా పట్టించుకోవడం లేదు. చండీగఢ్‌లో జరిగిన మేయర్ ఎన్నిక తీరును సుప్రీం తప్పుపట్టింది. దీనికి సమాధానం లేదు. లోక్‌సభ ఎన్నికల సమయంలో బిహార్, జార్ఖండ్‌లో ఈడీ స్వైరవిహారం చేస్తున్నాయి. జెఎంఎం కనుక ఎన్డీఏలో ఉండి ఉంటే ఇప్పుడు ఈడీ దాడులనుంచి సోరేన్‌కు బాధలు ఉండేవి కావు. అందుకే ఇవన్నీ పక్కన పెట్టి తను ఓ అవతార పురుషుడినని చెప్పుకోవడం.. చెప్పించుకోవడం ద్వారా మరోమారు ఎన్నిక కావాలని మోడీ చూస్తున్నారు. అందుకు తగ్గట్లుగానే విపక్షాల్లో అనైక్యత లేదు. వారిలో నిబద్ధత లేదు. స్వార్థ రాజకీయాల్లో అవి కొట్టు మిట్టాడుతున్నాయి. ప్రజల సమస్యలను బలంగా వినిపించే గళం లేకుండా పోయింది. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు విపక్షాలు సర్వశక్తులు ఒడ్డుతున్నా లాభం లేదని తెలుస్తోంది. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే తమ మనుగడ ఏమవుతుందో అని కొన్ని రాజకీయ పార్టీలు భయపడడం, మరి కొన్ని రాజకీయ పార్టీలు ఈ భయంతోనే మోదీ అండదండలకు ప్రయత్నించడం జరుగుతోంది. ఎపిలో జగన్, టిడిపి కూటమి ఇదే కోరుకుంటోంది. మోడీ ప్రాపకం ఉంటే చాలని మోకరిల్లే పరిస్థితికి వచ్చాయి. నిజంగానే మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే అసలు ప్రతిపక్షమే ఉండకపోవచ్చు. కాని ఈ భయం ప్రజల్లో ఏర్పడడం లేదు. కాంగ్రెస్ తదితర పక్షాల తీరు కారణంగానే మోడీ బలోపేతం అవుతున్నారు. దక్షిణాదిన తెలంగాణ, కర్ణాటకలో సాధించిన ఫలితాలు కాంగ్రెస్ ఇతర రాష్ట్రాల్లో ఎందుకు సాధించలేకపోతోందని వివేచన చేయడం లేదు. జాతీయ స్థాయిలో ఒక బలమైన ప్రత్యామ్నాయాన్ని ఏర్పర్చుకోవడం మాత్రమే కాదు, ఈ ప్రత్యామ్నాయాన్ని నీరుకార్చేందుకు చేసే ప్రయత్నాలను వమ్ము చేసే నాయకత్వం కూడా దేశానికి అవసరం. ఈ లోటు స్పష్టంగా కనపడుతోంది. కేవలం రాహుల్‌ను ముందు పెట్టడం ద్వారా ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలించలేవు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎజెండాగా చేసుకుని ముందుకు సాగడంలో కాంగ్రెస్ తదితర పక్షాలు పూర్తిగా విఫలం అవుతున్నాయి. వారికి ఏది సమస్యనేది తెలియడం లేదు. ఈ క్రమంలోనే రెండ్రోజుల తెలంగాణ పర్యటనలో మోడీ కేవలం తన వాక్చాతుర్యంతో స్థానిక బిజెపి నేతలు ఇచ్చిన సమాచారంతో మాట్లాడారని గుర్తించాలి. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ కొత్త ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ చేసిన ఆరోపణలో రాజకీయం తప్ప నిజాలు లేవనే చెప్పాలి. రాష్ట్రంలో డబ్బు దోచుకొనే పనిలో ఆ పార్టీ బిజీ అయ్యిందని విమర్శించడం ద్వారా తనస్థాయిని ప్రధాని మోదీ తక్కువ చేసుకున్నారు. ఎందుకంటే రాష్ట్రాన్ని దోచుకున్న బిఆర్ఎస్‌ను ఏమీ చేయలేని అసమర్థ ప్రధానిగా మోడీ పేరు సంపాదించుకున్నారు. ఇది తెలంగాణ పల్లెల్లో ఎక్కడికి వెళ్లినా ప్రజలే చెబుతారు. బిఆర్ఎస్‌తో మోడీ కుమ్మక్కయ్యారని చెబుతారు. అవినీతికి పాల్పడుతున్న కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలపై మోదీ పాలనలో సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్‌స్ట్రైక్స్ ఉంటాయని హెచ్చరించడం ద్వారా బెదిరింపు రాజకీయాలకు పాల్పడ్డారనే చెప్పాలి. తెలంగాణతో పాటు దేశంలోని ప్రజలంతా మూడోసారి బీజేపీకి పట్టం కట్టాలని, 400 ఎంపీ సీట్లు గెలిపించాలని కోరారు. అలా చేయాలంటే ప్రజలు ఏం కోరుకుంటున్నారో మోడీ గుర్తించాలి. కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలపై మోదీ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ అవినీతిని బట్టబయలు చేస్తుండటం తో ఆ పార్టీ తనపై విమర్శలు చేస్తున్నదని వెల్లడించారు. అవినీతి విషయంలో ఎన్ని చర్యలు తసీఉకున్నా ఎవరికీ అభ్యంతరం లేదు. అంత ఖచ్చితంగా ఉండివుంటే కెసిఆర్, జగన్‌ల అవినీతిపై ఎందుకు ఉపేక్షిస్తు న్నారో బహిరంగ ప్రకటన చేయాలి. తనకు కుటుంబం లేదంటూనే ఇండియా కూటమి తనపై అనైతిక యుద్ధానికి దిగుతున్నదని చెప్పారు. దేశంలోని ప్రతి వ్యక్తి మోదీ కుటుంబ సభ్యుడేనని, తనను ప్రజలంతా తమ కుటుంబసభ్యునిగా భావిస్తున్నారని అన్నారు. ప్రజలపై అంతగా ప్రేమ ఉంటే వారి సమస్యలు వినాలి. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయి నివేదికలు తెప్పించు కోవాలి. పరిష్కారం చూపాలి. వారసత్వ రాజకీయ పార్టీలకు మోదీ భయం పట్టుకున్నదని పదేపదే చెప్పి ప్రజలను నమ్మించ లేరు. దేశాన్ని మూడో అతి పెద్ద ఆర్థికశక్తిగా తీర్చిదిద్దుతానని, ఇది తన గ్యారెంటీ అని వెల్లడించారు. మోదీ గ్యారెంటీ అంటే తప్పకుండా అవుతుందని అన్నారు. నిజంగా ఇంతగా అభివృద్ధి చెందితే ప్రజలు ఎందుకు అధఃపాతాళంలోకి తొక్కబడుతున్నారో మోడీ చెప్పాలి. ఎందుకు బతికి బట్టలేక పోతున్నారో చెప్పాలి. ఎందుకు తిండికి కూడా కష్టపడుతున్నారో చెప్పాలి. పెరుగుతున్న ధరలను ఎలా కంట్రోల్ చేస్తారో చెప్పాలి. పెరుగుతున్న ఔషధ ధరలను ఎవరు నియంత్రిస్తారో చెప్పాలి. ఇవన్నీ చెప్పి, ప్రధానిగా చర్యలు తీసుకుని ఉంటే మోడీ తప్పకుండా ప్రతి ఒక్కరి కుటుంబ సభ్యుడు అవుతారు.

తనుష్య కనుల తేజం - భవిష్య కళల శోభితం

నలుపు తెలుపుల సౌరభం
చీకటి వెలుగుల సమ్మోహనం !!

- శ్రీతేజ కలం

చక్కని ఆ చుక్కల అరవిందం
చిక్కని అష్టదిక్కుల విభాజనం !!

పలికిన ఆ వర్ణముల విభాసితం
పంచుకున్న ఆ కళల విభూషణం !!

ఒదిగిన గీతల చక్రధర మణి పూరకం
వెలుగులు నింపగ ముందర కళా నైపుణ్యం
రంగులు అద్దగ నిండుగ అల్లికల శోభాయమానం !!!

- శశికాంత్ మెంచు
(91)789-316-9944

యాసంగిలో పెరగనున్న వరి దిగుబడి

ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటిస్తున్నప్పటికీ కొనుగోలు కేంద్రాలపై చివరిదాక దోబూచులాడుతుండడం అన్నదాతకు శాపమవుతోంది. ఈసారి కూడా రైతులు వ్యవసాయశాఖ నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఆయా పంటలను సాగుచేశారు.అన్ని ప్రాజెక్ట్‌ల్లో సాగునీటి నిల్వలు పుష్కలంగా ఉండడం, భూగర్భ జలాల లభ్యత కూడా ఆశించిన మేరకు ఉండడంతో రైతులు యాసంగి పంటలపై పెద్దఎత్తున ఆశలు పెట్టుకొని సాగుకు ఉపక్రమించారు. ప్రభుత్వం ఇప్పటి వరకు వరి కొనుగోలు కేంద్రాలపై స్పష్టమైన విధి విధానాలను, మార్గదర్శకాలను జారీ చేయకపోవడం వరి రైతును తీవ్రనిరాశకు గురిచేస్తోంది. పంట దిగుబడి వచ్చే సమయానికి మరింత గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

పంటలను కొనుగోలు చేసే వ్యవహారంపై ప్రభుత్వం కొన్ని నిబంధనలను పకడ్బందీగా అమలు చేయతలపెట్టింది. ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై స్పష్టత కానరావడం లేదు. గతంలో లాగా ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఉండకపోవచ్చని అంటున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపైనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పౌర సరఫరాల శాఖ సన్నాహాలు ప్రారంభించింది. జిల్లా వారిగా ధాన్యం దిగుబడి, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలపై సమాచారం సేకరించాలని ఆదేశించింది. యాక్షన్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి పంపించారు.

యాసంగి దిగుబడి అధికంగా వస్తుందనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. క్రమంలో కొనుగోలు కేంద్రాలపై ప్రభుత్వ ప్రకటనలు అయోమయానికి గురి చేశాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేల ఎకరాల్లో ఈ సారి వరిపంటను రైతులు సాగుచేశారు. భారీ పంటల దిగుబడి లక్ష్యాన్ని నిర్దారించారు. అయితే వరిపంట ఆశాజనకంగా కనిపిస్తుండడంతో రైతులు ఈ సారి తమ కరువు తీరిపోతుందని ఆనందపడుతున్నారు.ఇదిలా ఉండగా ప్రతియేజిల్లాలో ఖరీఫ్, రబీసీజన్‌లలో ఎక్కువగా రైతులు వరిపంటనే సాగుచేస్తుంటారు. అధికారులు పంట మార్పిడి చేయాలని సూచించినప్పటికీ సంప్రదాయంగా వస్తున్న వరి

సాగుకే వారు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఖరీఫ్, రబీసీజన్‌లలో వరి దిగుబడులు పెద్దమొత్తంలో వస్తున్నందున కొనుగోలు పక్రియకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. అయితే ఇప్పటి వరకు సర్కారు కొనుగోలు కేంద్రాల విషయంలో క్లారిటీ ఇవ్వలేదు. మద్దతుధర ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలపై స్పష్టత లేకపోవడంతో అన్నదాతలు అయోమయానికి లోనవుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో కందులు, శనగపంట కొనుగోళ్ల విషయమై అధికారుల ప్రకటనలు రైతుల్లో ఆశలు నింపుతున్నాయి. అయితే మద్దతు ధర కన్నా ప్రైవేటు వ్యాపారులు చెల్లించే ధర ఎక్కువగా ఉండడంతో రైతులు ఎటువైపు మొగ్గు చూపాలో తేల్చుకోలేని పరిస్థితి ఎదురుకావచ్చంటున్నారు. రైతులు ప్రైవేటు వ్యాపారుల వైపే మొగ్గు చూపవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రపంచమంతటా భూతాపం:ప్రకృతి వైపరీత్యాలు

భూ ఉపరితలంపై చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పులు జీవజాలానికి పెనుముప్పుగా పరిణమిస్తున్నాయి. బొగ్గు, సహజ వాయువు, పెట్రోల్ వంటి శిలాజ ఇంధనాల వాడకం వల్ల కర్బన ఉద్గారాలు అపరిమితంగా వెలువడి, వాతావరణాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఫలితంగా భూతాపం పెరిగిపోయి, మానవ మనుగడకే ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడుతోంది. ఇలాగే కొనసాగితే ఈ శతాబ్దం అంతానికి భూమిపై పలు రకాల జీవజాతులు అంతరించే ప్రమాదం ఉందంటున్న శాస్త్రవేత్తల హెచ్చరికలను ప్రపంచ దేశాలు చెవినపెట్టిన దాఖలాలు కనిపించటం లేదు.



వాతావరణంలో ప్రతికూల మార్పులు గర్భస్థ శిశువులపైనా ప్రభావం చూపుతున్నాయంటూ వెలుగులోకి వచ్చిన తాజా అధ్యయనం వెన్నులో వణుకు పుట్టిస్తోంది. వాతావరణ మార్పుల వల్ల భవిష్యత్తులో ప్రపంచ వ్యాప్తంగా 60 శాతం మంది శిశువులు నెలలు నిండకముందే పుడతారని యూనివర్శిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకుల బృందం చేపట్టిన అధ్య యనంలో వెల్లడికావడం కలవరం కలిగించే విషయం. చిన్నారుల ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా ఉంటుం దని పరిశోధనకు నాయకత్వం వహించిన కోరే బ్రాడ్ షా విస్పష్టంగా చెప్పారు. తీవ్రమైన శీతల వాతావరణం వల్ల చిన్నారుల్లో శ్వాసకోశ సంబంధిత సమస్యలు, కరవు, అధిక వర్షాల వల్ల ఎదుగుదలకు సంబంధించిన సమస్యలు, అత్యధిక ఉష్ణోగ్రతల వల్ల నెలలు నిండక ముందే పిల్లలు పుట్టడం వంటి సమస్యలు ఇప్పటికే చోటు చేసుకుంటున్నట్లు ఈ అధ్యయనంలో తేలింది.

దక్షిణాఫ్రికాలో అధిక ఉష్ణోగ్రతల వల్ల చిన్నారులు మృత్యువాత పడుతున్నారంటూ అధ్యయనవేత్తలు చేస్తున్న హెచ్చరికలు మరీ ఆందోళనకరం. ఏ ఏటికాయేడు పెరిగిపోతున్న భూతాపానికి ముకుతాడు వేసేందుకు 196 దేశాల మధ్య కుదిరిన పారిస్ ఒప్పందం ఈ దిశగా సాధించిన ప్రగతి అంతంత మాత్రమే. 2015లో కుదిరిన ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం.. ఈ శతాబ్ది చివరి నాటికి భూ ఉష్ణోగ్రతలో పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు కట్టడి చేయడం. ఇందులో భాగంగా కర్బన ఉద్గారాలను అరికట్టేందుకు ప్రపంచ దేశాలు ప్రతిన బూనినా అగ్రరాజ్యం అమెరికా సహా అనేక దేశాలు లక్ష్యానికి ఆమడ దూరంలోనే ఉన్నాయి.

(ఇదే విషయాన్ని ఐరోపా వాతావరణ మార్పుల సంస్థ కోపర్నికస్ తాజా నివేదిక సైతం కళ్లకు కట్టింది.ఈ ఏడాది ఆరంభంలో భూతాపం సగటు పెరుగుదల 1.52 డిగ్రీల సెల్సియస్ మేర నమోదైనట్లు ఆ నివేదిక పేర్కొనడం ప్రపంచ దేశాల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం. 2030లోగా కర్బన ఉద్గారాలను అధిక శాతం తగ్గించేందుకు కంకణం కట్టుకున్న భారత దేశం మాత్రమే ఆ దిశగా తన వంతు కృషి చేస్తోందని క్లైమేట్ ట్రాన్స్ పరెన్సీ సంస్థ ప్రశంసించడం భారతీయులుగా మనకు ఊరట కలిగించే విషయం. చైనా, అమెరికా, యురోపియన్ యూనియన్ కంటే మన దేశం తక్కువ కర్బన ఉద్గారాలను వెలువరిస్తూ, వాటిని తగ్గించడంలోనూ ముందు వరుసలోనూ ఉంది.

ఇప్పటికే వక్షోజ, గర్భాశయ కేన్సర్లు భారత మహిళల ఉసురు తీస్తున్నాయి. మన దేశంలో కొత్తగా వెలుగు చూస్తున్న కేన్సర్ కేసులలో వక్షోజ, గర్భాశయ, నోటి కేన్సర్లు 32 శాతమని గ్లోబల్ కేన్సర్ అబ్జర్వేటరీ తాజా వివరాలు చెబుతున్నాయి. ఇక భారత దేశంలో ఏటా సంభవిస్తున్న మరణాల్లో 27 శాతం హృద్రోగ సంబంధితమైనవే. వీటికితోడు పుట్టబోయే పిల్లలు, నవజాత శిశువులు సైతం వాతావరణ వైపరీత్యాలబారిన పడతారంటూ వెలువడిన తాజా నివేదిక కలవరం కలిగిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలపరంగా నివాసయోగ్యం కాని ప్రాంతాలలో జీవిస్తున్నవారు 60 కోట్ల మంది కాగా, ఈ శతాబ్దం చివరికి ఈ సంఖ్య 300 కోట్లకు చేరుకుంటుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచమంతటా భూతాపం పెరిగిపోవడానికి కారణం కర్బన ఉద్గారాలను కట్టడి చేయలేకపోవడమే. ప్రకృతి వైపరీత్యాల విలయ తాండవాన్ని గమనిస్తున్న ఐక్యరాజ్యసమితి చీఫ్ ఆంటోనియో గుటెర్రస్ 'గ్లోబల్ వార్మింగ్ శకం ముగిసింది.. గ్లోబల్ బాయిలింగ్ శకం మొదలైంది' అంటూ ఒక సందర్భంలో చేసిన వ్యాఖ్య పరిస్థితి తీవ్రతను ఎత్తి చూపుతోంది. కాబట్టి లక్ష్యాలు నిర్దేశించుకోగానే సరికాదు. వాటి సాధనకు మనసా వాచా కృషి చేసిన నాడే భూతాపానికి ముకుతాడు వేయడం సాధ్యమవుతుంది. కర్బన ఉద్గారాలను అరికట్టేందుకు పారిస్ ఒప్పందంలో నిర్దేశించుకున్న ప్రమాణాలను అందుకునేందుకు ప్రపంచ దేశాలు చిత్తశుద్ధితో కృషి చేసినప్పుడే ముందున్న ముప్పును మానవాళి అధిగమించ గలుగుతుంది.

ఉక్కు ఉద్యమంతో కళ్లు తెరవని పాలకులు

విశాఖను రాజధాని చేస్తానని, ఇక్కడి నుంచే పాలన సాగిస్తానని, ఇక్కడే మకాం వేస్తానని సిఎం జగన్ చేసిన ప్రకటన ద్వారా ఇప్పటికిప్పుడు ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఎందుకంటే ఐదేళ్లుగా రాజధాని లేకుండా చేసిన నేతగా జగన్ చరిత్ర కెక్కారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తూ గత కొంతకాలంగా చేస్తున్న ప్రజాందోళనను పట్టించుకోలేదు. ఈ సమస్యనే పట్టించుకోని జగన్ విశాఖను రాజధాని చేస్తానని చెప్పి ప్రజలను బుకాయించలేరు. విశాఖ సదస్సులో సిఎం జగన్ ఎక్కడా విశాఖ ఉక్కు గురించి ప్రస్తావించలేదు. గంగవరం పోర్టు, విశాఖ ఉక్కు విశాఖకు తలమానికంగా ఉండగా వాటిని ప్రైవేట్ రంగం ఎగురేసుకుపోతున్నాయి. కాంగ్రెస్ పాలకులు అనుసరించిన ప్రైవేటీకరణ విధానాలను మరింత వేగాంగా,నిస్సిగ్గుగా అమలు చేయడం ద్వారా బిజెపి తన ముసుగును తీసేసింది. బిజెపి ప్రజల కోసం పనిచేసే పార్టీ అన్న ముద్రను దూరం చేసుకుంది. పక్కా కార్పోరేట్ వ్యక్తుల కాళ్ల దగ్గర సాగిలపడిన పార్టీగా మార్చి వేయడంలో మోడీ, అమిత్ షాలు విజయం సాధించారు. దానికి జగన్ మద్దుతుగా నిలిచారు. ఆదానీ అన్నీ ఎగరేసుకుపోతున్నా పట్టింపు లేకుండా చూస్తున్నారు. బంగారు పళ్లెంలో ఆయనకు అప్పగించేస్తున్నారు.ఎపిలో జరుగుతున్న ఉక్కు పరిరక్షణ ఉద్యమం అటు జగన్, ఇటు బిజెపి నేతలకు కనువిప్పు కావాలి. ప్రజల్లో ఉన్న ఆందోళనలను పట్టించుకోకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదని గుర్తించడం లేదు. విశాఖ నుంచే ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి నాంది కానుంది. గతంలో ప్రైవేటీకరణతో ఏం సాధించారో ప్రభుత్వాలు లెక్కలు చెప్పాలి. గతంలో అనేక సంస్థలను ప్రైవేటీకరిస్తే వచ్చిన లాభాలు... ఎంతమేరకు ఉపయోగ పడ్డాయి..ఎంతమందికి అదనంగా ఉపాధి కల్పించారు..జాతీయ ప్రయోజనాలకు ఏమేర లాభం కలిగిందో కేంద్రం ప్రజలకు వివరణ ఇచ్చుకోవాలి. వ్యాపారం సర్కారు పనికాదని ప్రధాని మోడీ గతంలో చేసిన ప్రకటన నిజంగా పలాయనవాదంలా ఉంది. ప్రైవేటీకరణతోనే పురోభివృద్ధి అనుకుంటే అందులో ప్రజల పాత్ర ఎంతో తేలాలి. ప్రభుత్వం నిర్వహణలో ప్రభుత్వరంగ సంస్థలు ఉన్నప్పుడే సామాన్యులకు లబ్ది చేకూరుతుంది. వారికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు దక్కుతాయి. ప్రైవేటీకరణ చేస్తూ పోతే ఈ వర్గాలు మరింతగా అధఃపాతాళానికి తొక్కబడతారు. ప్రైవేటీకరణ మంత్రం పఠిస్తున్న ప్రధాని మోడీ ఇది తమ విధానమని పార్లమెంట్ ఎన్నికల్లో స్పష్టంగా ప్రకటించాలి. ప్రజల సొమ్ముతో నిర్మించుకున్న సంస్థలను అధికారం ఉందికదా అని ఇష్టం వచ్చినట్లుగా తెగనమ్మడం సరికాదు. ఇది ఓ రకంగా పాలనా వైఫల్యంగా చూడాలి. విశాఖ ఉక్కు తమ స్వంత సొత్తు అయినట్టు తెగనమ్మేసే ముందు స్థానిక ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలి. ఉద్యోగుల అభిప్రాయాలు తీసుకోవాలి. నిజానికి విశాఖ ఉక్కు ప్రజల ఉద్యమంతో ఏర్పడ్డది. ఇప్పుడు అదే ప్రజలు దానిని రక్షించుకునేందుకు వీధుల్లో పడ్డారు. ప్రజల ఆందోళనలు పరిగణనలోకి తీసుకోకుంటా పాలకులకు ప్రజలు గుణపాఠం చెబుతారని గుర్తుంచు కోవాలి. గతంలో కాంగ్రెస్ వెనకన ఉండి చక్రం తిప్పిన కార్పోరేట్ శక్తులు

ఇప్పుడూ తమ పనులను నెరవేర్చుకుంటున్నారు. విశాఖ ఉక్కు కోసం కేంద్రం పెట్టిన పెట్టుబడి రూ.5000 కోట్లు మాత్రమే. దానికి ప్రతిగా పన్నులని, డివిడెండ్లని రకరకాలుగా విశాఖ ఉక్కు నుండి ప్రభుత్వం రూ.46,000 కోట్లకు పైగా తిరిగి తీసుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇకపోతే విశాఖ ఉక్కు కోసం భూములిచ్చిన ప్రజలకు ఆనాడు ఎకరానికి ఇచ్చినది రూ.20,000 మాత్రమే. ఈ రోజు స్టీలు ప్లాంటు భూముల విలువ రూ. లక్ష కోట్లకు పైగా ఉంటుందని మార్కెట్ అంచనా. మరి రూ.5000 కోట్లు పెట్టుబడి పెట్టిన ప్రభుత్వానికి రూ.46,000 కోట్లు దక్కితే, 22,000 ఎకరాల భూములిచ్చిన ప్రజానీకానికి ఎంత దక్కాలి? వారికి విశాఖ ఉక్కులో ఉన్న హక్కుతో పోల్చితే కేంద్ర ప్రభుత్వానికి ఉన్న హక్కు ఎంత? అన్నది ఆలోచన చేయాలి. అలా చేస్తే విశాఖ ఉక్కు కోసం మోడీ ప్రభుత్వం చేసినదేమిటన్నది ఇక్కడ ముఖ్యం. బిజెపి అధికారం లోకి వచ్చాక విశాఖ ఉక్కులో ఏమైనా పెట్టుబడి పెట్టిందా? అన్నది తేల్చాలి. విశాఖ ఉక్కుకు స్వంత గనులను కేటాయించమని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోకుండా దానిని అమ్మకానికి పెట్టడం వెనక పెద్ద కుట్ర దాగి ఉందని అర్థం అవుతోంది. కార్పొరేట్లకు ప్రభుత్వరంగ సంస్థలను అప్పనంగా కట్టబెడుతూ.. అమూల్యమైన గనులను కట్టబెట్టడానికి మాత్రమే తోడ్పడే మైనింగ్ విధానాన్ని తెచ్చారు. విశాఖ ఉక్కుకు స్వంత గనులను కేటాయించడానికి ముందుకు రకాపోవడంలోనే ఈ కుట్ర దాగి ఉంది. పోస్కోకు విశాఖ ఉక్కును కట్టబెట్టడం వెనక ఉన్న వ్యాపార లావాదేవీలు బయటకు రావాలి. విశాఖ ఉక్కును ఏదోవిధంగా కబళించే ఆలోచనలే తప్ప పరిరక్షించి బలోపేతం చేసే ప్రణాళికలపై బిజెపి ఎప్పుడూ దృష్టి పెట్టలేదని గుర్తుంచుకోవాలి. విశాఖ ఉక్కు కోసం అమరులైన 32 మంది త్యాగమూర్తులది ఈ విశాఖ ఉక్కు. వారికి అసలు విలువ కట్టగలిగే దమ్ము ఉందా? వేల ఎకరాల భూములను, తమ కుటుంబాలు తరతరాలుగా బతుకుతున్న ఆ భూములను విశాఖ ఉక్కు కోసం అప్పజెప్పిన వేలాది నిర్వాసితులది ఈ విశాఖ ఉక్కు. ఆ కుటుంబాల త్యాగం ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే హక్కు ఎవరు ఇచ్చారు. తమ రెక్కల కష్టంతో విశాఖ ఉక్కును ఉక్కు కార్మికులు. నడిపిస్తున్నారు. ఆసియా ఖండంలోనే విశిష్టమైన ప్లాంట్‌గా పేరు తెచ్చిపెట్టారు. ఆ ప్లాంట్ నడుపుతూ, ప్రమాదకరమైన జోన్‌లలో సైతం ప్రాణాలకు తెగించి శ్రమించారు. అనేకులు ప్రాణాలను కోల్పోయారు. వీటి త్యాగాలను ఎలా వెలకడతారు. విశాఖ ఉక్కు కోసం చిలుమంత సాయం చేయని బిజెపి ప్రభుత్వానికి అమ్మేసే హక్కు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు ఇచ్చారన్న ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి

శంకర్‌పల్లి, మార్చి 6 (వెలుతురు):
శంకర్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం రోజున తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఎలుగంటి మధుసూదన్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎలుగంటి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఎంపీ ఎలక్షన్లో అధిష్టానం టికెట్ ఎవరికీ కేటాయిస్తే వారిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా రాకలు జరుగుతున్నాయి. సీనియర్ నాయకులకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. అందరం కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ నాయకులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. వర్గ విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి సొసైటీ డైరెక్టర్ కాడిగారి రాజశేఖర్ రెడ్డి, అలంఖాన్ గూడ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దమ్మన్నగారి సాయి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంది గోవర్ధన్ రెడ్డి, శివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ కార్పొరేటర్ అక్రమ నిర్మాణంపై జోనల్ కమిషనర్ చర్యలు ఎందుకు తీసుకోవట్లేదు.!?

- యుగంధర్ రెడ్డి

కూకట్‌పల్లి, వెలుతురు:
బాలానగర్ కార్పొరేటర్ మరియు ఆయన అనుచరులకు చెందిన అక్రమ నిర్మాణాలపై పదుల సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్న కూకట్ పల్లి జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు జంకుతున్నారని కాంగ్రెస్ ఏ.బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ప్రశ్నించారు. అయితే ఇటీవల బాలానగర్ కార్పొరేటర్ అక్రమ నిర్మాణంపై యుగంధర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్ నోటీసులు, షోకాస్ నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్స్ ఇచ్చిన కార్పొరేటర్ జవాబు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. దీనితో యు. సి నెంబర్ :1093/టి పి ఎస్/సి-24/కె.పి.జెడ్ /జిహెచ్ఎంసి సంబంధిత డేమోలేషన్ నోడల్ అధికారి రమేష్ కి ఉత్తర్వులు అందడం జరిగింది. అప్పటినుండి నోడల్ అధికారులు, జిహెచ్ఎంసి అధికారులు పరోక్షంగా కార్పొరేటర్ కు సహాయ సహకారాలు అందిస్తున్నారని యుగంధర్ రెడ్డి అన్నారు. పలుమార్లు జెడ్.సి ని కలిసి నేరుగా ఫిర్యాదు చేసిన, ఆర్డర్స్ ఇచ్చిన అధికారులు అమలు పరచటం లేదన్నారు. కార్పొరేటర్ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకపోతే త్వరలో హైకోర్టును ఆశ్రమిస్తామని యుగంధర్ రెడ్డి హెచ్చరించారు.

చదువు కోసం

వరిగుంతం అనే గ్రామంలో మాధవి, సారిక ,శృతి, అని స్నేహితులు ఉండేవారు అక్కడే ఉండే పాఠశాలలో చదువుకునేవారు, అందులో శృతి వాళ్ళ నాన్న శృతిని స్కూల్ మాన్పించాలని అనుకున్నాడు.
ఆడపిల్లకు చదువు ఎందుకు ఇంతవరకు చదివింది చాలు అని చెప్పేవాడు. పై చదువులు చదవాలంటే పక్క గ్రామానికి వెళ్లవలసి వస్తుందని, పాఠశాల మాన్పించాలని నిర్ణయించుకున్నాడు
కానీ శృతి స్నేహితులు అయినా మాధవి, సారిక విషయం తెలుసుకొని శృతిని బాధ

పడవద్దని చెప్పి, జరిగిన విషయం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు వివరించి వారిని శృతి వాళ్ళ ఇంటికి తీసుకెళ్లి శృతి వాళ్ళ నాన్నతో మాట్లాడించారు. చదువుకు ఉన్న ప్రాముఖ్యతను వివరింపజేసి, ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు సమాజానికి ఎంతో ఉపయోగ పడుతుంది. చదువుకున్న ఆడపిల్లలు ధైర్యంగా సమాజంలో జీవించగలరని, వారు ఒకరిపై ఆధారపడకుండా స్వయం శక్తితో బ్రతకగలరని వివరించి శృతిని పాఠశాలకు పంపించడానికి తండ్రిని ఒప్పించారు. అందుకు శృతి చాలా సంతోషించింది అందరితోపాటు మళ్లీ స్కూల్ కి వెళ్లి శృతి చక్కగా చదువుకోసాగింది.

నీతి: చిన్నారుల చదువు కుటుంబానికి వెలుగు. ఆడపిల్ల చదువు దేశానికే వెలుగు

M. మాధవి
ఏడవ తరగతి జడ్పీహెచ్ఎస్ కుల్చారం మెదక్ జిల్లా
సెల్, 9705580551

ధర్నా చౌక్ ఎత్తేసినోళ్లే ధర్నాలా..?

అక్రమ నిర్మాణ దారులే ధర్నాలు చేయడం విడ్డూరం..

బిఆర్ఎస్ నేతలు ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం..

కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి

కూకట్‌పల్లి, వెలుతురు:
ధర్నాచౌక్ ఎత్తేసినోళ్లే ఎల్.ఆర్.ఎస్‌ల పేరుతో ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి విమర్శించారు.

ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని బి ఆర్ ఎస్ పార్టీ పిలుపుమేరకు బుధవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో అక్రమ నిర్మాణాలు ప్రోత్సహించేవారు, నిర్మాణాల వద్ద డబ్బులు వసూలు చేసే వారే ధర్నా చేయడం దురదృష్టకరమన్నారు. ధర్నా చౌక్ ఎత్తేసి ధర్నాలనే నిషేధించిన బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో ధర్నా చేస్తుంటే ప్రజలు పెదవి విరుస్తున్నారని విమర్శించారు.

తెలంగాణ రాష్ట్రం వస్తే ధర్నాలు ఉండవు అన్న టిఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ వచ్చి టిఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ధర్నా చౌక్ తొలగించి ధర్నాలను నిషేధించింది. నిరసన తెలిపే వాళ్లపై అక్రమ కేసులు పెట్టి నిర్బంధాలను కొనసాగించింది గత ప్రభుత్వం అన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రి కాగానే తమది ఫక్తు రాజకీయ పార్టీ అంటూ ఇతర పార్టీ నేతలను బిఆర్ఎస్ లోకి తీసుకొని ఉద్యమకారులను అణచివేశారు.

అయితే ఒక్కసారిగా పరాజయ పాలు కావడంతో బిఆర్ఎస్ పార్టీ ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలని కొత్త పాట అందుకొని ధర్నాలకు పిలుపునిచ్చిందని, టిఆర్ఎస్ నేతల ధర్నా సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచితంగా విమర్శలు చేస్తూ నినాదాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. నిరసనలు ఎవరిని కించపరిచే విధంగా ఉండకూడదని ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డి తెలిపారు.

బస్తీ అభివృద్ధికి నిరంతరం కృషి

- పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి

కూకట్‌పల్లి, వెలుతురు:
బస్తీలోని ప్రతి సమస్యను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తూ అభివృద్ధికి కృషి చేస్తానని పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి అన్నారు. బస్తీలో ఏవైనా శుభ, అశుభ కార్యాలు జరిగినప్పుడు అదే విధంగా వేసవిలో నీటి సమస్యకు తావులేకుండా ప్రత్యామ్నాయ చర్యలో భాగంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ, కూకట్ పల్లి కార్పొరేటర్ సత్యనారాయణల సహకారంతో బస్తీలోని14,15 రోడ్ నెంబర్ సమీపంలోని హెచ్ఎండిఏ పార్క్ వద్ద వాటర్ ట్యాంక్ నిర్మాణానికి బుధవారం బస్తి వాసులతో కిలిసి చంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ పాపిరెడ్డి నగర్ బస్తి లోని ప్రతి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి పరిష్కరిస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చంద్రారెడ్డి తో పాటుగా ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి , కోశాధికారి నర్సింలు ముదిరాజ్, సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, గడ్డం రాజిరెడ్డి, ధర్మారావు, రామ్ రెడ్డి, కనక రెడ్డి, అనంతరాములు, లక్ష్మక్క, శోభ , పద్మ, వనం ఆంజనేయులు, సాంబశివుడు ,యాదగిరి మేస్త్రి, బాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కె.యాదగిరి, వీరయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం...

ఎల్ఆర్ఎస్ ఉచితం చేయాలంటూ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టిన టిఆర్ఎస్ నేతలు...

కూకట్‌పల్లి, వెలుతురు:
ఎల్ఆర్ ఎస్ ఉచితం చేయాలంటూ కూకట్ పల్లి బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు కూకట్ పల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కూకట్‌పల్లి జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా ప్రజల్ని మోసం చేస్తూ ఎల్ఆర్ఎస్ కి డబ్బులు వసూలు చేస్తుందని దీనికి నిరసనగా బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందని అన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎప్పుడూ ప్రజలకు అండగా ఉండే గొప్ప నాయకుడని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు పగుడాల శిరీష బాబురావు, సభీయా గౌసుద్దీన్, ఆవుల రవీందర్ రెడ్డి, జూపల్లి సత్యనారాయణ రావు, మందాడి శ్రీనివాస్ రావు, పండాల సతీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు తూము శ్రవణ్ కుమార్, పగుడాల బాబురావు, నియోజకవర్గం కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మేడ్చల్ మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్ ,రాములన్న, సుధాకర్ రెడ్డి, మక్కాల నర్సింగరావు, ఇజాజ్ సాయిబాబా చౌదరి ,పవన్, మల్లేష్ యాదవ్, విజయ్ కుమార్ ,వీరారెడ్డి ,డివిజన్ అధ్యక్షులు ఇర్ఫాన్ ,సంతోష్ బిక్షపతి ,అంబటి శ్రీనివాస్, మహిళా నాయకులు భవాని, భారతి, ఉమావతీగౌడ్, కృష్ణకుమారి, సావిత్రి , కన్న లత ,రమా ,హరిత.. ప్రధాన కార్యదర్శులు రాజేష్, వెంకటేష్ హరి నాథ్, సిహెచ్ ప్రభాకర్ గౌడ్ సుదర్శన్ రెడ్డి, యూత్ నాయకులు పాతూరు గోపి, సాయి శ్రీనివాస్, అభిలాష్, బొట్టు విష్ణు ,మోజేష్ ,నాని కార్యకర్తలు మహిళా నాయకురాల్లు, అనుబంధ సంస్థ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సిసి రోడ్ల అభివృధి పనులు పూర్తి చేయాలి

పూర్తి అయి న వాటికీ ఎఫ్ టి ఓ జనరేట్ చేయాలనీ అధికారులకు ఆదేశాలు జారి...

జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

వికారాబాద్ జిల్లా (ప్రతినీధి వెలుతురు న్యూస్):
బుధవారం ఉదయం పంచాయతీ రాజ్ ఇఇ లు, డిఇలతో టెలి కాన్ఫరెన్సు ద్వారా జిల్లాలో జరిగే సి సి రోడ్ల నిర్మాణ పనులు ఎక్కడ కూడా ఆగకుండ అనుకున్న అంచనాల మేరకు పూర్తి చేయాలనీ, పూర్తి అయిన వాటికీ తప్పనిసరిగా ఎఫ్ టి ఓ జనరేట్ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతి బిల్డింగ్ నిర్మాణ పనులలో జాప్యం జరుగకుండా, ప్రతి గ్రామ పంచాయతి బిల్డింగ్స్, స్కూల్ కాంపౌండ్ వాల్స్, కిచెన్ షెడ్స్ నిర్మాణ పనులు ఏవైతే ముందే ప్రారంభించి పెండింగ్ ఉన్న వాటిని సత్వరమే పూర్తి చేసి, పూర్తి అయిన వాటికీ తప్పని సరిగా ఎఫ్‌టిఓ జనరేట్ చేయాలనీ అధికారులకు ఆదేశించారు.

జిల్లాలో సిసి రోడ్లకు మంజూరైన నిదులతో అంచనాలను రూపొందించుకొంటూ సిసి రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయలని అధికారులకు ఆదేశించారు. టెలి కాన్ఫరెన్సులో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు డిఇలు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

వికారాబాద్‌కి బదిలీపై డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి

జిల్లా ఎస్పీ నంద్యాల కోటి రెడ్డినీ కలవడం జరిగింది

వికారాబాద్ జిల్లా ప్రతినిధి వెలుతురు న్యూస్:
వికారాబాద్ జిల్లా పరిధిలోని డిఎస్పిసి అంజయ్య బదిలీపై వెళ్లగా నూతనంగా వచ్చిన డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి వికారాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేఅందజేశారు. జిల్లా ఎస్పీ డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు 6 నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలి

ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి: సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్

జిల్లా అదన కలెక్టర్ లింగ నాయక్ మెమోరండం ఇవ్వడమైనది..

వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):
నేడు గ్రామ పంచాయతీ కార్మికుల కలెక్టరేట్ ముట్టడి ధర్నాకు గ్రామ పంచాయతీ ఉద్యగ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్ మాట్లాడుతూ ..పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి మల్టిపర్పసు విధానం రద్దు చెయ్యాలి సౌకర్యం కల్పించాలి ఎండాకాలం సెలవులు ఒక పూట పని పెట్టాలి ప్రతి

ఆదివారం సెలవులు ఇవ్వాలి రెగ్యులర్ వేతనాలు ఇవ్వాలి పెండింగ్లో ఉన్న 7 నెలల జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న గ్రామ కార్యదర్శులపై మండల ఎంపిఓలపై చర్యలు తీసుకోవాలని డిపిఓ కలెక్టర్ లకు కోరుతున్నాముసీనియార్టీ కలిగిన వారికి 10,ఇంటర్ డిగ్రీ పీజీలు చదువుకున్న వారికి కారోబర్స్ కు గ్రామ కార్యదర్శులుగా, జూనియర్ కార్యదర్శులుగా అటెండర్స్ గా ప్రమోషన్లు ఇవ్వాలి. ప్రమాద బీమా 20 లక్షలు ఇవ్వాలి గుర్తింపు కార్డులు ఇవ్వాలి మట్టి ఖర్చులు 20 వేల రూపాయలు ఇవ్వాలి వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆసుపత్రి ఏర్పాటు చేయాలి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కలెక్టర్ ముట్టడి నిర్వహిస్తున్న సమస్యలు పరిష్కరించనిచో జిల్లా వ్యాప్తంగా సమ్మె నిర్వహించి ఆందోళన చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నాము ఈ కార్యక్రమంలో సిఐటి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు ఆర్ మహిపాల్ ,రామకృష్ణ ,బుస చంద్రయ్య ,శ్రీనివాస్, లక్ష్మయ్య కుమార్ ,చంద్రయ్య ,నర్సింహులు శాంతమ్మ నరసమ్మ అనసూయ లక్ష్మి సుజాత జంగమ్మ రాజు రాములు వెంకటయ్య పెంటయ్య 20 మండలాల నుంచి కార్మికులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ ఆనంద్ జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్న తోటి మిత్రులు

వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):
వికారాబాద్ జిల్లా సీనియర్ జర్నలిస్టు జన్మదినాన్ని పురస్కరించుకొని. సీనియర్ జర్నలిస్టులు ఆయన పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకొని శాలువ కప్పి పూలదండతో సన్మానించి కేకు కటింగ్ చేయించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో. సీనియర్ జర్నలిస్టు మిత్రులు శ్రీధర్, రఘు, చుక్కయ్య , వెంకటరమణ, మహేందర్, అశోక్, బాలయ్య, శ్రీకాంత్, మహేందర్, ఈ వేడుకలో పాల్గొన్నారు.

దళితులకు పెద్ద పీట వేసిన భాజాపా ప్రభుత్వం

దళితులను మోసం చేసిన కాంగ్రెస్

జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ ను భారీ మెజారిటీతో గెలిపిద్దాం

జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ను కలిసిన మందకృష్ణ మాదిగ

జహీరాబాద్, మార్చి, 06 వెలుతురు :
జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్ లోని బంజారాహిల్స్ లో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ కార్యాలయంలో బీఆర్ఎస్ నుంచి ఇటీవల బీజేపీలో చేరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా టిక్కెట్ వచ్చిన సందర్భంగా మందకృష్ణ మాదిగ ఎంపీ బీబీ పాటిల్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా దళితుల రిజర్వేషన్ కోసం ఎమ్మార్పీఎస్ వేదికగా అనేక ఉద్యమాలు చేపట్టామని పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ పార్టీ తీరని అన్యాయం చేసిందని, ఎస్సీ వర్గీకరణ పై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టమైన హామీ ఇచ్చారని, బీజేపీ తోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని తెలిపారు. జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ కు దళిత బలహీన వర్గాల సంపూర్ణ మద్దతు ఉంటుందని వెల్లడించారు.

అలరించిన పౌరాణిక నాటకం...

కూకట్‌పల్లి, వెలుతురు:
మన్యంకొండ వెంకటేశ్వర స్వామి బ్రాహ్మత్సవాల సందర్భంగా పౌరాణిక పద్యానాటకం ఎంతగానో ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర భాషా సంస్కృతిక సంస్థ సౌజన్యం తో పాలమూరు కల విపంచి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన చేశారు. పౌరాణిక చారిత్రాత్మక ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కాలంలో నాటకాలను ప్రదర్శించడం, వాటికి ఆదరణ పొందడం ఎంతగనో హర్షనీయమని నిర్వాహకులు అన్నారు. నాటకాన్ని నంది అవార్డు గ్రహీతలు పాత్ర దారులుగా వారి నటనతో అందరిని ఆకట్టుకున్నారు. పల్లెటి కులాశేఖర్ రచించిన తెరు బజారు కు గుంపల సుదర్శన్ దర్శకత్వం వహించారు. నాటకంలో వెంకటేశ్వర స్వామిగా బాబు రాజు, హనుమాన్ దాసుగా సుదర్శన్, కృష్ణమాంబగా సురబి వెంగ మాంబ, హాస్య నటుడుగా రాజు, వెంకయ్య గరుడ అవార్డు గ్రహిత నారాయణ స్వామిలు పోషించి మెప్పించారు.
కార్యక్రమంలో ఆలయ వంశ పర ధర్మకర్తలు అలహారి మధుసూదన్, ఆలయ ఈవో, వేద పండితులు పాల్గొని నటు లను సత్కరించారు.

అమ్ము స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో

మహిళలకు సన్మానం...

కరీంనగర్, వెలుతురు, మార్చి 06:
అమ్ము స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు సుజాత రెడ్డి ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రఖ్యాతి గాంచిన మహిళలకు ఘనంగా సన్మాన కార్యక్రమం కరీంనగర్ జిల్లా పరిషత్ ఆడిటోరియం హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యారు.

ఎల్ఆర్ఎస్ ఫీజులపై బిఆర్ఎస్ ధర్నా

జహీరాబాద్, 06 మార్చి, వెలుతురు :
ఎన్నికల్లో గెలవడానికి పనికిరాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను గందరగోళం చేసిందని జహీరాబాద్ శాసన సభ్యులు కొనింటి మాణిక్ రావు ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణములో ఎల్ఆర్ఎస్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఐ బి అతిథిగృహం నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు ఎమ్మెల్యే కె. మాణిక్ రావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించి స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఎల్ఆర్ఎస్ ని రద్దు చేయాలంటూ ధర్నా నిర్వహించి ఆర్డీఓ కు వినతిపత్రం సమర్పించారు.

అనంతరం ఎమ్మెల్యే మాణిక్ రావు మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ను పూర్తిగా రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామిని మర్చి ఇప్పుడు రాష్ట్ర ప్రజలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని ఆరోపించారు. ఎన్నికల్లో గెలవడానికి పనికిరాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను గందరగోళం చేసిందని ఆరోపించారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం 25 లక్షల కుటుంబాలకు ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్య తరగతి ప్రజలపై భారాన్ని మోపడం తగదని, ఒక్కో కుటుంబంపై లక్ష రూపాయల వరకు భారం పడుతుందని అన్నారు.
విపక్షంలో ఉన్నప్పుడు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క మాట్లాడిన మాటలకు వారు సమాధానం చెప్పాలి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత రైతుబంధు, రైతు రుణమాఫీ సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టకుండా నామమాత్రంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఖరిపై క్షేత్ర స్థాయి పోరాటాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గొర్రెలకు పశువులకు మేతగా మారుతున్న వరి చేనులు

రామన్నపేట, వెలుతురు న్యూస్:
యాదాద్రి జిల్లా రామన్నపేట మండలంలో రోజు రోజుకు ఎండల తీవ్రత పెరగడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయి చేతికంది రావాల్సిన వరి పంటలో చివరి దశలో ఎండిపోయి గొర్రెలు, పశువులకు మేతగా మారిపోతున్నాయి. బోరు బావులకు నీరు అందక పంట పొలాలకు నెర్రలు పడుతున్నాయి. వరి పంట పొట్ట దశలో నిట్ట నిలువునా ఎండిపోతుంది. సాగు కోసం తెచ్చిన అప్పులు తీర్చేదెట్ట అని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. తగిన నష్టపరిహారం అందజేసి ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వేడుకుంటు న్నారు. ఎండిన వరి చేనును గొర్రెల పశువుల మేత కోసం అడ్డుకి పావు షేర్ చొప్పున ఎకరాకు 8 వేలకు అమ్ముకుంటున్నారు.మరి కొంతమంది రైతులు అప్పులో మరింత అప్పు అనుకొని గొర్రెలను కొనుక్కొని ఎండిన చేయను మేపుకుంటున్నారు.ఎండిన వరి చేను తిన్న గొర్రెలు తను తెచ్చిన అప్పులు తీర్చలేక పోతాయా అనే మొండి ధైర్యంతో వ్యవసాయాన్ని నెట్టుకొస్తున్నారు.మండలంలో ఈ ఏడు సరైన వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. రాబి సీజన్లో బోరు బావులు పుష్కలంగా నీరు ఈ ఏడు కురవాల్సిన వర్షం కురవలేదు సగటున 507.5 మి.మి వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 499.5 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదు అయింది. దీంతో వేసవికాలం ఆరంభంలోనే భూగర్భ జలాల అడుగంటిపోయాయి.సాగు చేసిన వరిలో ఇప్పటికే 50 శాతం పంట ఎండిపోయింది. ప్రభుత్వ అప్పన్న హస్తం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.ప్రభుత్వం పంట నష్టపరిహారాన్ని అంచనవేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

బిఆర్ఎస్‌లో కనిపించని దూకుడు

వేడెక్కుతున్న నల్లగొండ రాజకీయం - రెండు ఎంపి సీట్లను గెలుస్తామంటున్న కాంగ్రెస్

నల్లగొండ (వెలుతురు):
ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సూర్యాపేటలో మాత్రమే బిఆర్ఎస్ నెగ్గింది. అక్కడా ఆనాటి మంత్రి జగదీశ్ రెడ్డి ఒక్కరే గెలిచారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడాని బిఆర్ఎస్ నేతలు ఎవరూ పెద్దా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.అసెంబ్లీ ఫలితాల తర్వాత పార్లమెంటుకు సై అన్న నేతలు ఇప్పుడు సైలెంట్ అయ్యారు. ఎక్కడి నుంచైనా పోటీకి సిద్ధమే అన్న మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొడుకు పోటీకి ఇప్పుడు వెనుకంజ వేస్తున్నారని సమాచారం. ఇదే సందర్భంలో గుత్తా దూకుడును అడ్డుఉకునే ప్రయత్నాలు సొంత పార్టీలోనే మొదలయ్యాయి. మరో వర్గం చెక్ పెట్టే ప్రయత్నం చేసిందన్న టాక్ వినిపిస్తోంది. ఎంపీ టికెట్ రాజకీయాలతో ఆ నేతల మధ్య గ్యాప్ మరింత పెరిగిందని అంటున్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉంటానన్న ఆ నేత.. పోటీపై పునరాలోచనలో పడ్డారు. ఇపుడు పార్టీ అధిష్టానంపై ఆ నేత అసంతృప్తితో ఉన్నారా.. లేక పోటీ చేస్తే గెలవమనే భయంతో ఉన్నారా అన్నది చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికలో ఓటమి చవిచూసిన బీఆర్ఎస్ పార్టీ.. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని వ్యూహాలకు పదును పెడుతోంది. గులాబీ దళపతి పార్లమెంటు నియోజక వర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజక వర్గాలకు గాను కేవలం సూర్యాపేటలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. దీంతో ఈసారి నల్గొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయడం బీఆర్ఎస్‌కు సవాల్‌గా మారింది. కృష్ణా జలాలపై కాంగ్రెస్‌ను ఏకిపారేసేందుకు నల్లగొండలో కెసిఆర్ సభ పెట్టినా పెద్దగా

ఫలితం ఇవ్వలేదు. అయితే తన కొడుకును రాజకీయ రంగ ప్రవేశం చేయించాలని భావించిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. తనయుడు గుత్తా అమిత్ రెడ్డి ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ, మునుగోడుల నుండి తనయుడి పొలిటికల్ ఎంట్రీకి గుత్తా సుఖేందర్ రెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో దేవరకొండ బీఆర్ఎస్ ఇన్‌చార్జీగా అమిత్ వ్యవహరించాడు. పార్లమెంట్ ఎన్నికల్లో తనయుడు పొలిటికల్ ఎంట్రీకి గుత్తా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటు గుత్తా సుఖేందర్‌రెడ్డి.. అటు అమిత్ కూడా.. నల్లగొండ ఎంపీగా పోటీ చేయడానికి తాను సిద్ధమంటూ అసెంబ్లీ ఎన్నికల తర్వాత బహిరంగంగానే ప్రకటించారు. ఇదే అదనుగా సుఖేందర్ రెడ్డితో ఉన్న పాత వైరానికి కొందరు నేతలు కొత్త పదును పెట్టారని అంటున్నారు. ఇందులో భాగంగానే నల్లగొండ నుండి పోటీకి కొందరు మాజీల పేర్లను తెరపైకి తీసుకు వచ్చిం దట. ఇదంతా అమిత్‌కు టికెట్ రాకుండా చెక్ పెట్టేందుకేనని పార్టీలో టాక్. నల్లగొండ, భువనగిరిలో ఎక్కడ టికెట్ ఇచ్చినా పోటీకి సిద్ధమేనని గుత్తా చెప్పారు. తమకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యేలంతా జట్టు కట్టినందున ఇలాంటి పరిస్థితుల్లో పోటీ చేయడం కంటే.. కామ్‌గా ఉండటమే గౌరవప్రదమని గుత్తా భావిస్తున్నారట. ఈ నేపథ్యంలో తాజాగా పార్లమెంటుకు పోటీపై గుత్తా పునరాలోచనలో పడ్డారట. కుమారుడి పొలిటికల్ ఎంట్రీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న సుఖేందర్ రెడ్డి ఆశలపై.. సొంత పార్టీ నేతలే నీళ్లు చల్లడాన్ని గుత్తా జీర్ణించుకోలేక పోతున్నారని అంటున్నారు. ప్రస్తుతం పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు తాను పోటీకి సిద్ధమైతే సహకరించాల్సింది పోయి.. వ్యతిరేకించడం ఏంటని గుత్తా ఆవేదన వ్యక్తం చేస్తున్నారని సమాచారం. తమను ఉద్దేశ్యపూర్వకంగా వ్యతిరేకిస్తున్న వారితో మాట్లాడి సమన్వయం చేయాల్సిన పార్టీ పెద్దలు కూడా మిన్నుకుండడం పట్ల గుత్తా ఫ్యామిలీ అసంతృప్తితో ఉందని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయ దుందుభి మోగించిన కాంగ్రెస్.. పార్లమెంటు ఎన్నికలకు కూడా దూకుడు పెంచుతోంది. అయితే బీఆర్ఎస్ లో మాత్రం టికెట్ల గోలతో నేతల మధ్య కోల్డ్ వార్ పిక్ స్టేజికి వెళ్తోందట. దీంతో పార్టీ క్యాడర్ ఆందోళన చెందుతుంది. కాంగ్రెస్ మాత్రం రంగం సిద్ధం చేసుకుంది. భువనగిరి, నల్లగొండల్లో పాగా వేస్తామని అంటున్నారు.

యాదాద్రి వైభవం అద్భుతం..!

యాదాద్రి,మార్చి6(వెలుతురు):
హిరణ్యకశిపుణ్ని నృసింహుడు వధించాక ప్రహ్లాదుడికి సౌజన్యమూర్తిగా, భక్తాభయ వరదుడిగా తన దర్శనాన్ని అనుగ్రహించిన దివ్య సన్నిధే- యాదగిరి క్షేత్రమని పురాణాలు విశ్లేషించాయి. పాంచరాత్ర ఆగమోక్త విధానంలో ఈ క్షేత్రంలో నిత్యోత్సవాలతో మొదలుకొని బ్రహ్మోత్సవాల వరకు నేత్ర పర్వంగా

కొనసాగుతాయి. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ విదియనుంచి ద్వాదశి వరకు పదకొండు రోజులపాటు యాదాద్రిలో బ్రహ్మోత్సవ సంరంభం పరిఢవిల్లుతుంది.యాదర్షి తపస్సు చేసిన ఆ గిరి యాదగిరి. సింహాకార గుహాలయంలో గరుడ శిలపై స్వయం భువుగా, నృసింహుడు భక్తానుగ్రహ కారక మూర్తిగా విలసిల్లుతున్నాడు. విశేషమైన జలనిధి కలిగిన ప్రదేశంపై భారీ ఏకశిలాగిరి ఉన్న క్షేత్రమే యాదగిరి. జలం జీవశక్తికి సంకేతం. సంపదకు చిహ్నం.

సకల జీవులకు చైతన్యదాయక శక్తిగా నారసింహుడు ఆకృతి దాల్చాడు... జగద్గురువు ఆదిశంకరులు నృసింహుడిని జీవులకు ప్రాణదీప్తిగా దర్శించారు. కాకతీయులు ఈ క్షేత్రాన్ని చాలా అభివృద్ధి చేశారు. శ్రీకృష్ణదేవరాయలు పదిహేనో శతాబ్దంలో ఈ ఆలయాన్ని దర్శించి, భూరి విరాళాలు సమర్పించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. కీసరగుట్టను రాజధానిగా చేసుకుని పరిపాలించిన తూర్పు చాళుక్యరాజు త్రిభువన మల్లుడికి యాదగిరి స్వామి ఆరాధ్య దైవం. యాదగిరి క్షేత్రం ప్రస్తుతం నవ్యకళా సౌందర్యాన్ని సంతరించుకుంది. తెలంగాణ ప్రభుత్వం యాదగిరి ఆలయాన్ని సంపూర్ణంగా పునర్నిర్మించింది. ఆళ్వారుల ముఖ మంటపాలు, నలుదిక్కులా మాడవీధులు, సప్త గోపురాలు, అంతర బాహ్య ప్రాకారాలతో కాకతీయ, చాళుక్య, హోయసాల, పల్లవుల కాలంనాటి శిల్పకళా నైపుణ్యాల్ని మేళవించారు.రుద్రగిరి, దేవగిరి, వేదగిరి, ప్రసన్నగిరిగా వినుతికెక్కిన యాదగిరి భక్తుల అభీష్టాల్ని నెరవేర్చే భవ్యమైన దివ్యగిరి!

బాలల హక్కులను అందరూ పరిరక్షించాలి

- జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి జిల్లా, (వెలుతురు):
బాలల హక్కులను అందరూ పరిరక్షించాలని, నేటి బాలలే రేపటి పౌరులు అని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు.
బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ శశాంక అధ్యక్షతన జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని బాలల రక్షణకై అన్ని శాఖల సమన్వయం అవసరమని అన్నారు. జిల్లాలో 18 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలు ఉంటారని, వారిలో బాలకార్మికులు, బాల్య వివాహాలు, అక్రమ రవాణా, మిస్సింగ్ వంటి సమస్యలతో బాధపడే పిల్లలకు రక్షణ కల్పించడం కోసం అందరూ సహకరించాలని సూచించారు. ప్రతి గ్రామం, మండలం, జిల్లా స్థాయి కమిటి నిరంతరం పని చేయాలని సూచించారు. చట్టాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నేటి బాలలే రేపటి పౌరులని పేర్కొన్నారు. బడీడు పిల్లలందరూ బడికి వెళ్లేలా చూడాలన్నారు. సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పిల్లల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ, దత్తత, పిల్లల లైంగిక నేరాలు, మత్తు పదార్థాల నియంత్రణ తదితర అంశాలపై కమిటీ సభ్యులతో చర్చించారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి పద్మజా రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, పిడి డిఆర్డీఎ శ్రీలత,డిపిఓ సురేష్ మోహన్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని చెరువులను కబ్జాలకు గురికాకుండా చూడాలి

రంగారెడ్డి జిల్లా, (వెలుతురు):
జిల్లాలోని చెరువులను కబ్జాలకు గురికాకుండా చూడాలని

సంబంధిత ఇరిగేషన్ ఎస్. ఈ ని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.
బుధవారం జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఛాంబర్లో కలెక్టర్ శశాంక ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సంబంధించిన ఆర్డీఓ, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సంబంధించిన చెరువులు కబ్జాలకు గురికాకుండా ఎఫ్.టి.ఐలను గుర్తించాలని తెలిపారు. అక్రమణలు జరగకుండా గట్టి నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించే బాధ్యత కూడా మనపైనే ఉందని అన్నారు. చెరువులను జాయింట్ సర్వే నిర్వహించి ఎఫ్.టి.ఐలను, బఫర్లను గుర్తిస్తూ కడీలను, సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తే ఆక్రమణకు గురు కాకుండా కాపాడగలుగుతామని సూచించారు. క్షేత్రస్థాయిలో పశీలించి నివేదికలు తయారు చేసి బాధ్యతగా ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలిపారు. భూములకు సంబంధించి అన్ అథరైజడ్ లే అవుటల లిస్ట్ తయారు చేయాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురుకాకుండా చూడాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, భూపాల్ రెడ్డి, ఆర్డీఓ అనంత రెడ్డి, తహశీల్దారులు, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు భద్రత
నియమాలు పాటించాలి

పెండింగ్ చలాన్లపై వాహనదారులకు అవగాహన

నిబంధనలు పాటించని వాహనదారులపై చలాన్లతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటాం : చిరాగ్‌పల్లీ ఎస్ ఐ నరేష్

జహీరాబాద్, మార్చి, 06 వెలుతురు :
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లీ మండల కేంద్రములో బుధవారం కమాన్ వద్ద చిరాగ్ పల్లీ ఎస్ ఐ నరేష్ వారి సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు నిర్వహించి పెండింగ్ చలాన్లపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ నరేష్ మాట్లాడుతూ వాహనదారులు ఆర్.సి, పొల్యూషన్, ఇన్సూరెన్స్, సీట్ బెల్ట్, హెల్మెట్ తో పాటు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. నియమ నిబంధనలు పాటించని వాహనదారులపై చలాన్లతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ హెచ్చరించారు. ముఖ్యంగా లారీలు, టిప్పర్లు ఓవర్ లోడ్ తో రవాణా చేయడం వల్ల రోడ్లు పూర్తిగా గుంతలుగా ఏర్పడి వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తుందని అలాంటి వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

100వ ప్రతిష్ట పూర్తి అయినా సందర్భంగా
పురోహితుడికి సన్మానం

వెలుతురు నారాయణఖేడ్ మార్చ్ 06 :
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మండలం పోతన్పల్లి (R) గ్రామం నందు శ్రీ కాశీ విశ్వనాథుని ప్రతిష్ట తో వంద వ ప్రతిష్ట పూర్తి అయినందుకు సాధు సంతులు శ్రీ కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ కొండాపూర్ సంగ్రామ్ మహారాజ్ మరియు ఇతర సాధులు శివ

స్వాముల కలిసి శత ప్రతిష్టాచార్య రత్నా అను బిరుదు ను అని శ్రీ స్మార్త ఆగమ పండితులు పురోహిత సార్వభౌమ గురురాజ శర్మ గారికి బిరుదును అంకితం చేయడం జరిగినది ఈ కార్యక్రమం లో గ్రామస్థులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘోర అగ్నిప్రమాదం

కారులో ఉన్న సిలిండర్ పేలి షెడ్ దగ్ధం

వెలుతురు నారాయణఖేడ్ మార్చ్ 06 : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని కరస్ గుత్తి రోడ్డు కాకతీయ స్కూల్ దగ్గర వెల్డింగ్ షాప్ షెడ్‌లో కారుకు వెల్డింగ్ చేస్తుండగా గ్యాస్

సిలిండర్ పేలి అందులో ఉన్న కార్లు దగ్ధమైనాయి. గ్యాస్ సిలిండర్ పేలడంతో పట్టణంలో పెద్ద శబ్దం రావడంతో ప్రజలు భయంతో పరుగులు పెట్టారు. షెడ్డులో ఐదారు కార్లుతో పాటు ఇంకా ఎన్ని ఉన్నాయో తెలియరాలేదు.

మేనిఫెస్టో కసరత్తులో కాంగ్రెస్

ప్రజల ఆశలకు అనుగుణంగా హామీలు

న్యూఢిల్లీ,మార్చి6(వెలుతురు):
లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ మేనిఫెస్టో సిద్ధం చేస్తోంది. ఓటర్లను ఆకట్టుకునేందుకు భారీ హామీలు అందులో చేర్చినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ముఖ్యంగా యువత, రైతుని దృష్టిలో పెట్టుకుని దీన్ని రూపొందించినట్టు సమాచారం. ప్రస్తుతం రాహుల్ గాంధీ నేతృత్వంలో మధ్యప్రదేశ్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్ర కొనసాగుతోంది. అక్కడే ఈ మేనిఫెస్టోని విడుదల చేసేందుకు అవకాశాలున్నాయి. 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, కనీస మద్దతు ధరపై చట్టం చేయడం, మహిళా రిజర్వేషన్‌లు, ముస్లింల ఆర్థిక స్థితిగతులను అంచనా వేసే సచార్ కమిటీ ఏర్పాటు లాంటి హామీలు ఇందులో ఉన్నట్టు తెలుస్తోంది. వీటితో పాటు ఎగ్జామ్స్‌లో పేపర్ లీక్ చేసే వాళ్లపై కఠిన చర్యలు తీసుకునేలా కొత్త నిబంధనలు తీసుకురానున్నట్టు సమాచారం.

మధ్యప్రదేశ్‌లోని బదనావర్ ర్యాలీలో రాహుల్ గాంధీ ఈ ఎన్నికల హామీలను వెల్లడించే అవకాశముంది. రాహుల్‌తో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా ఉంటారని సమాచారం. ప్రస్తుతం ఈ మేనిఫెస్టోని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇంకా ఆమోదించాల్సి ఉంది. ఒక్కసారి ఆమోద ముద్ర పడగానే అధికారికంగా విడుదల చేస్తారు. ఇందులో కీలకంగా 5 అంశాలపై కాంగ్రెస్ ఫోకస్ చేసింది.

ఎప్పటి నుంచో కాంగ్రెస్ కులగుణన గురించి ప్రస్తావిస్తోంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ హామీ ఇచ్చింది. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే హామీ ఇచ్చే అవకాశాలున్నాయి.

తక్కువ ఖర్చుతో కాల్షియం

ఆ ఆహార పదార్థాలు గురించి తెలుసుకుందామా..

మనం తినే ఆహార పదార్థాలను బట్టే ఆరోగ్యం ఉంటుంది. రోజువారీ ఆహారంలో అన్ని రకాల పోషకాలు అందించే ఆహార పదార్థాలు ఉంటే, ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. ముఖ్యంగా మన శరీరానికి కాల్షియం చాలా అవసరం. మానవ శరీరం ప్రాథమికంగా ఎముకల్లో 99 శాతం కాల్షియం నిల్వ చేస్తుంది. మిగిలిన ఒక శాతాన్ని కండరాల పనితీరు, రక్తం గడ్డకట్టడం, ఇతర ముఖ్యమైన శారీరక ప్రక్రియల కోసం వినియోగిస్తుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (%చీ×ఽ%) ప్రకారం.. పెద్దలు ప్రతిరోజూ 1,000 మిల్లీ గ్రాముల కాల్షియం తీసుకోవాలని సిఫార్సు చేస్తారు. 50 ఏళ్లు పైబడిన మహిళలు, గర్భధారణ, తల్లి పాలిచ్చేవారు 1,200 మిల్లీ గ్రాముల వరకు తీసుకోవాలి. 30, 40 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తులు తరచుగా వారి ఆహారంలో తగినంత కాల్షియం, విటమిన్ డీని తీసుకోరు. ఈ లోపం వల్ల ఆర్థరైటిస్, బోలు ఎముకల వ్యాధి (బలహీనమైన ఎముకలు), కీళ్ల నొప్పులు, పెద్దయ్యాక బోన్ ఫ్రాక్చర్స్ (విరిగిన ఎముకలు) వంటి సమస్యలు వస్తాయి. ఈ సమస్యలకు పరిష్కారాలను, లక్నోలోని సెంట్రల్ కమాండ్ హాస్పిటల్‌లోని డైటీషియన్ రోహిత్ యాదవ్ 'న్యూస్ 18'తో షేర్ చేసుకున్నారు. రోజువారీ ఆహారంలో కాల్షియం అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు.

ఎముకల ఆరోగ్యానికి, మొత్తం శ్రేయస్సుకు ఉపయోగపడే తక్కువ ఖర్చుతో కూడిన ఆహార పదార్థాలను సూచించారు. అవేంటంటే..

గసగసాలు

గసగసాలు కాల్షియం, ఐరన్, ఆరోగ్యకరమైన కొవ్వులు వంటి అవసరమైన పోషకాలను అందిస్తాయి. ఇవి అందరికీ అందుబాటులో ఉంటాయి, తక్కువ ఖర్చుతో కూడుకున్నవి. అయినప్పటికీ వాటి వేడి స్వభావం కారణంగా వాటి వినియోగం మితంగా ఉండాలి.

నువ్వులు

సాధారణంగా నువ్వుల్లో రెండు రకాలు నల్లనివి, తెల్లనివి ఉంటాయి. ఈ రెండింటిలోనూ క్యాల్షియం సమృద్ధిగా లభ్యమవుతుంది. రెండు టేబుల్ స్పూన్ల నువ్వులు (సుమారు 30 గ్రాములు) తీసుకుంటే 300 మిల్లీగ్రాముల క్యాల్షియం శరీరానికి అందుతుంది. క్యాల్షియంతో పాటు వీటిలో ఫైబర్, కాపర్, మెగ్నీషియం, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, ప్రొటీన్లు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మధుమేహం, ఆర్థ్రైటిస్ సమస్యల నుంచి కూడా రక్షణ కలిగిస్తాయి. చర్మ ఆరోగ్యాన్ని పెంపొందించడంలోనూ నువ్వులు కీలక పాత్ర పోషిస్తాయి.

పాలు, పాల ఉత్పత్తులు

పాలు, పాల ఉత్పత్తుల్లో కాల్షియం సమృద్ధిగా ఉంటుంది. అయినప్పటికీ వాటి వినియోగం వయస్సుతో పాటు తగ్గుతుంది. పాలు క్రమం తప్పకుండా తాగితే ఎముకలకు సంబంధించిన సమస్యలు దూరమవుతాయి. ఇతర ఆహారాలతో పోలిస్తే పాల ఉత్పత్తులు అధిక కాల్షియం కంటెంట్‌ను అందిస్తాయి.

రాగులు

100 గ్రాముల రాగుల్లో 300 మిల్లీగ్రాముల క్యాల్షియం ఉంటుంది. దీంతో పాటు పొటాషియం కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలోని జీవక్రియల రేటును మెరుగుపరుస్తుంది. గుండె, కిడ్నీలు సక్రమంగా, సమర్థంగా పనిచేసేలా చూస్తుంది. బరువు తగ్గడంలోనూ తోడ్పడుతుంది.

చియా విత్తనాలు

చేపలు, టోఫు వంటి ఖరీదైన కాల్షియం-రిచ్ ఆహారాలను కొనుగోలు చేయలేని వ్యక్తులకు, చియా విత్తనాలు ఉత్తమ ప్రత్యామ్నాయంగా పనిచేస్తాయి. ఈ విత్తనాల్లో కాల్షియం, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు, ప్రొటీన్‌లు పుష్కలంగా ఉన్నాయి. 100 గ్రాముల చియా సీడ్స్ నుంచి దాదాపు 400 నుంచి 600 %ఎస్ర% కాల్షియం అందుతుంది. సాధారణంగా భారతదేశంలో చియా విత్తనాల ధర రూ.50 కంటే తక్కువ.

ఆకు కూరలు

పాలకూర, కాలే వంటి ఆకుపచ్చని ఆకుకూరల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. వీటిలో విటమిన్లు %ూ, జ, ఙ, ఖ%, ఐరన్, ఫైబర్ సహా ఇతర ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఈ కూరగాయలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల బోలెడు ప్రయోజనాలు అందుతాయి.

వంటకు స్టీల్ పాత్రలను వినియోగిస్తున్నారా.?

ఇలా చేస్తే డేంజర్ లో పడక తప్పదు.!

ప్రస్తుతం చాలామంది వంట చేసే పాత్రలపై కొన్ని అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.. స్టీల్ పాత్రలు వాడాలా.. అల్యూమినియం పాత్రలు వాడాలా..మట్టి పాత్రలు వాడాలా అని రకరకాల అనుమానాలతో సతమతమవుతున్నారు.. మనం తీసుకునే ఆహారం అన్నీ కూడా పచ్చిగా తీసుకోకూడదు. కొన్ని ఆహార పదార్థాలను వేడి చేసి తినడం ఆరోగ్యానికి మంచిది. అయితే మనం వంట చేసే విధానం మన ఆరోగ్యంపై ఎలా ప్రభావితం అవుతుందో తెలుసుకుందాం%ూ% ఆహారాన్ని వండడానికి వినియోగించే వస్తువులు కూడా మన శరీర ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి. సహజంగా వంట వండడం కోసం స్టీల్ పాత్రలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఎందుకంటే స్టీలు పాత్ర మంచిదని అందరి అభిప్రాయం. కానీ ఈ పాత్రలు సరిగ్గా వినియోగించకపోతే ప్రాణానికి ప్రమాదం తప్పదు.. కావున స్టీలు పాత్రలు వినియోగించేటప్పుడు ఎప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే శరీరంపై త్రీవర ప్రభావం పడుతుందని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. నాన్ స్టిక్ వంట సామాన్ల కంటే స్టెయిన్లెస్ స్టీల్ పాత్రలు ఆహారం వేడి చేయడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఈ పాత్రలలో ఆహారం వేడి త్వరగా చల్లారిపోతుంది. కాబట్టి ఉడికించే ముందు మీడియం మంట మీద వేడి చేయాలి. ఆ తర్వాత ఒక పాత్రలోకి వడ్డించాలి. స్టెయిన్లెస్ స్టీల్ పాత్రలలో వంట చేయడానికి నాన్ స్టిక్ అంటే ఎక్కువ నూనె అవసరం పడుతుంది. లేదంటే ఆహారం ఫ్యాన్ కి అత్తుకుపోతూ ఉంటుంది. మార్చురైజర్స్ ఆహారాలు స్టెయిన్లెస్ కుక్ వేరు ప్యాన్ను అంటుకుంటే అధిక గ్యాప్ వేడిని తగ్గిస్తుంది. ఇది పాన్ నుండి ఆహారం బయటికి పోవడానికి కారణం అవుతుంది. కాబట్టి వంట చేయడానికి నాణ్యమైన స్టెయిన్లెస్ స్టీల్ పాత్రలను వినియోగించాలి. దీంతో వంటకాలు ఎక్కువసేపు పాడవ్వకుండా ఉంటాయి.

ఆహారం కూడా నాణ్యమైనదిగా రుచిగా ఉంటుంది. స్టెయిన్లెస్ స్టీల్ ఫ్యాన్ లో పంచదార పాకం తయారు చేసేటప్పుడు కొంత సమయం పడుతుంది.. తక్కువ నాణ్యత గల స్టీల్ పాత్రలలో అయితే పంచదార పాకం వెంటనే మాడిపోతుంది. స్టైన్లెస్ స్టీల్ పాత్రలో ఒకేసారి అధిక పదార్థాలను వేడి చేయవద్దు. ఆహార పదార్థాలు ఒక్కొక్కటిగా జోడించి దశలవారీగా ఆహారాన్ని ఉడికించుకుంటే ఆహారం సమతుల్యంగా ఉడుకుతుంది. కాబట్టి స్టీల్ పాత్రలు వినియోగించేటప్పుడు వాటి నాణ్యతను చెక్ చేసుకుని తెచ్చుకొని దానిలో వంట చేసుకోండి.. ఇలా చేస్తే మీ ఆరోగ్యానికి ఎటువంటి ముప్పు ఉండదు..

షుగర్ కంట్రోల్ ఉండాలి అంటే..

ఏం తినాలి.. ఏం తినకూడదు?

నేటి కాలంలో డయాబెటిస్ సమస్యతో బాధపడేవారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ సమస్య కారణంగా చాలా మంది తీవ్రమైన అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. అయితే చాలా మందికి డయాబెటిస్ సమస్య ఉనప్పుడు ఎలాంటి ఆహారపదార్థాలు తీసుకోవాలి. ఎటువంటి పదార్థాలు తీసుకోకుండా ఉండాలి అనేది పెద్ద ప్రశ్నగా మారింది. ఉయాబెటిస్ ఉన్నవారు కొన్ని పదార్థాలు తీసుకోవడం వల్ల షుగర్ లెవెల్స్ ఎక్కువగా పెరుగుతాయి. దీని కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. అయితే ఇక్కడ మీకోసం కొన్ని ఆహారపదార్థాలు తీసుకోవాలి, ఎటువంటి పదార్థాలు తీసుకోకుడాదు అనేది తెలుసుకుందాం.

తినవలసిన ఆహారాలు:

పండ్లు: బెర్రీలు, ఆపిల్, నారింజ, సీతాఫలాలు, పుచ్చకాయ, ద్రాక్ష వంటి పండ్లు ఫైబర్, యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి, ఇవి రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి.

కూరగాయలు: ఆకుకూరలు, బ్రోకలీ, క్యారెట్, బీట్‌రూట్, టమాటాలు, వంకాయ వంటి కూరగాయలు కూడా ఫైబర్‌తో నిండి ఉంటాయి, ఇది చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది.

పప్పులు-చిక్కుళ్ళు: పప్పులు, శనగలు, మినుములు వంటివి ప్రోటీన్ మరియు ఫైబర్‌కు మంచి మూలం, ఇవి రక్తంలో చక్కెరను స్థిరంగా ఉంచడంలో సహాయపడతాయి.

ధాన్యాలు: ఓట్స్, బ్రౌన్ రైస్, క్వినోవా వంటి ధాన్యాలు ఫైబర్‌తో నిండి ఉంటాయి, ఇది చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది.

ఆరోగ్యకరమైన కొవ్వులు:

ఆలివ్ నూనె, గుడ్డులోని పచ్చసొన, అవకాడో వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి.

తినకూడని ఆహార పదార్థాలు:

చక్కెర పానీయాలు: సోడా, జ్యూస్, స్పోర్ట్స్ డ్రింక్స్ వంటి చక్కెర పానీయాలు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి.

ప్రాసెస్ చేసిన ఆహారాలు:

ఫాస్ట్ ఫుడ్, స్నాక్స్, చిప్స్, ఫ్రోజెన్ ఫుడ్స్ వంటి ప్రాసెస్ చేసిన ఆహారాలు చక్కెర, ఉప్పు మరియు అనారోగ్యకరమైన కొవ్వులతో నిండి ఉంటాయి, ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి.

ఎర్ర మాంసం: ఎరుపు మాంసం సంతృప్త కొవ్వుతో నిండి ఉంటుంది, ఇది గుండె ఆరోగ్యానికి హానికరం మరియు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది.

తెల్ల బ్రెడ్ - పాస్తా: తెల్ల బ్రెడ్, పాస్తా వంటి శుద్ధి చేసిన ధాన్యాలు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి.

డెజర్టు: కేకులు, ఐస్ క్రీం, బిస్కెట్లు వంటి డెజర్టు చక్కెరతో నిండి ఉంటాయి, ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి.

గుర్తుంచుకోండి: మీకు మధుమేహం ఉన్నట్లయితే, మీకు సరైన ఆహార ప్రణాళికను రూపొందించడానికి మీ వైద్యుడితో లేదా డైటీషియన్‌తో మాట్లాడటం చాలా ముఖ్యం.

రికార్డు స్థాయికి చేరిన బంగారం ధర..

బంగారం ధర రికార్డు గరిష్ఠాలకు చేరింది. 10 గ్రాముల మేలిమి బంగారం (24 క్యారెట్లు/999 స్వచ్ఛత) ధర దేశీయ విపణిలో రూ.66,000 దాటింది. అమెరికాలో వడ్డీరేట్లు తగ్గుతాయనే సూచనలు, ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు తొలగకపోవడమే ఇందుకు కారణంగా నిపుణులు విశ్లేసిస్తున్నారు. కేంద్రీయ బ్యాంకుల నుంచి పసిడి నిల్వలు పెంచుకునేందుకు లభిస్తున్న ఆసక్తి, క్రిప్టోకరెన్సీల విలువ గణనీయంగా పెరగడంతో హెడ్జింగ్ కోసం పసిడిపైనా పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిసింది. ధరలు భగ్గుమంటుండటం, దేశీయంగా వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు ఉండడంతో అమ్మకాలు పుంజుకుంటున్నట్లు తెలిసింది. బుధవారం నమోదైన వివరాల ప్రకారం దేశంలో పలు నగరాల్లో బంగారం ధరల్ని పరిశీలిస్తే ఈ కింది విధంగా ఉన్నాయి.

తీవ్ర ఊగిసలాట.. జీవితకాల గరిష్ఠాలను చేరిన మార్కెట్ సూచీలు

దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు బుధవారం తీవ్ర ఒడిదొడుకుల మధ్య జీవితకాల గరిష్ఠాలను చేరింది. మార్కెట్ ముగింపు సమయానికి నిఫ్టీ 126 పాయింట్లు ఎగబాకి 22,482 వద్దకు చేరింది. సెన్సెక్స్ 408 పాయింట్లు పుంజుకుని 74,085 వద్ద ముగిసింది. మంగళవారం విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ) నికరంగా రూ.574.28 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశారు. దేశీయ సంస్థాగత మదుపర్లు (డీఐఐ) రూ.1,834.61 కోట్ల స్టాక్స్‌ను కొన్నారు. సెన్సెక్స్ 30 సూచీలో కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, సన్ ఫార్మా, ఎం అండ్ ఎం, టైటాన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఎల్ అండ్ టీ, ఐసీఐసీఐ బ్యాంక్ స్టాక్ షేర్లు లాభాల్లోకి చేరుకున్నాయి. అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, మారుతి సుజుకి, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటార్స్, పవర్‌గ్రిడ్, బజాజ్ ఫైనాన్స్ స్టాక్ పేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి.

మళ్లీ అందరూ బ్యాంకుల్లో కేవైసీ అప్‌డేట్ చేయాలి..?

ఆర్థిక అవసరాలకు బ్యాంకులను ఆశ్రయిస్తుంటారు. దానికి బ్యాంకు ఖాతా అవసరం ఉంటుంది. చాలామందికి ఒకటికి మించి బ్యాంకు ఖాతాలుండడం సహజం. అయితే వేర్వేరు కేవైసీ పత్రాలను ఉపయోగించి ఒక వ్యక్తి తెరచిన పలు ఖాతాలను కనిపెట్టడానికి కేంద్రం చర్యలు తీసుకుంటుంది. దానికి అదనపు గుర్తింపులు కావాలని ప్రత్యేక కమిటీ సూచించింది. బ్యాంకుల్లో ఖాతాలను, ఖాతాదార్లను గుర్తించడానికి అదనపు ధ్రువీకరణ ప్రక్రియలను అమలు చేయనున్నారు. వినియోగదారు సమాచారాన్ని (కేవైసీ-నో యువర్ కస్టమర్) మరింత బలోపేతం చేయడంపై బ్యాంకులు దృష్టి సారించాయి. ప్రస్తుత ఖాతాలన్నిటికీ ముఖ్యంగా పలు ఖాతాలు లేదా జాయింట్ ఖాతాలకు ఒకే ఫోన్ నంబరు ఉన్న ఖాతాలకు దీనిని వర్తింపజేయాలని భావిస్తున్నాయి. వేర్వేరు పత్రాలతో పలు ఖాతాలను తెరచిన ఖాతాదార్ల నుంచి మరిన్ని ధ్రువీకరణలను కోరవచ్చు. ఆర్థిక రంగంలో కేవైసీ నిబంధనలను ప్రామాణీకరించడం కోసం ఆర్థిక కార్యదర్శి టీవీ సోమనాథన్ నేతృత్వంలో కేంద్రం ఒక కమిటీని గతంలోనే ఏర్పాటు చేసింది. పాన్, ఆధార్, మొబైల్ నంబరు తదితరాలను అదనపు గుర్తింపుల కింద పరిశీలిస్తున్నట్లు ఒక బ్యాంక్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ చెబుతున్నట్లు కొన్ని మీడియా కథనాల ద్వారా తెలిసింది. వేర్వేరు కేవైసీ పత్రాలను ఉపయోగించి ఒక వ్యక్తి తెరచిన పలు ఖాతాలను కనిపెట్టడానికి, అదనపు గుర్తింపులతో వీలవుతుందని బ్యాంకులు భావిస్తున్నట్లు తెలిసింది.





అక్కడ పెళ్ళి చేసుద్దాం... కలిసివెళ్ళి

ప్రియాంకా చోప్రా – నిక్‌జోన్స్, దీపికా పదుకొనే – రణ్‌వీర్‌సింగ్, ఇషా అంబానీ – ఆకాశ్.... ఇలా ప్రముఖులందరూ డెస్టినేషన్ వెడ్డింగ్ బాట పట్టారు. ఖర్చు పెట్టే సామర్థ్యం ఉన్నవాళ్లందరూ గోవా, జోధ్‌పూర్, ఉదయపూర్, ఇటలీలోని లేక్ కోమో లాంటి రకరకాల చోట్లకు క్యూ కడుతున్నారు. కొత్తగా ఆలోచిస్తే, మీ డెస్టినేషన్ వెడ్డినేషన్‌ను మరింత విభిన్నంగా ప్లాన్ చేసుకోవచ్చు. అలాంటి హార్ట్‌బీట్ పెంచే ఆఫ్‌బీట్ వెడ్డింగ్ డెస్టినేషన్స్‌లో కొన్నిటి గురించి....

ఆ ద్రాక్షతోటల్లో...

ఆ ఇద్దరూ కాబోయే దంపతులు. చుట్టూ ఎంతో మంది అతిథులు. సరిగ్గా సూర్యాస్తమయం అవుతోంది. ఆ అరుణ కిరణాలు వారి మీద పడుతున్నాయి. ఈ క్షణం కోసమే వారందరూ ఎదురుచూస్తున్నారు. అప్పుడే ఒకటయ్యారు. అప్పటి నుంచి ఫోటోలు క్లిక్‌మంటూనే ఉన్నాయి. జీవితంలోని ఈ అపురూప ఘట్టానికి ఇంతకుమించిన అందాల వేదిక ఎక్కడ ఉంటుంది? చాలా మంది ఇటలీలోని వైన్‌యార్డులను ఎంచుకుంటారు. అయితే ఎక్కడో విదేశాల దాకా వెళ్లక్కర్లేదు. మహారాష్ట్రలోని నాసిక్‌లోని వైన్‌యార్డ్స్ ఇప్పుడు ఆఫ్‌బీట్ డెస్టినేషన్‌గా ఖ్యాతి చెందాయి. సకల వసతి సౌకర్యాలు ఉంటాయి. వినోదానికి ఏ మాత్రం ఢోకా ఉండదు.

ఎలా వెళ్లాలి: ముంబయి నుంచి 171 కి.మీ. అక్కడ నుంచి అయిదు గంటల ప్రయాణం.

ఖర్చెంత: 500 నుంచి 2000 మంది ఒకేసారి పాల్గొనే అవకాశం ఉంటుంది. మొత్తం రూ. 1,50,000 వసూలు చేస్తారు.

ట్రైబల్ వెడ్డింగ్!

ఈశాన్య రాష్ట్రాల అందాలకు ఫిదా కాని వారు ఎవరు ఉంటారు చెప్పండి! కాస్త సమయం చిక్కితే ఈ ప్రాంతాలకు వెళ్లాలనుకునేవాళ్లు చాలామంది ఉంటారు. కేవలం పర్యాటకానికే కాదు డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు కూడా మేఘాలయ రాష్ట్రం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇక్కడే చాలా రిసార్టులు ఈ సౌకర్యం కల్పిస్తున్నాయి. అంతేకాదు ఇక్కడ ట్రైబల్ వెడ్డింగ్ కూడా చేసుకోవచ్చు. ఈ రాష్ట్రంలో కాశీ తెగ వారు అత్యధికంగా ఉంటారు. అక్కడ ఉన్న జైనిటా పర్వతాల మధ్య ఉన్న ఓ చిన్న పల్లెలో ఈ వివాహం చేసుకోవచ్చు. చాలా సింపుల్‌గా ఉంటుంది. వధూవరులిద్దరూ కాశీ తెగవారి దుస్తులు ధరిస్తారు. ఉంగరాలు మార్చుకుంటారు.

ఎలా వెళ్లాలి: మేఘాలయ రాజధాని షిల్లాంగ్ నుంచి డాకి పట్టణం 81 కి.మీ దూరంలో ఉంది.

సింపుల్..'టు స్టేట్స్' టెంపుల్

అమ్మాయి.... దక్షిణాది రాష్ట్రం తమిళనాడులో పుట్టింది. ఇక అబ్బాయి.... స్వస్థలం పంజాబ్. వీరిద్దరూ కలిసింది ఐఐఎమ్ అహ్మదాబాద్‌లో. ఇద్దరూ ప్రేమలో పడ్డారు. వేర్వేరు నేపథ్యాలు. విభిన్న సంస్కృతులు. నానా తంటాలు పడి పెద్దలను ఒప్పించుకున్నారు. ఇక చివరికి మహాబలిపురం సాగరతీరంలో ఉన్న ప్రఖ్యాత ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. ఇది చాలా క్రితం వచ్చిన 'టూ స్టేట్స్' అనే సినిమా కథ. ఈ పెళ్లి సన్నివేశం చాలా ఫేమస్ అయింది. అంతే కాదు ఆ తర్వాత ఆ మహాబలిపురం గుడిలో డెస్టినేషన్ వెడ్డింగ్‌కు డిమాండ్ పెరిగింది. వధూవరులు అక్కడికి దగ్గర్లో ఉన్న రిసార్టులు బుక్ చేసుకొని, ఈ ఆలయంలో వివాహం చేసుకుంటున్నారు.

ఎలా వెళ్లాలి: చెన్నై నుంచి 56 కి.మీ దూరంలో ఉంది.

హిమాలయాల సాక్షిగా.....

అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ పట్టణం ఇప్పుడిప్పుడే పెళ్లి వేడుకలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఎప్పటినుంచో హనీమూన్ డెస్టినేషన్‌గా కూడా నూతన వధూవరులకు ఇష్టమైన ప్రదేశం ఇది. హిమాలయ పర్వతాల సోయగాలను వీక్షిస్తూ, ఆ ప్రకృతి ఒడిలో కొత్త జీవితానికి స్వాగతం పలకాలనుకునేవారికి ఇది సరైన్ ఛాయిస్. పెళ్లి వేడుకల కోసం ఇక్కడ చాలా రిసార్టులు అందుబాటులో ఉన్నాయి.

ఎలా వెళ్లాలి: కోలకతా నుంచి రోడ్డు, విమానమార్గాల్లో వెళ్లవచ్చు. గౌహతిలోని లోకనాథ్‌ప్రియ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 480 కి.మీ దూరంలో ఉంది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెల వరకు ఈ ప్రాంతం పర్యాటకానికి అనువుగా ఉంటుంది.

ఇసుక కొండల్లో... భయం భయంగా!

దుబాయ్ ఆకాశహర్మ్యాలకే కాదు... ఎడారి యాత్రలకు కూడా ప్రసిద్ధమైనదే. 'ఆకాశాన్ని ముద్దాడాలని తహతహలాడుతున్నాయా!' అన్నట్టు ఉన్నాయి దుబాయ్‌లోని భవన సముదాయాలు. చక్కని పరిశుభ్రమైన నగరం దుబాయ్. విశాలమైన రోడ్లు, ఫ్లై ఓవర్‌లతో అలజడి లేని అరేబియన్ సముద్రతీరాన వెలసిన స్వర్గధామం కొత్త దుబాయ్ నగరం. 'వ్వావ్ దుబాయ్' అనిపించింది తొలిచూపులోనే! హైదరాబాద్ నుంచి దుబాయ్‌కి ప్రయాణం నాలుగు గంటల లోపే!

మామూలు కార్లకు నో ఛాన్స్!

దుబాయ్ నగరానికి సుమారు 40 కి.మీ. దూరంలో గొప్ప ఎడారి ఉంది. ఎడారి అంటే అంతా పెద్ద ఇసుక కొండలు. మన ప్రాంతంలో చాలాచోట్ల రాతి కొండలు కనిపిస్తాయి. కానీ ఇసుక కొండలు దుబాయ్‌కి ప్రత్యేకం. ఈ ఎడారిలో మన మామూలు నాలుగు చక్రాల కార్లు నడవవు. ఎనిమిది చక్రాలుగల లాండ్ క్రూయిజ్ వంటి భారీ వాహనాలను ఈ సఫారీ యాత్రకు ఉపయోగిస్తారు.

మా అందరి కోసం ఓ ఎనిమిది లాండ్ క్రూయిజ్‌లు ఏర్పాటు చేశారు. తొలిసారిగా ఎడారిలో ప్రయాణమేమో, ఎంతో మధురానుభూతి కలిగిస్తుందనుకున్నాం. తీరా ప్రయాణం మొదలయ్యాక తెలిసింది ఆ పర్యటన ఎంత భయానకమో! ప్రయాణమంతా ఇసుక కొండలు, ఆ పక్కనే వున్న లోయల్లో సుమారు ముప్పై నిమిషాలకు పైగా సాగింది. అక్కడ డ్రైవర్లు చాకచక్యంగా నడపగల సమర్థులే. అయినప్పటికీ ఈ ప్రయాణం సాహసోపేతమైనదనే చెప్పాలి. ఈ యాత్రలో ప్రమాదాలు సర్వసాధారణం అని డ్రైవర్ చెప్పాడు. రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి ఇది ఏ మాత్రం సురక్షితం కాదన్నాడు. అపురూపమైన ఆ ఎడారిలో ప్రాణాలు అరచేతిలో ఉంచుకొని, భయం భయంగా ఆ టూర్‌ని ఆస్వాదించాం. డిజర్ట్ సఫారీ యువతకు కూడా అంత క్షేమం కాదు. ఆ ప్రాణాంతకమైన యాత్రను ఇప్పుడు తలుచుకుంటే వెన్నులోంచీ చలి పుట్టుకొస్తోంది. దుబాయ్ వెళ్ళి వచ్చిన వారిని 'అక్కడ సఫారీకి వెళ్ళారా?' అని అడుగుతూ ఉంటారు. సాహస ప్రవృత్తి, ఆరోగ్యం, గుండె ధైర్యం ఉన్నవాళ్ళే ఈ యాత్రకు సిద్ధపడడం మంచిదన్నది నా వ్యక్తిగత అనుభవం ద్వారా వచ్చిన అభిప్రాయం!

అద్భుతాల గుహ..

అదొక సున్నపురాతి గుహ. ఆ గుహలోకి అడుగుపెడితే ఆశ్చర్యం కలిగించే అద్భుత నిర్మాణాలు, పిల్లి, సింహం, ఇతర జీవులు విగ్రహాల్లా దర్శనమిస్తూ, కనువిందు చేస్తాయి. అలాగనీ వాటిని ఏ చిత్రకారులు చెక్కలేదు. అవి ప్రకృతి చెక్కిన ఆకృతులు. ఈ గుహ పేరు 'ఆల్ హుటా'. ఇరవై లక్షల సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ గుహ ఒమన్‌లోనే ప్రసిద్ధి గాంచిన పర్యాటక స్థలం.

ఎలా ఏర్పడిందంటే!

వర్షం కురిసినప్పుడు గాలిలోని కార్బన్‌డయాక్సైడ్ కరిగి, కార్బోనిక్ ఆమ్లం ఉత్పత్తి అవుతుంది. కార్బోనిక్ ఆమ్లం ఉన్న నీళ్లు పారడంతో గుహలోని సున్నపురాయి కరిగి విభిన్నమైన ఆకారాలు సహజ సిద్ధంగా ఏర్పడ్డాయి. ఒమన్‌లో ఇలాంటి గుహలు చాలా ఉన్నాయి. అయితే ఏ గుహలో లేని ఆకృతులు అల్ హూటా గుహ సొంతం. కార్బోనిక్ ఆమ్లం వల్ల 100 ఏళ్లలో 100 మిల్లీమీటర్ల సున్నపురాయి కరిగిపోతూ ఉంటుంది. ఈ క్రమంలో ఇక్కడ రాళ్ల దొంతరలు, పరదాల వంటివి ఏర్పడటానికి ఇరవై లక్షల సంవత్సరాలు పట్టింది.

ఇవీ ఆకర్షణలు:

గుహ లోపల భూమి నుంచి పొడుచుకు వచ్చినట్లుగా ఉండే పెద్ద సింహం, పిల్లి, ఇతర జంతువుల ఆకారాలు, గుహ పై భాగం నుంచి వేలాడుతూ ఉండే రకరకాల వింత రూపాలు, రంగు రంగుల్లో మెరిసిపోయే రాళ్ల వరసలు పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటాయి. ఈ గుహలో 800 మీటర్ల పొడవైన సరస్సు ఉంది. అరుదైన 'గ్యారెబ్యారెఇమియాయి' (బ్లైండ్ ఫిష్)అనే చూపు పూర్తిగా లేని చేపలను ఈ సరస్సులో చూడొచ్చు. గబ్బిలాలు, ఇతర కీటకాలు, మొలస్కాలు, నత్తలు, నీటి పురుగులు కూడా ఉంటాయి.

ఎలా వెళ్లాలి:

ఒమన్‌లోనే ఎత్తైన జబల్ షామ్స్ పర్వత పరిసర ప్రాంతాల్లో ఉంది అల్ హూట గుహ. ఒమన్‌లో నిజ్వా, బహ్లా పట్టణాలకు మధ్యన 34 కి.మీ. దూరంలో ఈ గుహ ఉంది. మస్కట్ నుంచి రెండు గంటలు ప్రయాణిస్తే 'ఆల్ హుటా' గుహ ఉన్న ప్రాంతానికి చేరుకోవచ్చు. అన్నట్టు అరేబియా ద్వీపకల్పంలో పర్యాటకులను అనుమతిస్తున్న, మొదటి, ఏకైక గుహ కూడా ఇదే!

ముందస్తు బుకింగ్:

సందర్శకులను విద్యుత్ రైల్లో గుహ ప్రవేశ ద్వారం వద్దకు తీసుకెళ్తారు.ఒక గంటలో గుహను చూసి రావడానికి అనుమతిస్తారు. పర్యావరణ శాఖ ఆదేశాల మేరకు రోజుకు 750 మంది పర్యాటకులకు మాత్రమే అవకాశం ఉంటుంది. ముందస్తు టికెట్ బుకింగ్ సౌకర్యం కూడా ఉంది.

అనుమతించే వేళలు:

మంగళవారం నుంచి ఆదివారం వరకు పర్యాటకులను ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల మధ్య గుహలోకి అనుమతిస్తారు. నాలుగున్నర కిలోమీటర్ల పొడవున్న ఈ గుహలో 500 మీటర్ల దూరం వరకు వెళ్లడానికి వీలుంటుంది. గుహ సమీపంలో అక్కడి భూగర్భశాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఒమన్ చరిత్ర, ఆల్ హూటా గుహతో పాటు, ఒమన్‌లోని ఇతర గుహల విశేషాలనూ తెలుసుకోవచ్చు.

గుహ పై భాగం నుంచి వేలాడుతూ ఉండే రకరకాల వింత రూపాలు, రంగు రంగుల్లో మెరిసిపోయే రాళ్ల వరసలు పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటాయి. అరుదైన 'గ్యారెబ్యారెఇమియాయి' అనే చూపు పూర్తిగా ఉండని చేపలను ఈ గుహలోని సరస్సులో చూడొచ్చు.

మనం మన ఆహారంతోపాటుగా అనుసరించే అంశాలలో నీరు తాగడం కూడా ఒకటి. అంతేకాదు, ఇది మనలో అనేక మందికి తప్పనిసరి అలవాటుగా ఉంటుంది. అవునా? ఆహారం సులభంగా కడుపులోకి వెళ్ళాలన్న ఆలోచనతో నీరు తరచుగా తీసుకోవడం జరుగుతుంటుంది. కొందరైతే ఆహారం కన్నా అధికంగా నీటిని తీసుకుంటూ ఉంటారు. లేనిచో దాహంతో కూడిన అనుభూతికి లోనవుతూ ఉంటారు. నీరు ఎంత గొప్పదయినప్పటికీ, జీవితంలో మనకు అందుబాటులో ఉండే అమృతం వలె ఉన్నప్పటికీ, రోజులో తరచుగా తీసుకుంటున్నాకూడా, భోజనం చేసేటప్పుడు సాధ్యమైనంత తక్కువగా వినియోగింపబడాలని గుర్తుంచుకోండి. కొందరైతే ఆహారం పూర్తిగా తీసుకున్న తర్వాత, ఒకేసారి నీటిని స్వీకరిస్తుంటారు. కానీ ఎంత సమయం తర్వాత తీసుకోవాలి, మరియు ఎంత మోతాదులో తీసుకోవాలి అన్న విషయాలు కూడా ప్రాముఖికంగా ఉంటాయి.

మొదట్లో ఈ నియమాన్ని అనుసరించడం కొంచెం అసాధ్యంగానే అనిపించవచ్చు, కానీ అలవాటుగా చేయడం మొదలుపెడితే క్రమంగా సులభమవుతుంది. ఇవన్నీ చదివిన తరువాత, మీ తల తిరిగే ప్రశ్న ఒకటి మెదులుతుంది. ఆహారం తీసుకున్న వెంటనే నీరు తాగవచ్చా? లేక కొంత సమయం వేచి ఉండాలా? అయితే ఎందుకు? ఆహారం తీసుకున్న తర్వాత, తక్షణమే నీరు ఎందుకు త్రాగకూడదు?

భోజనం చేసిన ఎంత సమయం తర్వాత

నీళ్ళు తాగాలి?

ఆహారం తరువాత మాత్రమే నీటిని పరిహరించాలి అన్నది తప్పు అని గ్రహించాలి. వాస్తవానికి ఇది మూడు విధాల ప్రక్రియగా ఉంటుంది. ఆహారం ముందు, ఆహారం తీసుకునే సమయంలో మరియు ఆహారం తీసుకున్న తర్వాత నీటిని తీసుకోవలసి ఉంటుంది. అది కూడా కొద్ది మొత్తాలలో.

ఆహారం తీసుకున్న తర్వాత నీటిని తీసుకునేందుకు కనీసం అరగంట వేచి ఉండాలని గుర్తుంచుకోండి. మరియు గ్లాసును మించిన మోతాదు లేకుండా చూసుకోండి. ఎందుకంటే, మనం మన ఆహారాన్ని జీర్ణం చేసుకోవడానికి సుమారుగా రెండు గంటల సమయం పడుతుంది. ఆహారం, మన అన్నవాహిక నుండి జీర్ణాశయానికి, ఆతర్వాత మన పెద్దపేగుకు చేరి, చివరకు మన శరీరం నుంచి బయటకు విసర్జించబడుతుంది.

మన దేహం ఆహారాన్ని జీర్ణం చేసే సమయంలో ఉత్పత్తి అయ్యే ఒక నిర్దిష్ట ద్రవం, ఘనస్థితిలో ఉంటుంది. ఆహారం తిన్న తరువాత నేరుగా నీటిని సేవించినప్పుడు ఈ సంతులనం అంతరాయానికి గురవుతుంది. ఇది ఆహారం జీర్ణం కావడానికి తీసుకునే సహజ సమయాన్ని అస్తవ్యస్తం చేయడంతో పాటుగా, సాధారణం కన్నా అధిక క్యాలరీల వినియోగానికి దారితీస్తుంది. అంతేకాకుండా కడుపు ఉబ్బరం వంటి జీర్ణ సంబంధ సమస్యలకు దారితీస్తుంది.

ఆహారం మరియు నీటిని వినియోగించే సమయంలో, కనీసం 30 నిమిషాల వ్యవధి ఉండాలని సిఫార్సు చేయబడుతుంది. ఈ 30 నిముషాలలో మన శరీరం జీర్ణక్రియలలోని తరువాతి దశలోనికి ప్రవేశిస్తాయి. ఆహారంతో పాటుగా నీరు అధికం తీసుకోవడం మూలంగా జీర్ణక్రియ ప్రక్రియలకి అంతరాయం ఉంటుంది. కానీ కాస్త వ్యవధిని ఇచ్చిన తర్వాత నీటిని కొద్ది మొత్తాలలో తీసుకోవడం ద్వారా, జీర్ణక్రియలు సులభంగా జరిగేందుకు వీలవుతుంది. ఆహారం తీసుకున్న తర్వాత నేరుగా నీటిని తాగడం మూలంగా జీర్ణక్రియలో అత్యంత ముఖ్యమైన జీర్ణ రసాలు మరియు ఎంజైములు కూడా కరిగింపబడుతాయి. క్రమంగా ఈ ఎంజైములు తక్కువగా ఉన్న కారణంగా మన శరీరంలో ఆమ్ల స్థాయిలు పెరిగేందుకు దారితీస్తుంది. క్రమంగా గుండెల్లో మంట, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలకు కూడా దారితీస్తుంది. ఒక్కోసారి తీసుకునే ఆహారాన్ని అనుసరించి తీవ్రతరం కూడా కావొచ్చు.

ఆహారాన్ని జీర్ణం చేసే సమయంలో, కొన్ని అవసరమైన పోషకాలు కూడా శరీరం ద్వారా శోషించబడతాయి; అయితే, భోజనం తరువాత నేరుగా నీటిని తాగడం మూలంగా, పోషకాలు శోషించుకునే ఆస్కారం లేక, నేరుగా జీర్ణవ్యవస్థకు తరలించబడుతాయి. క్రమంగా మీరు ఎంత పోషకభరితమైన ఆహారం తీసుకున్నా కూడా, సరైన పోషకాలు మీ శరీరానికి అందకుండా జీర్ణమైపోతాయి.

భోజనం తర్వాత నేరుగా నీటిని తీసుకునే అలవాటు కారణంగా, ఈ ప్రక్రియ జీర్ణక్రియను ప్రభావితం చేయడమే కాకుండా, మనం తీసుకునే ఆహారంలోని నాణ్యతను కూడా దెబ్బతీస్తుంది. అన్నిటిని మించి, నీటికి సహజ సిద్ధంగా ఆహార ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించే లక్షణాన్ని కలిగి ఉంటుంది. క్రమంగా మనం వినియోగించే అన్నిరకాల ఆహారాలకి చల్లదనాన్ని జోడిస్తుంది. కావున అతిశీతల నీటిని ఆహారం సమయంలో వినియోగించడం కూడా కడుపు ఉబ్బరం వంటి సమస్యలకు దారితీస్తుందని గుర్తుంచుకోవాలి.

ఇది మన శరీరాలకి నిజంగా ప్రతికూలమైన అంశంగా ఉంటూ, స్థూల కాయానికి కూడా దారితీస్తుందని చెప్పబడుతుంది. జీర్ణక్రియ ప్రక్రియను ప్రధానంగా ప్రభావితం చేయడం ద్వారా, జీర్ణ వ్యవస్థలో మిగిలిపోయిన జీర్ణంకాని ఆహారం ద్వారా అదనపు కొవ్వు నిక్షేపాలను పెంచడం ద్వారా ఊబకాయానికి దారితీయవచ్చు. మన శరీరంలో పేరుకుని ఉండే జీర్ణంకాని ఆహారం నుండి వెలువడే గ్లూకోజ్, కొవ్వుగా మారుతుంది.

క్రమంగా మన శరీరంలో స్థానం ఏర్పరచుకుంటూ ఉంటుంది.

దీని మూలంగా మన శరీరంలోని ఇన్సులిన్ స్థాయిలు పెరగడమే కాకుండా రక్తంలోని చక్కెర స్థాయిలు కూడా పెరగడానికి కారణమవుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం మూలంగా మధుమేహం, ఊబకాయం వంటి వ్యాధులకు దారితీస్తుంది.

ఊబకాయం మరియు మధుమేహం మాత్రమే కాకుండా, ఆహారం తరువాత నేరుగా నీటిని తీసుకోవడం ద్వారా, యూరిక్ యాసిడ్ స్థాయిలు, ఎల్ డిఎల్ కొలెస్ట్రాల్, వి.ఎల్.డి.ఎల్ మరియు ట్రైగ్లిజరైడ్లు కూడా పెరుగుతాయి. అన్నివేళలా మిమ్మల్ని మీరు హైడ్రేట్‌గా ఉంచుకోవాలని మరియు సాధ్యమైనంత వరకు నీటిని తాగాలని, క్రమంగా భోజనం విషయంలో, ఆహారం తీసుకున్న ముప్పై నిమిషాల తరువాత, నీరు తాగేలా అలవాటు చేసుకోండి. ఈలోపు అవసరమైతే ఒక సిప్ తీసుకోండి. ఏ అలవాటు కూడా అంత తేలికగా వెంటనే అలవడడం సాధ్యం కాదు. కానీ ఆరోగ్యం దృష్ట్యా ఆలోచన చేస్తే, ఒక క్రమశిక్షణ మరియు పట్టుదలమీద దేన్నైనా సాధించవచ్చునని గుర్తుంచుకోండి.

మీరు తీసుకునే ఈ చిన్నఅడుగును ఒక అలవాటుగా చేసుకోవడం ద్వారా మీకు మంచి జీర్ణ వ్యవస్థను అందివ్వగలుగుతుంది. కాబట్టి, నీటిని తరచుగా తాగండి, కేవలం ఆహారం తీసుకునే సమయంలో మాత్రమే కొన్ని జాగ్రత్తలు అనుసరించవలసి ఉంటుందని గుర్తుంచుకోండి.

ఎల్ డిఎల్ (తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రోటీన్లు, చెడు కొలెస్ట్రాల్):

దీన్నే చెడు కొలెస్ట్రాల్ అని కూడా వ్యవహరిస్తారు. పైన చెప్పిన విధంగా మన శరీరంలోని జీర్ణంకాని ఆహారం, శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడానికి దారితీసే ఫ్యాట్ గా మారుతుంది. అంతేకాక, ఎల్.డీ.ఎల్ కొలెస్టరాల్ స్థాయిలు పెరిగిననప్పుడు, ధమనులు, సిరల మధ్యలో కొవ్వు నిక్షేపాలు పేరుకునిపోవడం ద్వారా గుండెకు రక్తసరఫరాలో ఆటంకం ఏర్పడుతుంది. క్రమంగా ఈ పరిస్థితి శరీరంలో రక్తపోటును పెంచుతుంది, ఇది తరచుగా జరుగుతున్న ఎడల, గుండెపోటుకు కూడా దారితీస్తుంది.

వి.ఎల్.డి.ఎల్ (అతి తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రోటీన్లు):

ఎల్.డీ.ఎల్ కన్నా అధ్వాన్నమైన చెడు కొలెస్ట్రాల్ వి.ఎల్.డి.ఎల్. మన శరీరంలో వి.ఎల్.డి.ఎల్, జీర్ణ క్రియలు సక్రమంగా లేకపోవడం మూలాన పెరుగుతుంది. మరియు దీర్ఘకాలికంగా వి.ఎల్.డి.ఎల్ స్థాయిలు పెరిగుతున్న ఎడల, అది ప్రాణాంతకం కావొచ్చు.

యూరిక్ ఆమ్లం:

యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరగడం మూలాన మోకాళ్ల నొప్పులు, భుజం నొప్పులు కలగడంతో పాటుగా, మణికట్టు కీళ్లలో కూడా నొప్పి పెరిగేందుకు కారణంగా తయారవుతుంది. ఇది చీలమండలు, మోచేతులు, మణికట్టు వంటి ప్రదేశాలలో వాపుకు దారితీస్తుంది.

ట్రైగ్లిసరైడ్స్

జీర్ణంకాని ఆహార నిక్షేపాలు పేరుకుని పోవడం, భోజనం తర్వాత నేరుగా నీరు సేవించడం మూలాన ట్రైగ్లిసరాయిడ్స్ స్థాయిలు పెరగడానికి దారితీస్తుంది. ట్రైగ్లిసరాయిడ్స్ అనేవి ప్రాథమికంగా సహజ కొవ్వులుగా, మరియు నూనెల్లో ప్రధానమైన భాగాలుగా ఉంటాయి. అందువలన, అధిక ట్రైగ్లిజరైడ్ స్థాయిలు గుండె ప్రమాదాలకు దారితీయవచ్చు మరియు అత్యంత తీవ్రమైన పరిస్థితుల్లో మెదడు లేదా గుండెకు పూర్తిగా రక్తసరఫరాను ఆపివేసి, ప్రాణాంతకంగా పరిణమించవచ్చు. అంతేకాక, కొంత మంది ఆహారం తిన్న తరువాత ఐస్ కోల్డ్ వాటర్ త్రాగడానికి మొగ్గు చూపుతారు, ఇది జీర్ణ క్రియలను పూర్తిగా చంపేస్తుంది. ఇది మన శరీరంలో జీర్ణంకాని ఆహారం పేరుకుపోవడం, గుండె వైఫల్యం, మధుమేహం మరియు ఊబకాయం వంటి తీవ్ర పరిస్థితులకు కారణంగా మారుతుంది. అందువల్ల, మన జీవితంలో నీరు ఒక ముఖ్యమైన భాగంగానే కాకుండా కొన్ని పరిమితులతో కూడుకుని ఉంటుందని గుర్తుంచుకోవలసి ఉంటుంది. మరియు రోజులో 8 లీటర్ల కంటే తక్కువ నీటిని సేవించరాదని చెప్పబడుతుంది. అయితే దేనికైనా ఒక సమయం, సందర్భం ఉంటాయని మరచిపోకూడదు.

ప్రసవానంతరం ప్రశాంతంగా...

శిశువుకు జన్మనివ్వడం అనేది కేవలం శారీరక విషయమేమీ కాదు. అది స్త్రీ మనసును అమితంగా ప్రభావితం చేసే అంశం. సహజంగా ప్రసవం అనేది ఎక్కువ మందిలో ఆనందోద్వేగాన్ని నింపుతుంది. కానీ కొంత మందిలో అది కొన్ని మానసిక సమస్యలకు కూడా కారణం అవుతుంది. ఈ ప్రసవానంతర సమస్యలు (పోస్ట్‌పార్టమ్ బ్లూస్) ఒక్కొక్కరిలో ఒక్కో లక్షణంతో బయటపడుతుంటాయి. ఈ కారణంగా కొందరు తీవ్రమైన డిప్రెషన్‌కు గురయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇందుకు గల కారణాలేమిటో ఇప్పటి వరకూ అంత స్పష్టంగా తెలియదు గానీ, ప్రసవించగానే ప్రొజెస్టరాన్ హార్మోన్ నిల్వలు భారీగా పడిపోవడం ఒక ప్రధాన కారణం అన్నది ఎండోక్రినాలజిస్టుల అభిప్రాయం. అయితే బిడ్డకు చనుబాలు ఇస్తున్నప్పుడు ప్రొలాక్టిన్ విడుదల కావడంతో ఆమె మనసు శాంతించే అవకాశాలు ఉంటాయి. మందులు లేకుండానే రుగ్మత నుంచి బయటపడేలా చేసే ఒక సహజ మార్గమిది. అయితే ఈ ప్రయోజనం అందరికీ ఉండదు. మిగతా కొందరిలో వివిధ ప్రతికూల లక్షణాలు కనిపిస్తాయి.

వాటిల్లో ఆకలి తగ్గిపోవడం, నిద్రలేమి, ఏకాగ్రతా లోపాలు, ఆత్యన్యూనతా భావం వంటి లక్షణాలు ఉంటాయి. ఈ పరిస్థితిలో మానసిక వైద్యులు యాంటీడిప్రెషంట్లు, ట్రాంక్విలైజర్లు సూచిస్తుంటారు. పైన పేర్కొన్న లక్షణాలతో పాటు కొందరిలో నిరంతరమైన ఆందోళన, అసహనం, ఒళ్లంతా చెమటలు పట్టడం, మగతగా ఉండడం, గుండెదడ, కండరాలు బిగుసుకుపోవడం వంటివి కూడా కనిపిస్తాయి. ఈ స్థితిలో మానసిక వైద్యచికిత్సలు అవసరమైతే కౌన్సెలింగ్ కూడా ఇప్పించాలి. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు కూడా కొన్ని విధులు నిర్వహించాలి. ముఖ్యంగా....

మెలో ఉన్న లక్షణాలన్నీ ప్రసవానంతర రోజుల్లో అందరిలోనూ కనిపించేవేనని చెప్పాలి. అదే సమయంలో అవన్నీ తాత్కాలికమేనని, శరీరం కాస్త శక్తి పుంజుకోగానే అన్నీ సర్దుకుంటాయని కూడా చెప్పాలి.

భర్త లేదా ఇతర కుటుంబ సభ్యులు ప్రతి విషయంలోనూ చేదోడుగా ఉండాలి. అలా ఉన్నవారిలో ఈ సమస్యలు చాలా తక్కువగానే ఉంటాయి. ప్రత్యేకించి పాప ఆలనాపాలనా అంతా తల్లిపైనే వదిలేయకుండా, ఇంట్లో వాళ్లే అవన్నీ చూసుకోవాలి.

పిల్లల పోషణలో బాగా అనుభవం ఉన్న మహిళలు సాధ్యమైనంత ఎక్కువ సమయం ఆమెతో ఉండే ఏర్పాట్లు చేయాలి. ఈ స్థితిలో దూర ప్రయాణం గానీ, కొత్త ఉద్యోగాలకు లేదా కొత్త ప్రదేశాలకు తీసుకువెళ్లడంగానీ చేయకూడదు. విశ్రాంతి సమయాన్ని బాగా పెంచాలి. ఆ సమయంలో పిల్లలు ఆమెను ఇబ్బంది పెట్టకుండా చూడాలి.

ఎప్పుడూ ఒంటరిగా ఉంచకూడదు. రిలాక్స్ అయ్యే అవకాశాలు పెంచడంతో పాటు, ఆమె తన ఆత్మీయులను కలిసే అవకాశం కలిగించాలి. ఒక శిశు వైద్యుడు, ఒక మానసిక వైద్య నిపుణుడు అవసరమైనప్పుడు అందుబాటులో ఉండే ఏర్పాట్లు చేసుకోవాలి.

ఇవి తింటే బరువు పెరగరట..?

మామూలుగా ఏవి ఎక్కువగా తింటే బరువు పెరుగుతారన్న విషయం చాలా మందికి తెలిసే ఉంటుంది. కానీ బరువును తగ్గించే ఆహారపదార్థాలేమిటన్న విషయం చాలా మందికి తెలియకపోవచ్చు ఆరు రకాల ఆహారాల వల్ల బరువు పెరగరని నిపుణులు చెబుతున్నారు. ఉడికించిన కోడిగుడ్డు తింటే బరువు తగ్గుతారట! దీనిలోని ల్యూసిన్ అనే అమైనో యాసిడ్ బరువు తగ్గించడానికి సహాయపడుతుందట. అలాగే దానిమ్మ గింజలు ఎన్ని తిన్నా మంచిదే అని చెబుతున్నారు నిపుణులు. కొన్ని గింజలు తిన్నా కడుపు నిండిన ఫీలింగ్ కలిగి ఆహారం తీసుకోవలన్న కోరిక నశిస్తుందట! ఇక ఆహార పదార్థాల తయారీకి ఆలివ్ ఆయిల్ ఉపయోగిస్తే మంచిదని వారు చెబుతున్నారు. ఈ నూనెలోని మోనో శాచ్యురేటెడ్ ఫ్యాటీ

యాసిడ్స్ చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను కాపాడతాయి. కాబట్టి బరువు పెరిగే సమస్యే లేదు.

చేపల్లో కొవ్వు ఉండదు. అందుకే క్యాలరీలు చాలా తక్కువ. కాబట్టి మాంసాల జోలికి పోకుండా వీలైనంత ఎక్కువగా చేపలు తింటే నాన్ వెజ్ తిన్న ఫీలింగూ ఉంటుంది, బరువూ పెరగరు. పచ్చని కాయగూరలు, ఆకుకూరల్లో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల త్వరగా కడుపు నిండినట్టు అనిపిస్తుందట. కాబట్టి ముదురు ఆకుపచ్చ రంగుల్లో ఉండే కూరగాయలను ఎక్కువగా తింటే బరువు పెరగరు. వెజిటబుల్ సూప్స్ వల్ల కూడా క్యాలరీలు పెద్దగా పెరగవు. పైగా భోజనం ముందు వాటిని తాగితే కడుపు నిండినట్టు అనిపించి ఎక్కువ తినం.

జిమ్ రూల్స్

జిమ్‌కి వెళ్లి వ్యాయామం చేయటం మీదే దృష్టి పెడతాం. కానీ అందుకోసం వేసుకోవలసిన దుస్తులు, షూ గురించి పెద్దగా పట్టించుకోం. కానీ వ్యాయామం సౌకర్యంగా ఉండాలన్నా, వ్యాయామం వల్ల శారీరక సమస్యలు తలెత్తకుండా ఉండాలన్నా జిమ్ డ్రస్సింగ్‌లో కొన్ని నియమాలు పాటించాలి. అవేంటంటే...

షూ: సింపుల్ వర్కవుట్‌కి ఉపయోగపడే బేసిక్ రన్నింగ్ షూస్ వేసుకోవాలి. వ్యాయామం చేసే సమయంలో కాలి కీళ్లు దెబ్బతినకుండా ఉండాలంటే మేలు రకం స్పోర్ట్స్ షూ వేసుకోవటం తప్పనిసరి.

హుడీ: హుడీ వేసుకోవటం అలవాటున్నా లేకపోయినా అప్పుడప్పుడూ వేసుకుని వ్యాయామం చేస్తూ ఉండాలి. ఇది వేసుకుని వ్యాయామం చేయటం వల్ల చమట ఎక్కువగా పట్టి అదనపు కిలోలు తరుగుతాయి.

చమట పీల్చుకునే టీషర్ట్: ట్రైనింగ్ టీషర్ట్స్ ఎంచుకోవాలి. వ్యాయామం చేయటం వల్ల చమట పట్టి, ఆ చమటతో టీషర్ట్ తడిసిపోతే... అలాగే వర్కవుట్ చేయటం మనతోపాటు పక్కనున్నవాళ్లకూ అసౌకర్యంగా ఉంటుంది. కాబట్టి స్వెట్ రెసిస్టెంట్ మెటీరియల్‌తో తయారైన టీషర్ట్‌నే వేసుకోవాలి.

ఫిట్‌నెస్ ట్రాకర్: ఫిట్‌నెస్ గురించి అప్ టు డేట్ ఉండాలంటే ఫిట్‌నెస్ ట్రాకర్ ధరించాలి. గుండె కొట్టుకునే వేగం, ఖర్చయ్యే కెలోరీల లెక్క తెలియటం కోసం జిమ్‌కి వెళ్లేటప్పుడు ఫిట్‌నెస్ ట్రాకర్‌ని వెంట తీసుకెళ్లండి.

తాజా సాక్స్: వారం మొత్తానికి సరిపడా ఏడు జతల సాక్స్ ఉంచుకోవాలి. రోజూ సాక్స్ మారుస్తూ ఉంటే అవి దుర్వాసన రాకుండా



ఉంటాయి. పాదాలకు ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉంటుంది.

'గామి' స్క్రీన్‌ప్లే చాలా గ్రిప్పింగ్‌గా ఉంటుంది

- డైరెక్టర్ విద్యాధర్ కాగిత

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'గామి'. విద్యాధర్ కాగిత దర్శకత్వంలో కార్తీక్ కుల్ట్ క్రియేషన్స్‌పై కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రంలో చాందినీ చౌదరి కథానాయిక. ఈ సినిమాకు క్రౌడ్ ఫండ్ చేశారు. వి సెల్యులాయిడ్ ప్రజెంట్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ ట్రెమండస్ రెస్పాన్స్ తో హ్యూజ్ బజ్ ని క్రియేట్ చేసింది. ఈ చిత్రం మార్చి 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు విద్యాధర్ కాగిత విలేకరుల సమావేశంలో 'గామి' విశేషాలని పంచుకున్నారు.

'గామి' ప్రాజెక్ట్ ఎలా స్టార్ట్ అయ్యింది ? విశ్వక్ ఎలా వచ్చారు ?

నిజంగా జరిగిన ఓ సంఘటన నాకు చాలా ఎక్సయిట్ చేసింది. ఆ ఐడియాని రాసిపెట్టుకున్నాను. దీంతో పాటు హిమాలయాల పర్వాతాలు, మంచు, అక్కడ ప్రయాణం అంటే నాకు చాలా ఇష్టం. అలాగే విరలాచార్య లాంటి సాహస కథలు ఇష్టం. ఇవన్నీ కలసి ఒక ఆలోచనగా మారాయి. మనకి దొరికిన బడ్జెట్ లో తీసేద్దామనే లోచనతో మొదలుపెట్టాం. క్రౌడ్ ఫండ్ కోసం ఒక పిచ్ వీడియో చేశాం. దాని ద్వారా వచ్చిన డబ్బులతో సినిమానిస్టార్ట్ చేశాం. తర్వాత డబ్బులు అవసరమైతే నిర్మాత బయట నుంచి తీసుకొచ్చారు. తర్వాత ఒక గ్లింప్స్ చూసి యూవీ క్రియేషన్స్ వారు రావడం జరిగింది. నటుల కోసం చూస్తున్నపుడు విశ్వక్ ని అనుకున్నాం. అప్పటికి తన సినిమాలు ఏవీ రాలేదు. రెగ్యులర్ గా ఒక ఆడిషన్స్ లా చేశాం. చాలా ఓపెన్ మైండ్ తో తను ఈ ప్రాజెక్ట్ ని ఎంపిక చేసుకున్నారు. నిజంగా ఆయన ధైర్యాన్ని మెచ్చుకోవాలి. చాలా పెద్ద అలోచించారు.

గామికి ఐదేళ్ళు పట్టింది కదా.. ఇన్నేళ్ళ ప్రయాణంలో ఏం నేర్చుకున్నారు ?

మాకు ఒకటి కావాలి. దాని కోసం ఎంతవరకైనా చేసుకుంటూ వెళ్లాం. అవతార్ ని కూడా పదేళ్ళు తీస్తారు. దాన్ని డీలే అని చెప్పం కదా. అది చేయాలంటే ఒక సమయం పడుతుంది. కొత్తగా చేస్తున్నామని భావించాం. కాబట్టి సమయం పట్టిందనే భావన రాలేదు. ఆడియన్స్ కి కొత్త అనుభూతిని ఇవ్వడానికి.. విజువల్, మ్యూజిక్, టెక్నికల్ పరంగా కొత్తగా ప్రయత్నించామని భావిస్తున్నాం.

ట్రైలర్ లో చాలా పాత్రలు కనిపించాయి .. ఇది హైపర్ లింక్ స్టోరీనా ?

ఆ లింక్ గురించి ఇప్పుడే చెప్పడం సబబు కాదు. అది సినిమా చూసిన తర్వాత తెలుస్తుంది. అయితే ట్రైలర్ చూపినట్లుగానే ఆ పాత్రలన్నీ చాలా ఆసక్తికరంగా సాగుతాయి. సమద్, హారిక, చాందిని వీరందరినీ ఆడియన్స్ చేసే తీసుకున్నాం.

ఇలాంటి ట్రావెలింగ్ కథని ప్రేక్షకులకు ఆసక్తిగా చెప్పడానికి ఎలాంటి ఎలిమెంట్స్‌ని పొందుపరిచారు?

'గామి' సినిమా అంతా ఎంగేజింగ్‌గా వుండబోతుంది. తర్వాత ఏం జరగబోతుందనే క్యురియాసిటీ ప్రేక్షకుల్లో వుంటుంది. స్క్రీన్ ప్లే చాలా గ్రిప్పింగ్ గా వుంటుంది. ఇందులో డ్రామా చాలా అద్భుతంగా వుంటుంది. అది ప్రేక్షకులని సినిమాలో లీనం చేస్తుంది.

గామి టైటిల్ గురించి?

గామి అంటే సీకర్. గమ్యాన్ని చేరేవాడు. ఇందులో ప్రధాన పాత్రకు ఒక గమ్యం వుంటుంది. దాన్ని ఎలా చేరాడనేది చాలా ఆసక్తికరంగా వుంటుంది.

శంకర్ పాత్రకు ఏదైనా స్ఫూర్తి ఉందా ?

కొన్ని నిజజీవిత సంఘటనల ఆధారంగా కల్పించిన పాత్ర అది. ఫిక్షనల్ క్యారెక్టర్.

గామిలో మీకు సవాల్‌గా అనిపించింది?

మనం అనుకున్న ఎమోషన్స్ ని పెర్ఫార్మెన్స్ ల ద్వారా సరిగ్గా వ్యక్తం చేయించడం ఒక సవాల్. టెక్నికల్ గా ఎడిటింగ్ కూడా బిగ్గెస్ట్ సవాల్. కాంప్లెక్స్ సినిమాని ప్రేక్షకులందరినీ లీనం చేసేలా ఎడిట్ చేయడానికి చాలా కష్టపడ్డాం.

యూవీ వారు ప్రాజెక్ట్ లోకి వచ్చిన తర్వాత ఎలాంటి సపోర్ట్ వచ్చింది?

ఫైనాన్సియల్ ఫ్రీడమ్ వచ్చింది. అన్ని వనరులు పెరిగాయి. మాకు కావాల్సిన సమయం ఇచ్చారు. మేము ఎదో కొత్తగా చేస్తున్నామని వారు నమ్మారు. చాలా బిగ్గర్ స్కేల్ లో పోస్ట్ ప్రొడక్షన్స్ చేసుకునే అవకాశం ఇచ్చారు.

మీరు షార్ట్ ఫిల్మ్ నేపథ్యం నుంచి వచ్చారు కదా.. సినిమాకి దానికి ఎలాంటి తేడా గమనించారు ?

నా వరకూ రెండిని ఒకేలా చూస్తాను. ఏదైనా అదే అంకిత భావంతో పని చేస్తాను.

శంకర్ మహదేవన్ పాట గురించి ?

శంకర్ మహదేవన్ గారు మా సినిమాలో పాట పాడటం ఒక గౌరవంగా భావిస్తాను.

ఇందులో చాలా రిస్క్ సీన్లు చేశామని హీరో, హీరోయిన్లు చెప్పారు ?

నేను వాళ్ళతో పాటే వున్నాను. చేసిన ప్రతి రిస్క్‌ని ముందు నేను లేదా మా సహాయ దర్శకుడు చేసి చూపించడం జరిగింది. అందరం రిస్క్ అంచునే ప్రయాణం చేశాం.

ధూంధాం ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'ధూం ధాం'. సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలలో నటిస్తోన్న ఈ చిత్రాన్ని ఫైడే ఫ్రేమ్ వర్క్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రానికి దర్శకుడు సాయి కిశోర్ మచ్చ. గోపీ మోహన్ స్టోరీ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉన్న ఈ సినిమాను.. ఈ సమ్మర్‌కు రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మూవీ టీమ్ చిత్ర ఆన్ లొకేషన్‌లో రిలీజ్ చేశారు. ఈ 'ధూం ధాం' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను గమనిస్తే.. పెళ్లి బారాత్‌లో హీరోహీరోయిన్లు హ్యాపీగా డ్యాన్స్ చేస్తున్న స్టిల్‌ను ఫస్ట్ లుక్ పోస్టర్‌గా మేకర్స్ విడుదల చేశారు. కలర్ ఫుల్‌గా ఉన్న ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఓ మంచి లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా.. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు గా మేకర్స్ తెలిపారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను తెలియ జేస్తామని ఈ సందర్భంగా మేకర్స్ తెలియజేశారు.

కేరళ స్టోరీ హౌజ్ నుంచి బస్తర్ మూవీ

గతేడాది 'ది కేరళ స్టోరీ' చిత్రంతో సంచలన విజయం అందుకుంది ముంబై ముద్దుగుమ్మ ఆదా శర్మ. ఇక ఈ సినిమా ప్రశంసలతో పాటు విమర్శలు కూడా అందుకుంది. అయితే ఈ సినిమా అనంతరం ఆదాశర్మ మళ్లీ కేరళ స్టోరీ చిత్ర యూనిట్‌తో చేతులు కలిపిన విషయం తెలిసిందే. ఆదాశర్మ తాజాగా నటిస్తున్న చిత్రం 'బస్తర్: ది నక్సల్ స్టోరీ'. ఈ సినిమాకు కేరళ స్టోరీ దర్శకుడు సుదీప్తో సేన్ దర్శకత్వం వహిస్తుండగా.. విపుల్ అమృత్‌లాల్ షా, ఆషిన్ ఎ షా నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం మార్చి 15న విడుదల కానుంది.



ఇక విడుదల తేదీ దగ్గరపడటంతో ఇప్పటికే మూవీ నుంచి టీజర్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో జరిగిన మావోయిస్టుల అమానుషాల నేపథ్యంలో ఈ సినిమా రూపొందిస్తున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ సినిమాలో మావోయిస్టులను పట్టుకునే ఐపీఎస్ అధికారి నీరజా మాధవన్ పాత్రలో ఆదా శర్మ కనిపించనుంది. ఐసిస్, బోకోహరామ్‌ల తర్వాత ప్రపంచంలోనే అత్యంత క్రూరమైన తీవ్రవాదులు మావోయిస్టులే', పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధాల్లో కన్నా.. మావోయిస్టుల కారణంగానే చనిపోయిన సైనికులే ఎక్కువ.. అంటూ ట్రైలర్‌లో వచ్చిన డైలాగ్స్ ఇంట్రెస్టింగ్‌గా సాగాయి.

దేవర నుంచి జాన్వీ పోస్టర్ విడుదల

యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం నటిస్తోన్న భారీ ప్రాజెక్ట్ 'దేవర'. ఈ సినిమాతో ఎన్టీఆర్ మరోసారి మాస్ అవతార్‌లో తన సత్తా చాటడానికి సిద్ధమవుతున్నారు. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీ ఖాన్ కీలక పాత్రలో అలరించబోతున్నారు. డైరెక్టర్ కొరటాల శివ తెరకెక్కించబోతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా రూపొందుతోంది. అందులో తొలి భాగం 'దేవర పార్ట్ 1' ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్ 10న విడుదల కాబోతున్నట్లుగా ఇటీవలే మేకర్స్ ప్రకటించారు. బుధవారం జాన్వీ కపూర్ బర్త్‌డే స్పెషల్‌గా ఈ సినిమా నుండి ఆమె న్యూ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'దేవర' సినిమాలో జాన్వీ కపూర్ పేరు 'తంగం'. ఆమె పేరుతో పాటు నిండైన చీరు కట్టులో ఉన్న ఆమె లుక్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. బ్యూటీఫుల్ బ్యూటీ అంటూ అందరూ ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. దసరా స్పెషల్‌గా 'దేవర పార్ట్ 1' చిత్రం అక్టోబర్ 10న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. వాస్తవానికి ఈ సినిమాను ఏప్రిల్‌లోనే విడుదల చేయాలని ముందుగా మేకర్స్ డేట్ అనౌన్స్ చేశారు. కానీ పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల ఆలస్యం కారణంగా అక్టోబర్‌కి వాయిదా వేశారు.

కాగా.. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటి వరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్.. సినిమాపై ఓ రేంజ్‌లో అంచనాలను పెంచేసింది. 'దేవర' గ్లింప్స్ ఏ రేంజ్‌లో ట్రెండ్ అయిందో.. సోషల్ మీడియాలో ఎలాంటి రికార్డులను క్రియేట్ చేసిందో తెలిసిన విషయమే. అలాగే రీసెంట్‌గా రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తూ విడుదల చేసిన పోస్టర్ కూడా వైరలైంది. ఇప్పుడు జాన్వీ పోస్టర్‌తో మరోసారి 'దేవర' టాప్‌లో ట్రెండ్ అవుతోంది. ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, టామ్ ÷న్ చాకో, నరైన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుద్ సంగీత సారథ్యం వహిస్తుండగా శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రత్నవేలు సినిమాటోగ్రాఫర్‌గా, సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు.

ఆ ఒక్కటీ అడక్కు.. నుంచి ఓహ్ మేడమ్ పాట విడుదల

అల్లరి నరేష్ నటిస్తోన్న అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు' మల్లి అంకం దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. భరత్ లక్ష్మీపతి సహ నిర్మాత. మార్చి 22న విడుదలకు సిద్ధమవుతోన్న ఈ చిత్ర మ్యూజిక్ ప్రమోషన్స్‌ని మేకర్స్ ప్రారంభించారు. లీడ్ పెయిర్– అల్లరి నరేష్, ఫరియా అబ్దుల్లాపై చిత్రీకరించిన ఫస్ట్ సింగిల్ 'ఓహ్ మేడమ్' ను మ్యూజిక్ సెన్సేషన్ ఎస్ఎస్ థమన్ లాంచ్ చేశారు. మనసుని హత్తుకునే మెలోడీ నంబర్స్ స్కోర్ చేయడంలో స్పెషలిస్ట్ అయిన గోపీ సుందర్ ఈ ఎనర్జిటిక్ మెలోడీకి స్వరాలు సమకూర్చగా.. లిరిసిస్ట్ భాస్కరభట్ల కథానాయకుడిలోని భావాలను అద్భుతంగా వ్యక్తం చేశారు. అనురాగ్ కులకర్ణి తన ప్లజెంట్ వోకల్స్‌తో మ్యాజిక్ చేశాడు. మొత్తంగా, ఈ పాట ఇన్స్టంట్‌గా కనెక్ట్ అవుతుంది. అల్లరి నరేష్, ఫరియా అబ్దుల్లాల జోడి తెరపై ఫ్రెష్‌గా కనిపించింది. అల్లరి నరేష్ ఆమెతో ఫ్లర్ట్ చేస్తుండగా, ఆమె అతని కంపెనీని ఆనందిస్తుంది. ప్రస్తుతం ఈ పాట టాప్‌లో ట్రెండ్ అవుతోంది. వెన్నెల కిషోర్, జామీ లీవర్, వైవా హర్ష, అరియానా గ్లోరీ వంటివారు ఇతర పాత్రలలో నటిస్తున్న ఈ చిత్రానికి అబ్బూరి రవి రైటర్, సూర్య డీవోపీగా పని చేస్తున్నారు. ఈ చిత్రానికి చోటా కె ప్రసాద్ ఎడిటర్ కాగా, జె కె మూర్తి ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. మేకర్స్ ముందుగా అనౌన్స్ చేసినట్లుగా, ఈ చిత్రాన్ని 22 మార్చి న ప్రేక్షకుల ముందుకు గ్రాండ్‌గా తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

శర్వానంద్ కొత్త మూవీ లాంఛ్

టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ బ్యాక్ టు బ్యాక్ సినిమాల అప్‌డేట్స్‌తో అభిమానులను ఖుషీ చేస్తున్నాడు. ముందుగా ప్రకటించినట్టుగానే నయా అప్‌డేట్‌ను షేర్ చేసింది. ఈ మూవీ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మీ హెల్మెట్లను పట్టుకోండి.. రైడ్ వైల్డ్‌గా ఉండబోతుంది.. అంటూ క్యాప్షన్ ఇచ్చారు. గూస్‌బంప్స్ తెప్పించే అడ్వెంచరస్ రైడ్‌కు సిద్ధంగా ఉండండి.. అంటూ శర్వానంద్ షేర్ చేసిన లుక్ ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తోంది. లాంఛింగ్ స్టిల్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ.. సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి.

మరోవైపు శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శర్వాకు జోడీగా కృతి శెట్టి నటిస్తోంది. శర్వానంద్ మరోవైపు శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో శర్వానంద్ 35 చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.

ఈ మూవీకి మనమే టైటిల్ ఫిక్స్ చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ ని రిలీజ్ చేశారు. ఇక ఈ పోస్టర్‌లో శర్వానంద్ పక్కనే చిన్న బాబు కనిపిస్తున్నారు. పాపులర్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెరకెక్కిస్తోన్న ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. కథానుగుణంగా లండన్, హైదరాబాద్‌లో సినిమాను షూట్ చేశారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం.

తొలిదశలో స్థలం ఉన్నవారికే ఆర్థిక సాయం

భద్రాచలంలో 11న సిఎం చేతుల మీదుగా ఇల్లే పథకం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,మార్చి6(వెలుతురు): ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీలలో ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను అమలు చేశాం. ఈ నెల 11న భద్రాచలం రాములోని సన్నిధిలో ఐదవ గ్యారంటీ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నిరుపేదలకు నిలువ నీడను కల్పించడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల సహాయం అందించడానికి అవసరమైన కార్యచరణను ప్రారంభించిందన్నారు. బుధవారం సచివాలయంలో హౌసింగ్ కార్పొరేషన్ అధికారులతో ఇందిరమ్మ ఇండ్లపై మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలి విడతగా ఈ సంవత్సరం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్, జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పర్యవేక్షిస్తారని చెప్పారు. తొలి విడతలో సొంత స్థలం కలిగిన వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షల రూపాయలు మంజూరు చేయనున్నామని, 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా ఇండ్లను నిర్మించాలని, హాలు, బెడ్ రూమ్ తో పాటు వంటగది, బాత్ రూమ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మహిళల పేరుపైన ఇండ్లను మంజూరు చేస్తామని, ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆహార భద్రత కార్డు ఆధారంగా లబ్దిదారుల ఎంపిక చేస్తారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంభందించిన మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని అధికారులకు సూచించారు.

జూన్ 4, 5 తేదీల్లో ఐసెట్ పరీక్ష

తెలంగాణ ఐసెట్ 2024 నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్,మార్చి6(వెలుతురు): తెలంగాణ ఐసెట్ 2024 నోటిఫికేషన్ విడుదలైంది. 2024-25 విద్యా సంత్సరానికిగానూ ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు కాకతీయ యూనివర్సిటీ తెలంగాణ ఐసెట్ షెడ్యూల్ విడుదల చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ మార్చి 7వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 30 వరకు ఎటువంటి ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. దరఖాస్తు సమయంలో ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ కేటగిరీలకు చెందిన విద్యార్థులు రూ.500, ఇతరులు రూ.750 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవల్సి ఉంటుంది. రూ.500 అపరాధ రుసుముతో మే 27 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఐసెట్‌కు సంబంధించిన హాల్‌టికెట్లు మే 28 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో జూన్ 4, 5 తేదీల్లో ఐసెట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలంటే.. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీటెక్, బీ ఫార్మసీ కోర్సుల్లో మూడు లేదా 4 ఏళ్ల డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఇక ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు పొందేవారు బీసీఏ/ ఇంజినీరింగ్ కంప్యూటర్ సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ/బీఎస్సీ /బీకాం /బీఏలో మూడు సంవత్సరాల డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలి. ఇంటర్‌లో మ్యాథ్స్ సబ్జెక్ట్ తప్పనిసరిగా చదివి ఉండాలి. మొత్తం 150 నిమిషాల వ్యవధిలో 200 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు సమాధానలు రాయవల్సి ఉంటుంది. అమ్యాథమేటికల్ ఎబిలిటీ, నలిటికల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. నెగిటివ్ మార్కులు ఉండవు.

హైడ్రామాకు తెర

కోర్టు ఆదేశాలతో దిగివచ్చిన బెంగాల్ పోలీసులు

షాజహాన్ షేక్‌ను సీబీఐకి అప్పగించడంతో హైడ్రామాకు తెర

కోల్‌కతా,మార్చి6(వెలుతురు): పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో షాజహాన్ షేక్‌ను సీబీఐకి అప్పగించడంలో కొనసాగిన హైడ్రామాకు తెరపడింది. కోర్టు హెచ్చరికల నేపథ్యంలో బెంగాల్ పోలీసులు ఎట్టకేలకు అతడిని సీబీఐకి అప్పగించారు. పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులపై దాడి కేసులో ప్రధాన నిందితుడైన షాజహాన్ షేక్‌ను పోలీసులు ఎట్టకేలకు సీబీఐకి అప్పగించారు. బుధవారం సాయంత్రం 4.15గంటల కల్లా ఎట్టి పరిస్థితుల్లో అతడిని, కేసు వివరాలను కేంద్ర దర్యాప్తు సంస్థకి అప్పగించాల్సిందేనంటూ కలకత్తా హైకోర్టు డెడ్‌లైన్ విధించిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. దీంతో రెండు రోజులుగా బెంగాల్ ప్రభుత్వం, కేంద్ర ఏజెన్సీల మధ్య కొనసాగిన హైడ్రామాకు తెరపడినట్లయింది. సందేశ్‌ఖాలీలో దోపిడీ, భూకబ్జాలు, లైంగిక వేధింపుల కేసుల్లో షాజహాన్ షేక్ కీలక నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. నిజానికి, సందేశ్‌ఖాలీ కేసుకు సంబంధించిన దర్యాప్తు బాధ్యతలను కలకత్తా హైకోర్టు మంగళవారమే సీబీఐకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే, దీనిపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానం తలుపు తట్టింది. తాము తక్షణమే దీనిపై విచారణ జరపలేమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఈ పరిణామాల నేపథ్యంలో సీబీఐ బాధ్యతలు తీసుకొని మంగళవారం సాయంత్రానికే కేసు నమోదు చేసింది. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు సీబీఐ అధికారుల బృందం.. కోల్‌కతాలోని సీఐడీ ప్రధాన కార్యాలయానికి వెళ్లగా అక్కడ నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున షాజహాన్ షేక్‌ను అప్పగించేందుకు బెంగాల్ పోలీసులు నిరాకరించారు. దీంతో మంగళవారం దాదాపు రెండు గంటల పాటు వేచి చూసిన సీబీఐ బృందం అక్కడినుంచి ఖాళీ చేతులతో వెనుదిరగాల్సి వచ్చింది. బుధవారం సీబీఐ మరోసారి కలకత్తా హైకోర్టును ఆశ్రయించి పోలీసుల తీరును వివరించడంతో పాటు సీఐడీపై కోర్టు ధిక్కార కేసు నమోదు చేయాలని కోరింది. సుప్రీంకోర్టు దీనిపై ఎలాంటి స్టే విధించకపోవడంతో బెంగాల్ పోలీసుల తీరును తప్పుబట్టిన హైకోర్టు.. ఈ సాయంత్రం 4.15 గంటల కల్లా నిందితుడిని సీబీఐకి అప్పగించాల్సిందేనని ఆదేశించింది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం షాజహాన్ షేక్‌తో పాటు కేసుకు సంబంధించిన వివరాలన్నింటినీ బెంగాల్ పోలీసులు సీబీఐకి అప్పగించారు.

ఆరు గ్యారంటీల అమలుపై ప్రజలకు నమ్మకం కల్పించాలి

కార్యకర్తలకు మంత్రి కొండా సురేఖ సూచన

హైదరాబాద్,మార్చి6(వెలుతురు): మంత్రి కొండా సురేఖ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్ సమక్షంలో 11 మంది వరంగల్ కార్పొరేటర్లు కాంగ్రెస్ లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీ లను నమ్మి కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్ ను, కొండా దంపతులను నమ్మి కాంగ్రెస్ పార్టీ లో జాయిన్ అవుతామన్న వాళ్ళను బీఆర్ఎస్ నాయకులు చంపుతామని బెదిరిస్తున్నారన్నారు. ఆరు గ్యారంటీ లను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు నమ్మకం కల్పించాలని, మూడు సంత్సరాలుగా పైసా పనిచేయలేకపోయామని కార్పొరేటర్లు బాధ పడుతున్నారని ఆమె వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని, పోటీ పడి పని చేయాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లు గెలిచేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అండ ఉంటదన్నారు. బీఆర్ఎస్‌లో చేసిన తప్పులు ఇక్కడ చేయకుండా చూసుకోండని, అందరు ఒక కుటుంబం లాగా కలిసి పనిచేసి ప్రభుత్వాన్ని ముందుకు నడపాలన్నారు మంత్రి కొండా సురేఖ.

అమెరికా అధ్యక్ష బరి నుంచి నిష్క్రమించనున్న నిక్కీ హేలీ!

న్యూఢిల్లీ,మార్చి6(వెలుతురు): అమెరికా అధ్యక్ష బరి నుంచి నిక్కీ హేలీనిష్క్రమించనున్నారు. అధ్యక్ష పోటీకి కావాల్సిన మెజార్టీని ఆమె సాధించలేక పోయారు. దీంతో ఆమె బరి నుంచి తప్పుకునే పరిస్థితి నెలకొంది. దీంతో మరోసారి జో బైడెన్-ట్రంప్ మధ్యే ఫైటింగ్ జరగనుంది. అగ్రరాజ్యం అమెరికాలో అధికార పీఠం కోసం జరిగే ఎన్నికల్లో మరోసారి అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యర్థులుగా ఉండేటట్లు కనిపిస్తోంది. రిపబ్లికన్ పార్టీ తరఫున అభ్యర్థిత్వ రేసు నుంచి వైదొలగాలని భారత సంతతి నాయకురాలు నిక్కీ హేలీ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మరికొన్ని గంటల్లో ఆమె అధికారిక ప్రకటన చేయనున్నట్లు అమెరికా మీడియా వెల్లడించింది. మంగళవారం జరిగిన 'సూపర్ ట్యూస్‌డే ప్రైమరీల' పోరులో ఈమె దారుణంగా ఓడిపోయారు. రిపబ్లికన్ పార్టీలో అధ్యక్ష అభ్యర్థిత్వానికి ఎంపిక కావడానికి 1,215 మంది ప్రతినిధుల మద్దతు కావాల్సి ఉంటుంది. కానీ ఫలితాల తర్వాత ట్రంప్‌నకు 995 మంది మద్దతు ఉండగా.. హేలీ ఖాతాలో 89 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ట్రంప్‌తో పోలిస్తే భారీ వెనుకంజలో ఉన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పోటీని విరమించుకోవాలని నిర్ణయించుకున్నట్లు

సమాచారం. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 10 గంటలకు ఆమె ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. ప్రైమరీ ఎన్నికల్లో ట్రంప్‌నకు పోటీగా.. నిక్కీ హేలీ, వివేక్ రామస్వామితో పాటు డజను మందికి పైగా బరిలోకి దిగారు. అయితే ప్రైమరీలు మొదలైన నాటి నుంచే ట్రంప్ ఆధిక్యంలో కొనసాగారు. దీంతో ప్రధాన పోటీదారులు వరుసగా రేసు నుంచి వైదొలిగారు. చివరగా మిగిలిన హేలీ కూడా పోటీని విరమించుకునేందుకు సిద్ధమయ్యారు. అధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ తరఫున ట్రంప్ పోటీ ఖాయం కానుంది. అటు డెమోక్రాట్ల తరఫున బైడెన్ ముందంజలోనే ఉన్నారు. దీంతో మరోసారి బైడెన్-ట్రంప్ ఎన్నికల్లో తలపడనున్నారు. ఈ ఏడాది నవంబరులో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఇదిలా ఉంటే జో బైడెన్ ఆరోగ్యరీత్యా పోటీ నుంచి తప్పుకుంటారని వార్తలు వినిపించాయి. ఆయన స్థానంలో మాజీ అధ్యక్షుడు ఒబామా సతీమణి మిచెల్ పోటీ చేస్తారని వార్తలు వినిపించాయి. కానీ ఆ వార్తలను ఆమె ఖండించారు. అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం లేదని మిచెల్ తేల్చిచెప్పారు.

ఆశావహులకు చంద్రబాబు బుజ్జగింపులు

రెండో జాబితాపై టీడీపీ ఫోకస్

అమరావతి,మార్చి6(వెలుతురు): వచ్చే ఎన్నికల కోసం తెలుగుదేశం- జనసేన దూకుడుగా ముందుకెళుతున్నాయి. ఇప్పటికే పూర్తిస్థాయిలో ప్రజల్లోకి వివిధ కార్యక్రమాల ద్వారా రెండు పార్టీలు వెళ్తున్నాయి. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ లు ఉమ్మడిగా కీలక అంశాలపై ఎప్పటికప్పుడు చర్చించుకుంటూ ముందుకు వెళ్తున్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాల మీద ప్రణాళిక బద్ధంగా రెండు పార్టీలు అధినేతలు ముందుకెళ్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జరిగిన ఉమ్మడి బహిరంగ సభ ద్వారా చంద్రబాబు పవన్ కళ్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. ఆ తర్వాత జయహో బీసీ సదస్సు ద్వారా టిడిపి జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీలకు ఏం చేస్తాం అనే దానిపై స్పష్టతనిచ్చాయి. బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీ ఓట్లను తమకు అనుకూలంగా మార్చుకునేలా వ్యూహాత్మకంగా ముందుకెళుతున్నాయి. ఇక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే అభ్యర్థుల ప్రకటన కూడా పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నాయి మొదటి విడత టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థుల జాబితాను ఇప్పటికే ప్రకటించారు. మొదటి విడతలో 94 స్థానాలకు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఇక జనసేన పార్టీ కూడా 24 అసెంబ్లీ మూడు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేస్తుందని పవన్ కళ్యాణ్ కూడా ప్రకటించారు .మొత్తం 24 స్థానాల్లోనూ ఐదు స్థానాలకు అభ్యర్థులు ఎంపికను పూర్తి చేసింది జనసేన. ఆయా అభ్యర్థుల వివరాలను స్వయంగా పవన్ కళ్యాణ్ ప్రకటించారు. మిగిలిన 19 మంది అభ్యర్థులపై పవన్ కళ్యాణ్ త్వరలో ప్రకటిస్తారు. అయితే ఇదే సమయంలో టీడీపీ అధినేత మొదటి విడత జాబితా ప్రకటన తర్వాత క్షేత్రస్థాయిలో పరిస్థితులను చక్కబెట్టడం పైన దృష్టి సారించారు. మొదటి జాబితాలో టికెట్ దక్కని ఆశావహులు ను బుజ్జగించే పనిలో పడ్డారు చంద్రబాబు. మొదటి పెడతా అభ్యర్థుల ప్రకటన తర్వాత చోటు దక్కని ఆశవాహులు ఒక్కొక్కరుగా చంద్రబాబు నివాసానికి క్యూ

కడుతున్నారు. టిడిపికే కాకుండా జనసేనకు టికెట్లు కేటాయించిన స్థానాల్లోని మహిళతోపాటు టిడిపిలో ఒకరి కంటే ఎక్కువ ఆశావహులకు ఉన్న స్థానాల్లోని అభ్యర్థులను కూడా పిలిపించి స్వయంగా చంద్రబాబు మాట్లాడుతున్నారు. ఇప్పటికే కొన్ని రోజులుగా పలువురు ఆశావహులు ను పిలిచి వారందరికీ సర్ది చెప్పి పంపించేశారు చంద్రబాబు. తాజాగా మరి కొంతమంది ఆశావహులు చంద్రబాబుతో భేటీ అయ్యారు. అనకాపల్లి టీడీపీ ఇన్ చార్జి పీలా గోవింద్ చంద్రబాబును కలిశారు. ఇప్పటికే అనకాపల్లి టిక్కెట్లు జనసేన కేటాయించారు. దీంతో పీలా గోవింద్ కు చంద్రబాబు సర్ది చెప్పారు. మాజీ మంత్రులు కళా వెంకట్రావు, సోమిరెడ్డి చంద్రమోహన్ లు కూడా చంద్రబాబుతో విడివిడిగా భేటీ అయ్యారు. ఎచ్చెర్ల అసెంబ్లీ స్థానాన్ని తనకు కేటాయించాలని కళా వెంకట్రావు చంద్రబాబును కోరారు. సర్వేపల్లి ఇక్కడి పై ఆశలు పెట్టుకున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మొదటి జాబితాలో స్థానం దక్కకపోవడంతో చంద్రబాబును కలిసి మాట్లాడారు. ఎంపీ రామ్మోహన్ నాయుడు తో కలిసి చంద్రబాబు నివాసానికి వచ్చారు గౌత శివాజీ. పలాస టిక్కెట్ ను గౌతు శివాజీ కుమార్తె గౌత శిరీష ఆశిస్తున్నారు. మొదటి జాబితాలో చోటుదక్కని పెందుర్తి టిక్కెట్ ఆశిస్తున్నా బండారి సత్యనారాయణమూర్తి కుమారుడు అప్పలనాయుడు కూడా చంద్రబాబు నివాసానికి వచ్చారు. ఎంపీ రామ్మోహన్ నాయుడుతో కలిసి ఆయన చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఎంపీ లావు కృష్ణదేవరాయలు వినుకొండ అభ్యర్థి జీవి ఆంజనేయులు కూడా చంద్రబాబును కలిశారు. పల్నాడు జిల్లాలో పెండింగ్ లో ఉన్న స్థానాలకు అభ్యర్థులు ఎంపికపై చర్చించినట్లు సమాచారం. నిన్న టీడీపీలో చేరిన గుమ్మనూరు జయరాం అనుచరులు చంద్రబాబు సమక్షంలో ఈరోజు పసుపు కండువా కప్పుకున్నారు. గుంతకల్లు టిక్కెట్ ఆశిస్తున్నట్లు గుమ్మనూరు జయరాం చెప్పారు. ఆశావహులను బుజ్జగించిన చంద్రబాబు%ొ% కొంతమందికి రెండో జాబితాలో టిక్కెట్ ఇస్తానని హామీ ఇవ్వడంతో పాటు మరికొంత మందికి అధికారంలోకి రాగానే కీలక స్థానాలు ఇస్తానని భరోసా ఇచ్చినట్లు తెలిసింది. చంద్రబాబుతో భేటీ తర్వాత ఆయా నేతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే రెండో జాబితా విడుదల చేసేందుకు చంద్రబాబు సిద్ధమవుతున్నారు.

ప్రతి నియోజకవర్గంలో ఒక క్లస్టర్

విడతల వారీగా క్లస్టర్ల పరిధిలో వీడియో కాన్ఫరెన్

ఎంత కష్టం వచ్చినా రైతులకు అండగా ప్రభుత్వం

ప్రస్తుతం రాష్ట్రంలో కరువు పరిస్థితులున్నాయి

కలిసికట్టుగా కరువును ఎదుర్కొందాం

రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం

హైదరాబాద్,మార్చి6(వెలుతురు): తెలంగాణలో కొత్త కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సీఎం మాట్లాడారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 110 రైతు వేదికల్లో ఏర్పాట్లు చేశారు. రైతు నేస్తం ప్రారంభ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. రైతు నేస్తం ద్వారా డిజిటల్ సేవలు అందిస్తారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. ప్రస్తుతం ప్రతి నియోజకవర్గంలో ఒక క్లస్టర్ ను ఎంపిక చేశారు. విడతల వారీగా 2, 601 క్లస్టర్ల పరిధిలోని రైతు వేదికలకు వీడియో కాన్ఫెరెన్ సౌకర్యం కల్పిస్తారు. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం రూ. 100 కోట్ల వరకు ఖర్చు చేయనుంది. కరువు వచ్చినా.. ఎంత కష్టం వచ్చినా రైతులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కరువు పరిస్థితులున్నాయన్నారు. కలిసికట్టుగా కరువును ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. ఏడాదిగా సరైన వర్షపాతం లేకపోవటంతో రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటుతున్నాయని తెలిపారు. అందుకే అన్ని ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. రిజర్వాయర్ల నుంచి నీళ్లు విడుదల చేయాలని కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్ ప్రాంతంల్లోని రైతులు, నాయకులు డిమాండ్ చేస్తున్నారని సీఎం చెప్పారు. రైతుల పరిస్థితిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వేసవిలో తాగునీటి కష్టాలు రాకుండా చూడాల్సిన అవసరముందన్నారు. అందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం అన్నారు.పలువురు రైతులు కాన్ఫరెన్స్ లో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. తాము పండిస్తున్న పంటల ద్వారా లాభాలు సాధిస్తున్న తీరును వివరించారు. రైతు నేస్తం కార్యక్రమానికి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం సహకారం అందిస్తోంది. అధికారులతోపాటు వ్యవసాయ నిపుణులు నేరుగా పంట పొలాల నుంచి రైతులతో ముఖాముఖి మాట్లాడి వాళ్ల సమస్యలను తెలుసుకుంటారు. సాగుపై సలహాలు, సూచనలతోపాటు అధునాతన మెలకువలను అందిస్తారు. ఆదర్శ రైతుల తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకునేందుకు వీలు కల్పిస్తారు. రైతు నేస్తం ప్రారంభోత్సంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు పాలుపంచుకున్నారు. ప్రతి సీజన్ లో రైతులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించేందుకు సలహాలు, సూచనలిచ్చేందుకు రైతు నేస్తం ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి అన్నారు. నేరుగా రైతులు వ్యవసాయ నిపుణులతో మాట్లాడేందుకు వీలు కలుగుతుందన్నారు. విత్తనాలు, ఎరువులు, ఏ పంట వేయాలనేది మొదలు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునేంత వరకు ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కాకుండా లాభసాటి ధర రావాలనే ఆలోచనతో ప్రభుత్వం కార్యాచరణ చేస్తోందన్నారు. రైతు భరోసా, రైతు రుణ మాఫీ, రైతులకు విత్తనాలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఐకేపీ సెంటర్లు, మార్కెట్ యార్డుల ద్వారా పంట ఉత్పత్తుల కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో దాదాపు 26 రకాల పంటలు పండటానికి అనుకూలమైన భూములు, వాతావరణం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వరి, పత్తి , మిర్చీ పంటలకే పరిమితం కావద్దని రైతులకు సూచించారు. ఇతర పంటలు సాగు చేయాలని కోరారు. పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. తక్కువ నీళ్లతో, తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంట దిగుబడి, ఎక్కువ లాభాలు వచ్చేలా పంటల ప్రణాళిక చేసుకోవాలని చెప్పారు.వ్యవసాయ శాఖ చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం 110 సెంటర్లలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన రైతు నేస్తంను భవిష్యత్తులో అన్ని గ్రామాలకు విస్తరిస్తామని చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన సూచనలతో ప్రభుత్వం ఇటీవల పంటల భీమా పథకాన్ని అమల్లోకి తెచ్చిందని గుర్తు చేశారు. రైతులు చనిపోతే ఆ కుటుంబాన్ని రైతు బీమా పథకం ఆదుకుంటుందన్నారు. రైతులు ధీమాగా బతికేందుకు వీలుగా పంటల బీమా పని చేస్తుందని చెప్పారు. పంట పెట్టుబడి పెట్టినప్పటి నుంచి కరువు వచ్చినా, వరద వచ్చినా నష్టపరిహారం అందుతుందన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడి వారికి తిరిగి వస్తుందని అన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి ఉండదన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా రైతులు ధైర్యం కోల్పోవద్దన్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి భరోసా కల్పించారు.

'రాహుల్ యాన్' ప్రయోగం 19 సార్లు విఫలం

ప్రధాని చంద్రయాన్‌ను ప్రారంభించారు..

సోనియా 'రాహుల్‌యాన్'ను ప్రయోగిస్తున్నారు

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శలు

జలగావ్,మార్చి6(వెలుతురు): కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం మహారాష్ట్రలో బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇండియా కూటమిపై మాటలతో దాడి చేసారు. మహారాష్ట్రలోని జలగావ్‌లో జరిగిన యువ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ.. సోనియా గాంధీ చేపట్టిన 'రాహుల్ యాన్' ప్రయోగం 19 సార్లు ఘోరంగా విఫలమైందని, 20వ ప్రయత్నానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం మహారాష్ట్రలో బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇండియా కూటమిపై మాటలతో దాడి చేసారు. మహారాష్ట్రలోని జలగావ్‌లో జరిగిన యువ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ..సోనియా గాంధీ చేపట్టిన 'రాహుల్ యాన్' ప్రయోగం 19 సార్లు ఘోరంగా విఫలమైందని, 20వ ప్రయత్నానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అన్నారు. ఒకవైపు ప్రధాని మోడీ చంద్రయాన్ మిషన్‌ను ప్రారంభించారు. మరోవైపు సోనియాగాంధీ 20వ సారి రాహుల్ గాంధీని ప్రయోగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆమె 19 సార్లు 'రాహుల్-యాన్'ను ప్రయోగించారు, అన్నీ విఫలమయ్యాయి'' అని జల్గావ్ ర్యాలీలో అమిత్ షా పేర్కొన్నారు. .తమ కుమారులు, కూతుళ్లు ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి కావాలని ఆ పార్టీ నేతలు కోరుకుంటున్నారని ఆయన ఇండియా కూటమి పార్టీలపై దాడి చేశారు. సోనియా రాహుల్‌ని ప్రధానిని చేయాలని, ఉద్ధవ్ (ఠాక్రే) తన కొడుకు ఆదిత్యను ముఖ్యమంత్రిని చేయాలని, (శరద్) పవార్ తన కుమార్తెను ముఖ్యమంత్రిని చేయాలని, మమతా దీదీ తన మేనల్లుడిను ముఖ్యమంత్రిని చేయాలని, స్టాలిన్ తన కుమారుడిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రయత్నిస్తున్నారు." అని బీజేపీ నేత అమిత్ షా అన్నారు. అమిత్ షా తన ప్రసంగంలో, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పార్లమెంటులో తనను కలవడానికి వచ్చిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేస్తే జమ్మూ కాశ్మీర్‌లో ప్రతిచోటా రక్తపాతం జరుగుతుందని చెప్పారని ఆయన అన్నారు.

"రక్తం గురించి మరచిపోండి, గులకరాళ్లు కూడా విసిరేందుకు ఎవరూ సాహసించలేదు" అని అమిత్ షా తన ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశంసించారు. యువత తమ ప్రాంచైజీని వినియోగించుకునే ముందు సాధకబాధకాలను క్షుణ్ణంగా బేరీజు వేసుకోవాలని ఆయన కోరారు.'బీజేపీకి ఓటేయడం అంటే యువత ఉజ్వల భవిష్యత్తు కోసం, గొప్ప భారతదేశాన్ని నిర్మించడం కోసం ఓటేయడం.. బీజేపీకి ఓటేయడం అంటే నరేంద్ర మోడీని మూడోసారి ప్రధానిని చేయడం కోసం ఓటేయడమే' అన్నారాయన.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar